




ESTD: 1999

www.voodayam.com

# వుదయం

ఖమ్మం | 30-03-2026 సోమవారం | సంపుటి : 13 | సంచిక : 261 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal

Follow us on







## మైనింగ్‌పై మాటల ఫైరింగ్

### శాసన సభ చివరి రెండు రోజులు బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్

### రెండో రోజూ రాఘవ కన్ స్ట్రక్షన్స్ పై గురిపెట్టిన ప్రతిపక్షం

- గన్ పార్క్ నుంచి అసెంబ్లీ వరకు పాదయాత్ర
- మంత్రి పొంగులేటిని భర్తరఫ్ చేయాలని డిమాండ్
- స్పీకర్ పోడియం ముందు నిరసన
- సిఎం, డిప్యూటీ సిఎం ఆగ్రహం
- ధరణి పేరిట హరీశ్ రావు సోదరులు, ఆయన మామ భూదోపిడీ : ముఖ్యమంత్రి
- కడియంపై నోరు జారిన కౌశిక్ రెడ్డి
- ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదు
- నేడు బిల్లుల ఆమోదం తరువాత సభ వాయిదా







**హైదరాబాద్, మార్చి 29 (వుదయం ప్రతినిధి) :** మైనింగ్ అక్రమాలపై రాష్ట్ర శాసన సభ అట్టుడికింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కుటుంబీకులకు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మైనింగ్ అక్రమాలపై హౌస్ కమిటీ వేసి విచారణ కోరుతూ బీఆర్ఎస్ సభ్యులు చేపట్టిన నిరసన ఉద్రిక్తతకు దారి తీసింది. ఆదివారం అసెంబ్లీ ప్రారంభమైన వెంటనే మంత్రి పొంగులేటి లక్ష్యంగా ఆందోళన చేపట్టిన ప్రతిపక్ష సభ్యులు శాసన సభ కార్యకలాపాలకు అడ్డుపడ్డారు. మంత్రి పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మైనింగ్‌పై హౌస్ కమిటీ వేయాలని నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియం ముందు బైఠాయించారు. దీంతో ఈ బడ్జెట్ సెషన్ సమావేశాలు ముగిసే వరకు ప్రతిపక్ష సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు సస్పెన్షన్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానం మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ సమావేశాలు ముగిసే వరకు బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. సభలో

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన**

రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై సభా సంఘం వేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గళమెత్తారు. కేటీఆర్, హరీశ్‌రావు నేతృత్వంలో గన్‌పార్క్ వద్ద నిరసన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అసెంబ్లీకి కాలి నడకన వచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సాగించిన అక్రమాలను తాము ఆధారాలతో సహా బయటపెట్టామన్నారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన ఇతర సంస్థలపై కఠిన చర్యలు తీసుకున్న ప్రభుత్వం, రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పు చేయకపోతే విచారణకు భయమెందుకు? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేవలం సభా సంఘమే కాకుండా, మంత్రులపై వస్తున్న అవినీతి ఆరోపణలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. కీలకమైన బడ్జెట్ చర్చ జరగకుండా బీఆర్ఎస్ సభ్యులు అడ్డుతగలడం విచారకరం అని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు విమర్శించారు. మరోవైపు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీ అవినీతిపై ప్రశ్నించినందుకే కాంగ్రెస్ ప్రభుత్వం స్పీకర్ ద్వారా తమను శాసన సభ నుంచి సస్పెండ్ చేసిందని బీఆ ర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. మంత్రి అవినీతిని ప్రశ్నించిన హరీశ్ రావు ఆయన బర్తరఫ్ కు డిమాండ్ చేసినందుకే.. సస్పెండ్ చేస్తారా అంటూ నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్ అనంతరం సభ నుంచి బయటకు వస్తూ నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. సస్పెండైన హరీశ్ రావు, కేటీఆర్, జగదీశ్ రెడ్డి, గంగుల కమలాకర్ సహా ఎమ్మెల్యేలు నిరసనలో పాల్గొన్నారు.

మిగతా 2లో

## సోలార్ వినియోగంలో ఆదర్శంగా నిలవాలి

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మార్చి 29 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణను హరిత శక్తి సామర్థ్య రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా



చేపట్టిన "మోడల్ సోలార్ విలేజ్" కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. ఆదివారం అసెంబ్లీ హాల్లో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆయన వ్యక్తిగతంగా లేఖలు అందజేశారు. ప్రతి ప్రజాప్రతినిధి తన సొంత గృహంలో 2కి.వా గ్రిడ్-కనెక్టెడ్ సోలార్ రూఫ్‌టాప్ సిస్టమ్‌నుఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజల్లో సౌర విద్యుత్ పట్ల అవగాహన కల్పించాలంటే ముందుగా నాయకులే ఆదర్శంగా నిలవాలన్న ఆయన తద్వారా నివాస ప్రాంతాలను విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలుగా మార్చవచ్చని ఆకాంక్షించారు. ఈ విధానంతో గృహ విద్యుత్ ఖర్చులు తగ్గడమే కాకుండా, రాష్ట్ర హరిత శక్తి గ్రిడ్‌కు గణనీయమైన సహకారం అందుతుందని వివరించారు. ఆసక్తి గల ప్రజాప్రతినిధులు తమ నివాస చిరునామా, తాజా విద్యుత్ బిల్లు ప్రతులను ఖైరతాబాద్‌లోని టీజీ రెడ్ కో కార్యాలయంలో అందజేయాలని కోరారు. వీటి ఆధారంగా సాంకేతిక బృందం సర్వే నిర్వహించి ఇన్‌స్టాలేషన్ ప్రక్రియను పూర్తి చేస్తుందని తెలిపారు. కార్బన్ న్యూట్రాలిటీ సాధన, శక్తి-సమృద్ధ తెలంగాణ నిర్మాణంలో ఈ నిర్ణయం ఒక కీలక అడుగు అని భట్టి విక్రమార్క ఆ లేఖల్లో పేర్కొన్నారు.

## కన్నవారి బిల్లుకు ఆమోదం

### తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే జీతంలో మినహాయించి ప్రభుత్వమే వారి ఖాతాలో జమ చేస్తుంది

**హైదరాబాద్, మార్చి 29 (ఎఎంఎస్) :** తల్లిదండ్రుల సంరక్షణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి హెచ్చరిక జారీ చేసింది. ఆదివారం శాసనసభలో "తెలంగాణ ఉద్యోగుల జవాబుదారీతనం, తల్లిదండ్రుల సహాయ పర్యవేక్షణ బిల్లు-2026"కు ఆమోదం లభించింది. ఎవరైనా ఉద్యోగి తన తల్లిదండ్రులను పట్టించుకోకుండా, వారి కనీస అవసరాలను విస్మరిస్తే, వారి మొత్తం జీతంలో 15 శాతం లేదా రూ. 10,000 (వీటిలో ఏది తక్కువైతే అది) కట్ చేసి నేరుగా తల్లిదండ్రుల ఖాతాలో జమ చేస్తారు. ఈ బిల్లు కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా.. ప్రభుత్వ రంగ సంస్థలు, గ్రాంట్-ఇన్-ఎయిడ్ పొందే సంస్థలు, ప్రైవేటు రంగ ఉద్యోగులకు కూడా వర్తిస్తుంది. వీరితో పాటుఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సర్పంచ్ లూ ఈ చట్టం పరిధిలోకి రావడం విశేషం.



**ఫిర్యాదు ఎవరికి చేయాలి?..**

నిరాదరణకు గురవుతున్న తల్లిదండ్రులు నేరుగా జిల్లా స్థాయిలో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి (జిల్లా కలెక్టర్)కు ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు అందిన 60 రోజుల్లోగా విచారణ పూర్తి చేసి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ జిల్లా స్థాయి అధికారి తీర్పుపై అసంతృప్తి ఉంటే, 'వయోవృద్ధుల కమిషన్'లో అప్పీల్ చేసుకునే అవకాశం కూడా ఉంది. మారుతున్న జీవనశైలి కారణంగా ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమై, వృద్ధాప్యంలో తల్లిదండ్రులు ఒంటరివారవుతున్నారని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. "తల్లిదండ్రులు భారతీయ కుటుంబ వ్యవస్థలో విడదీయలేని భాగం. వారిని గౌరవంగా చూసుకోవడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత. ఈ చట్టం ద్వారా ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెరగడమే కాకుండా, సమాజంలో ఒక మంచి మార్పు వస్తుందని ఆశిస్తున్నాం," అని ప్రభుత్వం పేర్కొంది. తల్లిదండ్రుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారికి ఈ బిల్లు ఒక గుణపాఠం అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## నేడు, రేపు భారీ వర్షాలు

**హైదరాబాద్, మార్చి 29 (వుదయం ప్రతినిధి) :** ఎండ వేడిమితో అల్లాడిపోతున్న ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లని కబురు చెప్పింది. నేడు, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బలమైన ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో ఉత్తర, పశ్చిమ, మధ్య దక్షిణ తెలంగాణ జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారిపోతుందనీ, హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో వడగండ్ల

> ఉత్తర, పశ్చిమ, మధ్య దక్షిణ తెలంగాణ జిల్లాలో మారనున్న వాతావరణం

వాన, బలమైన గాలులు వీచే ప్రమాదముందని వివరించింది. ఈ నేపథ్యంలో అకాల వర్షాలతో పంట నష్టం కలగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. కోత దశలో ఉన్న పంటలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

మిగతా 2లో

## గో సంరక్షణకు ప్రణాళికలు

### పీపుల్ ఫర్ యానిమల్స్ బృందంతో భేటీలో సిఎం



**హైదరాబాద్, మార్చి 29 (ఎఎంఎస్) :** తెలంగాణలో గోవుల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పక్కా ప్రణాళికలు రూపొందించిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఎన్కేపల్లిలో అత్యాధునిక సౌకర్యాలతో విశాలమైన ప్రదేశంలో గోశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయాన్నిఈ సందర్భం గా గుర్తు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ముఖ్యమైన ఆలయాల సమీపంలో కూడా గోశాలల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసి నట్లు తెలిపారు. ప్రముఖ జంతు హక్కుల కార్యకర్త, పీపుల్ ఫర్ యానిమల్స్ అధ్యక్షురాలు మేనకా గాంధీ, ఆమె బృందం సీఎం రేవంత్ రెడ్డిని ఆదివారం అసెంబ్లీ సమావేశ హాలులో భేటీ అయ్యారు.

మిగతా 2లో

## అమెరికాకు 3 బి. డాలర్ల నష్టం

**వుదయం డెస్క్, మార్చి 29 :** ఇరాన్‌తో యుద్ధం అమెరికా సైనిక ఆస్తులకు గణనీయమైన నష్టాన్ని కలిగించిందని ది వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదిక పేర్కొంది. మొదటి మూడు వారాల్లోనే నష్టాలు, మరమ్మతుల విలువ 1.4 బిలియన్ డాలర్ల నుంచి 2.9 బిలియన్ డాలర్ల మధ్య ఉంటుందని అంచనా. మధ్యప్రాచ్యం అంతటా అమెరికా, దాని మిత్ర దేశాల మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్ దాడుల వల్లే ఈ నష్టం ఎక్కువగా జరిగిందని భావిస్తున్నారు. వైట్ హౌస్‌కు పంపిన 200 బిలియన్ డాలర్ల అదనపు వ్యయ అభ్యర్థన ప్రతిపాదనలో పెంటగాన్ ఈ నష్టాలకు లెక్కలు చూపనుంది.

**యుద్ధ విమానాల నష్టాలు**

అత్యంత విలువైన నష్టాలలో అధునాతన యుద్ధ విమానాలు కూడా ఉన్నాయి. మార్చి 1న, కువైట్‌కు చెందిన ఒక ఎఫ్/ ఎ-18 విమానం పొరపాటున మూడు ఎఫ్-15ఇ స్ట్రైక్ ఈగిల్ విమానాలను కూల్చివేసింది, అయినప్పటికీ సిబ్బందిలోని ఆరుగురు సురక్షితంగా బయటపడ్డారు. ప్రతి జెట్ విమానం విలువ సుమారు 100 మిలియన్ డాలర్లని అంచనా. మార్చి 19న ఒక ఎఫ్-35ఎ లైట్నింగ్ 2 కూడా అత్యవసరంగా ల్యాండ్ అయింది, తాము ఆ విమానాన్నే లక్ష్యంగా చేసు



కున్నామని ఇరాన్ పేర్కొంది. ప్రతి ఎఫ్-35ఎ విమానం విలువ సుమారు 82.5 మిలియన్ డాలర్లు.

**టాంకర్లు - సిబ్బంది నష్టాలు..** ఈ సంఘర్షణ గగనతల ఇంధన సరఫరా కార్యకలాపాలను కూడా ప్రభావితం చేసింది. ఇరాక్‌పై గగనతలంలో మరో ట్యాంకర్‌ను ఢీకొన్న తర్వాత ఒక కెసి-135 స్ట్రాటోట్యాంకర్ కూలిపోయింది, ఈ ఘటనలో ఆరుగురు సిబ్బంది మరణించారు.దీనికి తోడు, సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్‌పై ఇరాన్ జరిపిన క్షిపణి దాడిలో ఐదు కెసి-135 విమానాలు దెబ్బతిన్నాయి. ఈ విమానం తయారీ నిలిచిపోయినందున, దీని స్థానంలో సుమారు 165 మిలియన్ డాలర్లు ఖర్చయ్యే కెసి-46 పెగాసస్ విమానాలను తీసుకువచ్చే అవకాశం ఉంది.

**డ్రోన్ల సముదాయంపై దాడి..** మానవరహిత వైమానిక వ్యవస్థలు పదేపదే నష్టాలను చవిచూశాయి. సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి డజనుకు పైగా ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు ధ్వంసమయ్యాయి. వీటిలో కనీసం ఎనిమిది ఇరాన్ క్షిపణుల దాడికి గురై కూలిపోగా, మూడు నేలమీద ధ్వంసమయ్యాయి, ఒకటి పర్షియన్ గల్ఫ్ దేశం కూల్చివేసింది. ప్రతి ఎంక్యూ-9 డ్రోన్ ఖరీదు కనీసం 16 మిలియన్లు కాగా, కొత్త ఎంక్యూ-9బి వేరియంట్ల ధర సుమారు 30 మిలియన్లుగా ఉంది.

మిగతా 2లో

## అమెరికన్ క్యాంపస్‌లు లక్ష్యంగా చేసుకుంటాం : ఇరాన్

**వుదయం డెస్క్, మార్చి 29 :** రెండు ఇరానియన్ విశ్వవిద్యాలయాలపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు జరిపిన నేపథ్యంలో, మధ్యప్రాచ్యంలోని అమెరికన్ విశ్వవిద్యాలయ ప్రాంగణాలు ప్రతీకార చర్య లను ఎదుర్కోవచ్చని ఇరాన్ ఇస్లా మిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) హెచ్చరిక జారీ చేసింది.

**క్యాంపస్‌లపై దాడుల ముప్పు..** ఇరాన్ మీడియా విడుదల చేసిన ఒక ప్రకటనలో, తెహ్రాన్‌లోని ఇరాన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీతో సహా విద్యాసంస్థలను లక్ష్యంగా చేసుకుని ఇటీవల దాడులు జరిగాయని, ఈ దాడుల వల్ల భవనాలకు నష్టం వాటిల్లినప్పటికీ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని ఐఆర్‌జిసి పేర్కొంది. పరిస్థితి మరింత తీవ్రమైతే ఇరాన్ సరిహద్దులకు ఆవల కూడా ఇదే పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించిం ది. నిర్ణీత గడువులోగా వాషింగ్టన్ దాడులను అధికారికంగా ఖండించకపోతే, టెక్సాస్ ఏఅండ్ఎం విశ్వవిద్యాలయం, న్యూయార్క్ విశ్వవిద్యాలయం వంటి ఈ ప్రాం తంలో పనిచేస్తున్న అమెరి కా విశ్వవిద్యాలయాలు లక్ష్యంగా మారవచ్చని ఐఆర్‌జిసి ప్రత్యేకంగా హెచ్చరించింది. ముందుజాగ్రత్తగా సిబ్బంది, విద్యా ర్థులు, సమీప నివాసితులు అటు వంటి క్యాంపస్‌లకు దూరంగా ఉండాల ని అది సూచించింది. మధ్య ప్రా చ్యం అంతటా సంఘ ర్షణ విస్తరిం చే అవకాశంపై ఆం దోళనలు పెరుగుతున్న నేపథ్యంలో, ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న తరుణంలో ఈ ప్రకటన దానిని మరింత తీవ్రతరం చేస్తోంది.

## తమ్ముళ్లపై విచారణకు వెళ్దామా?

### సిట్టింగ్ జడ్జితో జరిపిద్దాం : సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్

**హైదరాబాద్, మార్చి 29 (వుదయం ప్రతినిధి) :** తన తమ్ముడు చేసిన అవినీతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హౌస్ కమిటీ విచారణకు సిద్ధమైతే తానూ తన తమ్ముడిపై హౌస్ కమిటీ విచారణకు సిద్ధం అని బీఆర్ఎస్ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు రేవంత్ రెడ్డికి సవాల్ చేశారు. హౌస్ కమిటీ వద్దు.. సీఐడీ విచారణ వద్దు.. ఇద్దరం కలిసి సిట్టింగ్ జడ్జితో విచారణకు వెళ్దామన్నారు. ఈ విషయంలో విచారణకు రేవంత్ రెడ్డికి దమ్ముందా అన్నారు. ఆదివారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీ అవినీతి కి పాల్పడిందని అందరికీ అర్థం అయిందని హరీశ్ రావు చెప్పారు, అందుకే ప్రభుత్వం ఆత్మరక్షణలో పడిందని చెప్పారు. అందుకే ముఖ్యమంత్రి ఎదురు దాడి చేస్తోందన్నారని ఆరోపించారు. సమాధానం లేదు కాబట్టి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వంలో అవినీతిని కౌశిక్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు కాబట్టే ఆయన్ను బెదిరిస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. అసెంబ్లీలో నోటితో చెప్పలేని భాష మాట్లాడిన రేవంత్ రెడ్డిని ఎథిక్స్ కమిటీ ముందు



నిలబెట్టాలన్నారు. మంత్రి తప్పు చేశారని అందరికీ అర్థం అయిందన్నారు. మైనింగ్‌లో అవినీతిపై సీబీ సీఐడి కాదు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలంటున్నామని హరీశ్ రావు అన్నారు. పొంగులేటి మంత్రిగా ఉంటే విచారణ సజావుగా సాగదన్న హరీశ్ రావు... అందుకే ఆయన్ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

మైనింగ్ అధికారులు మంత్రి పొంగులేటికి రూ. 28 లక్షల జరిమానా విధించారని చెప్పారు. కానీ ఆయన ఆ పెనాల్టీ కట్టలేదన్నారు. కనీసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చర్యలు తీసుకోలేదన్నారు. సభలో ఒక తప్పును కప్పి పుచ్చుకోవడానికి పది తప్పులు చేశారని హరీశ్ రావు చెప్పారు. 20 అంశాలపై విచారణ చేయించాలని స్పీకర్‌కు లేఖ ఇచ్చామనీ వీటిపైన సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలన్నారు. మైక్ కోసం నాలుగున్నర గంటల పాటు నిలబడ్డాము అయినా మైక్ ఇవ్వలేదని హరీశ్ అన్నారు. పొంగులేటిపై హౌస్ కమిటీ వేసే ధైర్యం మీకు లేదన్నారు. నేడుఉదయం తెలంగాణ భవన్ నుంచి తమ కార్యాచరణ ఉంటుందని అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై తమకు ప్లాన్ ఉందన్నారు.

## బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు బీజేపీ దూరం

- రేవంత్, కేటీఆర్ ఇద్దరూ ఒక్కటే
- ఈ-కార్ రేసు కేసులో కేటీఆర్ పై చర్యలేవీ?
- కేంద్రమంత్రి బండి సంజయ్

**కరీంనగర్ , మార్చి 29 (వుదయం ప్రతినిధి) :** ఫార్ములా ఈ-రేసు కేసులో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నేతలు.. ఇప్పటివరకు కేటీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి, కేటీఆర్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం కారణంగానే చర్యలు తీసుకోవడం లేదని అనుమానం వ్యక్తం చేశారు. ఆదివారం కరీంనగర్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ - బీజేపీ పొత్తు ఎప్పటికీ జరగదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు బీజేపీ ఎప్పుడూ దూరమే అని వెల్లడించారు. దాంతో పాటు వారసత్వ, కుటుంబ రాజకీయాలకు కూడా బీజేపీ దూరమే అని అన్నారు.



## ప్రభుత్వం అంటే మంత్రులేనా?

### మంత్రులకే తప్ప ఎమ్మెల్యేల నియోజవర్గాలకు నిధులు ఇవ్వకుండా ఎండగడుతున్న ప్రభుత్వం : ఎమ్మెల్యే రాజ్‌గోపాల్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 29 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు నిధులు ఇవ్వకుండా వివక్ష చూపుతోందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. కేవలం మంత్రుల నియోజకవర్గాలకు మాత్రమే బిల్లులు వస్తున్నాయని అన్నారు. ఆదివారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం అంటే మంత్రులు మాత్రమే కాదని సొంత ప్రభుత్వాన్ని విమర్శించారు. తాము నిధుల కోసం మంత్రుల చుట్టూ తిరగాలా? అని సీరియస్ అయ్యారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు.. ప్రభుత్వం ఏం చేసినా ఖమ్మం జిల్లాకే వెళ్తున్నాయని టాక్ ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుంటున్నట్లు.. తాము మా నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకోకూడదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మునుగోడును అభివృద్ధి చేసుకుందాం అనుకుంటే ఎవరూ సహకరించడం లేదని మండిపడ్డారు. మరోవైపు.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సైతం ఎత్తిపోతల పధకాలను హుజూర్‌నగర్‌కు



తరలించుకుపోతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తోందన్న రాజగోపాల్ రెడ్డి.. నిర్ణయాలు, క్రమశిక్షణలో కరెక్ట్‌గా ఉందన్నారు. అయితే నియోజకవర్గాలకు కూడా నిధులు ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# మైనింగ్‌పై మాటల ఫైరింగ్

మొదటి పేజీ తరువాయి

**సభ సాగిందిలా...**

ఉదయం నుంచే తెలంగాణ అసెంబ్లీ వాడి వేడిగా మారింది. మంత్రి పొంగులేటిని టార్గెట్ చేసిన కేటీఆర్.. మైనింగ్ అంశాన్ని సభలో లేవనెత్తారు. రాష్ట్ర మైనింగ్ రెవెన్యూ రూ.1700–రూ.1800 కోట్లు వస్తుందని ప్రభుత్వం చెబుతున్నప్పుడు, నిజంగా ఆ డబ్బంతా ప్రభుత్వ ఖజానాలోకే వెళ్తోందా? అని ప్రశ్నించారు. ఆ డబ్బు అక్రమంగా పోతోందనీ.. దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలనీ, లేకపోతే గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే ప్రజల్లోకి వెళ్లి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే అసెంబ్లీలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్, బాలానగర్ భూముల వ్యవహారంపై అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయి ఘర్షణ చోటుచేసుకుంది. మాజీ మంత్రి హరీశ్ రావు సోదరుడు, మామ ధరణిని అడ్డం పెట్టుకుని వందల ఎకరాలు అక్రమంగా బదలాయించుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ అక్రమాలపై హౌస్ కమిటీ వేయడానికి ప్రభుత్వం సిద్ధమని సవాల్ విసిరారు. మరోవైపు రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై సీబీ సీఐడీ విచారణకు ఆదేశిస్తూ.. మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలన్న బీఆర్ఎస్ డిమాండ్‌ను తోసిపుచ్చారు.ముఖ్యంగా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అంశం పెను దుమారాన్ని రేపింది. రాఘవ కన్స్ట్రక్షన్ వ్యవహారంపై సభలో బీఆర్ఎస్ పార్టీ వాయిదా తీర్మానం ప్రవేశపెట్టింది. ఈ వ్యవహారంపై సభాసంఘం వేయాలి లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని బర్తరఫ్ చేయాలన్నారు. పోడియం వైపు వెళ్లేందుకు హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల యత్నంచగా మార్షల్స్ అడ్డుకున్నారు.

**సీఎం ఎదురుదాడి**

దీంతో మధ్యలో కలుగజేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హరీష్ రావుపై తీవ్ర ఆరోపణలు చేశారు. మహబూబ్ నగర్ జిల్లా బాలానగర్ పరిధిలోని ఒక ప్రైవేటు పరిశ్రమ యజమానులను బెదిరించి, వందల ఎకరాల భూమిని అక్రమంగా బదలాయించుకున్నారని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఈ వ్యవహారంలో మాజీ మంత్రి హరీశ్ రావు సోదరుడు మహేశ్ రావు, ఆయన మామ హనుమంతరావు కీలకంగా వ్యవహరించారని అప్పటి ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని ఈ భూ దోపిడీకి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ కోసం హౌస్ కమిటీ వేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, హరీశ్ రావుకు నిజంగానే ధైర్యం ఉంటే దీనిని ఎదుర్కోవాలని సవాల్ విసిరారు. బాలానగర్ భూములపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్ నుంచి నివేదిక కోరగా.. తన బంధువులను కాపాడాలని హరీశ్ రావు మంత్రిని కోరారని దానికి మంత్రి నిరాకరించడంతోనే అప్పటి నుండి ఆయనను టార్గెట్ చేస్తున్నారని సీఎం వివరించారు. మైనింగ్ అక్రమాలపై ఇప్పటికే చర్చ జరిగిందని 2024 జూన్ 2 నుంచి రాఘవ కన్‌స్ట్రక్షన్ వరకు జరిగిన అన్ని అంశాలపై ప్రభుత్వం సీబీ సీఐడీ విచారణకు ఆదేశించిందని స్పష్టం చేశారు. ఒకవేళ హరీశ్ రావు నిజాయితీపరుడే అయితే బాలానగర్ భూములపై విచారణకు అంగీకరించాలని డిమాండ్ చేశారు.

**బీఆర్ఎస్ సభ్యుల తీరు**





**సరైంది కాదు: డిప్యూటీ సీఎం భట్టి**

బీఆర్ఎస్ సభ్యుల తీరుపై డిప్యూటీ సీఎం భట్టి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పాలనలో తాము సభను అడ్డుకోలేదని అన్నారు. నిన్నటి నుంచి బీఆర్ఎస్ సభ్యులు పదే పదే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ సభ్యులు బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారన్నారని ఫైరయ్యారు. సభా సంప్రదాయాలు తెలిసిన నాయకులు కేటీఆర్, హరీశ్రావులు, ఆ సంప్రదాయాలను తుంగలో తొక్కి వ్యవహరిస్తున్నారన్నారు. అడిగిన వెంటనే సీబీసీఐడీ విచారణకు ఆదేశించామని.. అందుకు సంతోషించవలసింది పోయి మొండిగా వ్యవహరిస్తున్నారన్నారు.

**జైల్లో పెడుతామన్నారు.. మరి ఏమైంది.. సీఎం ఫైర్**

కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసును రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగిస్తే కేసీఆర్, హరీష్ రావులను 48 గంటల్లో జైల్లో పెడతామని చెప్పిన మాటలను ఈ సందర్భంగా అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కిషన్ రెడ్డి, బీజేపీ నేతల మాటలు తాము నమ్మి ఈ కాళేశ్వరం అవినీతి కేసును సీబీఐకి అప్పగించినట్లు చెప్రారు. ఈ కేసును సీబీఐకి అప్పగించి.. 48 గంటలు కాదు.. ఎన్ని నెలలు గడిచిందో రాష్ట్ర ప్రజలు అంతా చూశారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతినపై సీబీఐ విచారణను ఢిల్లీలో తొక్కిపెట్టి బీఆర్ఎస్, బీజేపీ రహస్య ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు. ఈ రెండు పార్టీలు ఒక్కటై లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు, సీట్లు పంచుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతికి సంబంధించిన కేసులో కేసీఆర్, హరీష్ రావును జైల్లో పెట్టిన తర్వాత బీజేపీ నేతలు తమ ప్రభుత్వానికి సూచనలు చేస్తే బాగుంటుందని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. తాను నిర్దిష్టమైన ఆరోపణలు చేస్తున్నానని.. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లో ప్రైవేటు పరిశ్రమ యజమానులను బెదిరించి.. మాజీ మంత్రి హరీష్ రావు తమ్ముడు మహేష్ రావు ధరణి పోర్టల్ ద్వారా వందల ఎకరాల భూమిని తన పేరు మీద బదలాయించుకున్నట్లు ఆరోపించారు. ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఒప్పుకుంటే.. ఆ ఘటనపై హౌస్ కమిటీ వేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. హరీష్ రావు నిజాయితీపరుడు అని.. కేటీఆర్, వెంకటరమణా రెడ్డి నమ్మితే హౌస్ కమిటీ వేయడానికి ఒప్పుకోండి అంటూ రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**హరీష్ రావు బంధువులు భూ దోపిడీ చేశారు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని మాజీ మంత్రి హరీష్ రావు బంధువులు భూ దోపిడీకి పాల్పడ్డారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ అక్రమాలపై నిగ్గు తేల్చేందుకు హౌస్ కమిటీ వేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాళేశ్వరం ఏటీఎంగా మారిందని గతంలో బీజేపీ నేతలు ఆరోపించారు.. సిబిఐకి ఇస్తే 48 గంటల్లో విచారణ పూర్తి చేస్తామని చెప్పారు. అందుకే కాళేశ్వరంపై అవినీతి, కేసు ఫైల్‌ను సిబిఐకి ఇచ్చినా ఇంకా ఎందుకు చర్యలు తీసుకోలేదు అని అసెంబ్లీ సాక్షిగా ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడి విచారణ జరిపించే ధైర్యం బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డికి ఉందా అని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.

**అక్రమ మైనింగ్ లో ఎవరున్నా వదిలి పెట్టం**

అసెంబ్లీలో అక్రమ మైనింగ్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన సంచలనం సృష్టించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న కీలక నేతలందరి సంస్థలపై సీఐడీ విచారణకు ఆదేశించారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ ఇసుక , ఖనిజ తవ్వకాలపై సీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు సీఎం రేవంత్ ప్రకటించారు. ముఖ్యంగా జూన్ 2, 2014 నుండి ఇప్పటి వరకు జరిగిన అన్ని మైనింగ్ లీజులు, అనుమతులు , అక్రమాలపై ఈ దర్యాప్తు జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల నాటికి పూర్తి స్థాయి నివేదికను సభ ముందు ఉంచుతామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు హరీష్ రావు వంటి వారు రాజేంద్రనగర్ మండలం మానస హిల్స్ ప్రాంతంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్ చేస్తోందని ఆరోపించారు. దీనిపై రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. ఆ కంపెనీతో మంత్రికి సంబంధం లేదని, కేవలం బ్లాక్‌మెయిల్ రాజకీయాల కోసమే బీఆర్ఎస్ ఈ ఆరోపణలు చేస్తోందని కొట్టిపారేశారు. అయితే, విచారణ మాత్రం నిష్పక్షపాతంగా జరుగుతుందని, అక్రమాలకు పాల్పడిన వారు ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక దోపిడీ వల్ల రాష్ట్ర ఖజానాకు భారీ గండి పడిందని రేవంత్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనింగ్ ద్వారా వచ్చే ఆదాయం 32 శాతం పెరిగిందని ఆయన గణాంకాలను వివరించారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో నిజం లేదని, అదే నిజమైతే ఇసుక అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం ఎలా పెరుగుతుందని ఆయన ప్రశ్నించారు. ఇసుక రవాణాలో పారదర్శకత కోసం కొత్త విధానాన్ని అమలు చేస్తున్నామని, ఆన్‌లైన్ బుకింగ్ సమయాన్ని కూడా సవరించామని తెలిపారు. ప్రభుత్వ భూములు , ప్రకృతి సంపదను కొల్లగొట్టే వారు ఎంతటి వారైనా శిక్ష తప్పదని, సీఐడీ నివేదిక ఆధారంగా తదుపరి కఠిన నిర్ణయాలు తీసుకుంటామని ఆయన సభకు వివరించారు.

**గంగుల, వద్దిరాజు కూడా అంతే**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రల పేర్లను ప్రస్తావిస్తూ తీవ్ర విమర్శలు చేశారు. కరీంనగర్ , ఖమ్మం జిల్లాల్లో గ్రానైట్ మైనింగ్‌లో భారీ అక్రమాలు జరిగాయని, ఫెమా నిబంధనలను ఉల్లంఘించి విదేశాలకు గ్రానైట్ ఎగుమతి చేశారని ఆరోపించారు. గత పదేళ్లలో వీరు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీలను ఎగ్గొట్టడమే కాకుండా, పర్యావరణ నిబంధనలను తుంగలో తొక్కారని రేవంత్ మండిపడ్డారు. గతంలోనే గంగుల కమలాకర్ ,వద్దిరాజు రవిచంద్రలకు చెందిన గ్రానైట్ కంపెనీలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు చేసి, సుమారు రూ. 750 కోట్ల వరకు జరిమానాలు విధించిన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అయితే, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ జరిమానాలను వసూలు చేయకుండా వారిని కాపాడిందని ఆయన ఆరోపించారు. ఇప్పుడు తమ ప్రభుత్వం ఆ బకాయిలను వసూలు చేయడంతో పాటు, జరిగిన అక్రమ మైనింగ్‌పై సమగ్ర విచారణ జరిపి నివేదిక సిద్ధం చేస్తుందని ప్రకటించారు. ఈ విచారణ కేవలం రాజకీయ కక్ష సాధింపు కాదని, రాష్ట్ర సంపదను కాపాడటమే తమ లక్ష్యమని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. గంగుల, వద్దిరాజుల కంపెనీలతో పాటు గత ప్రభుత్వంలో మైనింగ్ లీజులు పొందిన ఇతర నేతల వివరాలను కూడా సేకరించాలని అధికారులను ఆదేశించారు. సీఐడీ దర్యాప్తులో ఈ నేతల పాత్ర రుజువైతే, మైనింగ్ లీజుల రద్దుతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది.

**బిల్లుల ఆమోదం కోసమేనా..? : బీఆర్ఎస్ పై సస్పెన్షన్ పై కొత్త టాక్**

అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ పై రెండు రోజులు వేటు వేయడంతో రాజకీయ, అధికార వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. దాదాపు ఈ అసెంబ్లీలో ఏడు బిల్లులు ఆమోదించుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాన్ చేసుకుంది. ఇప్పటి వరకు కొన్నింటిపై చర్చ కూడా పెట్టింది. ఈ బిల్లుల చర్చలో బీఆర్ఎస్ నుంచి చాలా మార్పులు, వ్యతిరేకత వచ్చింది. అయితే, రేపు అసెంబ్లీ సమావేశాలు ఆఖరి రోజు కావడంతో బిల్లులన్నీ ఆమోదించుకోవాల్సి ఉంది. ఈ పరిణామాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి రెండు రోజులు సస్పెండ్ చేశారు. దీంతో రేపు బిల్లులన్నీ సభలో ఏకగ్రీవంగా ఆమోదించుకోవచ్చని ఆరోపణలు వస్తున్నాయి. బిల్లులు ఆమోదించుకున్న తర్వాత సభను నిరవధిక వాయిదా వేయనున్నారు.

**పాడి కౌశిక్ రెడ్డి వివాదంపై ఎథిక్స్ కమిటీ**

కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరుపై ఎథిక్స్ కమిటీ ద్వారా విచారణ జరిపించి..చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి స్పీకర్ కు సూచించారు. కౌశిక్ రెడ్డి ఇదే రీతిలో వ్యవహరిస్తే బడ్జెట్ సమావేశాల నుంచి సస్పెండ్ చేయాలని సూచించారు. ఈ మేరకు శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు అసెంబ్లీలో తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ తీర్మానం మేరకు పాడి కౌశిక్ రెడ్డి అంశాన్ని ఎథిక్స్ కమిటీకి అప్పగిస్తున్నట్లుగా స్పీకర్ ప్రకటించారు. ఎథిక్స్ కమిటీ నివేదిక మేరకు కౌశిక్ రెడ్డిపై చర్యలు ఉంటాయని తెలిపారు.



## గో సంరక్షణకు ప్రణాళికలు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలోని మున్సిపాలిటీల పరిధిలో వీధికుక్కల నిర్వహణ, గోసంరక్షణ కోసం చేపట్టిన చర్యలను అధికారులు మేనకా గాంధీకి వివరించారు. మున్సిపాలిటీల వ్యాప్తంగా వీధి కుక్కలకు నిర్వహిస్తున్న స్టెరిలైజేషన్ ప్రక్రియ వివరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జంతువుల సంరక్షణ కోసం తీసుకుంటున్న క్షేత్రస్థాయి చర్యలను అధికారులు మేనకా గాంధీ బృందానికి వివరించారు. జంతు సంరక్షణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై మేనకా గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం చూపిస్తున్న చొరవను ఆమె అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వ కృషిని ప్రశంసించడంతో పాటు జంతువుల సంక్షేమం పట్ల చూపుతున్న నిబద్ధతను ఈ సందర్భంగా మేనకా గాంధీ కొనియాడారు. ఈ సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, క్యూర్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేడు, రేపు భారీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి



అలాగే, కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం తడవకుండా ఉండేందుకు సరిపడా టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మార్కెట్ యార్డులకు తెచ్చిన ధాన్యాన్ని కూడా కవర్లతో పూర్తిగా కప్పి ఉంచాలని సూచించారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే సమయంలో రైతులు చెట్ల కింద లేదా బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదనీ పశువులను కూడా సురక్షితమైన షెడ్లలో ఉంచాలని సూచించారు. పొలాల్లోని విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు వెళ్లొద్దన్న వ్యవసాయాధికారులు వడగండ్ల వాన, పిడుగులు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు వ్యవసాయ పొలాలు వద్దకు వెళ్లరాదని హెచ్చరించారు.

## అమెరికాకు 3 బి. డాలర్ల నష్టం

మొదటి పేజీ తరువాయి



**క్షిపణి రక్షణ రాడార్లకు నష్టం**

కీలకమైన నిఘా, క్షిపణి రక్షణ వ్యవస్థలు కూడా లక్ష్యంగా చేసుకున్నారు. జోర్డాన్‌లోని థాడ్ బ్యాటరీలో భాగమైన ఎఎన్/టిపివై- 2 రాడార్‌పై దాడి జరిగింది, దీని అంచనా వ్యయం 300 మిలియన్ డాలర్లకు పైగా ఉంది.

ఖతార్‌లోని అల్–ఉదైద్ వైమానిక స్థావరం వద్ద ఉన్న ఎఎన్/ ఎఫ్‌పిఎస్ –132 రాడార్ దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఇది ఒకేసారి అనేక ముప్పులను పసిగట్టగల అత్యంత విలువైన వ్యవస్థ, దీని ఖరీదు సుమారు 1 బిలియన్ డాలర్లు. యుఎఇ, బహ్రెయిన్, కువైట్, సౌదీ అరేబియాతో సహా పలు దేశాల్లోని రాడార్, కమ్యూనికేషన్లు, వాయు రక్షణ వ్యవస్థలపై అదనపు దాడులు జరిగినట్లు సమాచారం.

**నౌకాదళానికి ఎదురుదెబ్బ**

పోరాట సంబంధిత నష్టాలతో పాటు, నిర్వహణపరమైన ఘటనలు కూడా మొత్తం వ్యయాన్ని పెంచాయి. మార్చి 12న యుఎస్ ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ నౌకలో అగ్నిప్రమాదం సంభవించి, నివాస గదులతో సహా నౌకలోని పలు విభాగాలకు నష్టం కలిగించింది. ప్రస్తుతం ఈ విమాన వాహక నౌక గ్రీస్‌లో మరమ్మతులు చేయించుకుంటోంది.

**ఉద్రిక్తత పెరగడం వల్ల కలిగే వ్యయం**

పూర్తిస్థాయి భూతల యుద్ధం జరగకపోయినా, ఈ సంఘర్షణలో జరిగిన భౌతిక నష్టాల స్థాయిని ప్రారంభ ఆర్థిక భారం ప్రతిబింబిస్తుంది. అత్యంత విలువైన వేదికలు, నిఘా వ్యవస్థలు, డ్రోన్‌లు ప్రభావితం కావడంతో, కార్యకలాపాలు కొనసాగుతున్న కొద్దీ మొత్తం వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంది.

## బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు బీజేపీ దూరం

మొదటి పేజీ తరువాయి



సీఎం రేవంత్ రెడ్డి డిప్రెషన్‌లో ఉండి డీలిమిటేషన్‌పై మాట్లాడుతున్నారని విమర్శించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరును తప్పుబట్టిన బండి సంజయ్ చట్ట సభల్లో సభ్యులు గౌరవంగా న డుచుకోవాల ని హితవు పలికారు. పదిమందికి ఆదర్శంగా ఉండాల్సిన ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే ఇలా ప్రవర్తించడం మంచి పద్ధతి కాదని చెప్పారు. రాష్ట్రంలో అసెంబ్లీ కమిటీ లేదు.. ఎథిక్స్ కమిటీ లేదు.. లేని కమిటీకి కౌశిక్ రెడ్డి అంశాన్ని రికమండ్ చేయడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.




## ఉత్సాహంగా ఐఐటీ హైదరాబాద్‌లో సైక్లింగ్

**వుదయం , సంగారెడ్డి (మార్చి 29) :** కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ లో ఆదివారం నిర్వహించిన సైక్లింగ్ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, ఆరోగ్యంపై అవగాహన పెంచే దిశగా ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ, ప్రతిరోజూ సైక్లింగ్ చేయడం ద్వారా శారీరక దృఢత్వం పెరగడంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని తెలిపారు. ఆధునిక జీవనశైలిలో వ్యాయామానికి తక్కువ ప్రాధాన్యం ఇస్తున్న యువత, ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో ఐఐటీ ప్రొఫెసర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా సైక్లింగ్ చేశారు. క్యాంపస్ అంతటా సాగిన ఈ కార్యక్రమం ఆరోగ్య స్ఫూర్తిని ప్రతిబింబించింది. సంస్థ డైరెక్టర్ మూర్తి కూడా పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. మొత్తంగా ఈ సైక్లింగ్ కార్యక్రమం ఆరోగ్యంపై చైతన్యం కలిగించడమే కాకుండా, విద్యార్థుల్లో ఫిట్‌నెస్ పట్ల ఆసక్తిని పెంపొందించడంలో కీలకంగా నిలిచింది.

## అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన సదస్సు

- మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచన
- వాహనదారులు సంబంధిత పత్రాలు కలిగి ఉండాలి
- ట్రాఫిక్ ఎస్ఐ విజయ్ భాస్కర్




**వుదయం - సిద్దిపేట బ్యూరో (మార్చి 29) :** వాహనదారులందరూ మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ట్రాఫిక్ ఎస్ఐ విజయ్ భాస్కర్ అన్నారు.సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశానుసారం ట్రాఫిక్ ఎస్ఐ విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్ అసోసియేషన్ సభ్యులకి రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్ గురించి ఆదివారం అవగాహనా చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లో మద్యం సేవించి నడపకూడదని, ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ కచ్చితంగా ధరించాలని, అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలు గురి కావద్దని, మీ ప్రాణాలతో పాటు టాక్సీలో ప్రయాణించే ప్రయాణికుల ప్రాణాలు కూడా మీ చేతిలో ఉంటాయని వారిని గమ్యస్థానం చేరేవరకు జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ మీ యొక్క వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్స్, లైసెన్సులు ఎప్పుడూ అందుబాటులోనే ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ అఖిల్, మహేష్, టాక్సీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అబ్బు రమేష్, డ్రైవర్స్ పాల్గొన్నారు.

## లేబర్ కోడులు రద్దు చేయకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తాం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వరరావు




**కల్వకుర్తి మార్చి 29 (వు దయం) :** సిఐటియు నాగర్ కర్నూల్ జిల్లా మూడవ మహాసభలు కల్వకుర్తి పట్టణంలోని టీఎస్ యుటిఎఫ్ భవనంలో బి ఆంజనేయులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.

మహాసభలకు సిఐటియు అనుబంధ రంగాల వివిధ సంఘాల 20 మండలాల అధ్యక్ష కార్యదర్శులతో సహా ముఖ్య నాయకులు హాజరయ్యారు.

మహాసభల కు ముఖ్యవక్త గా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వరరావు హాజరై ప్రసంగిస్తూ బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు దేశ సంపద దోచిపెడుతూ సంపన్న వర్గాల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నదని సంపద సృష్టించే కార్మికులకు నష్టం చేసే విధంగా లేబర్ చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడులను ముందుకు తెచ్చి ఏప్రిల్ నుంచి అమలు చేయాలని చూస్తున్నదని దాన్ని అన్ని వర్గాల కార్మిక వర్గం ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ భవిష్యత్తులో లేబర్ కోడ్లను వెనుకకు తీసుకోకపోతే దేశవ్యాప్తంగా సిఐటియు ముందుండి అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని ఆందోళనలు ఉధృతం చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా లేబర్ కోడులను అమలు చేయమని అసెంబ్లీలో తీర్మానించాలని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. సిఐటియు జిల్లా మహాసభల సందర్భంగా ముందుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు సిఐటియు జెండావిష్కరణ చేశారు.

## తల్లిదండ్రులను వేధిస్తే కఠిన చర్యలే

- మద్యం తాగి వేధిస్తున్న కుమారులపై తల్లిదండ్రులు ఫిర్యాదు
- కౌన్సెలింగ్ ఇచ్చిన దుబ్బాక సీఐ రాజేష్




**వుదయం , దుబ్బాక (మార్చి 29) :** తల్లిదండ్రులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుబ్బాక సీఐ రాజేష్ అన్నారు. నిత్యం మద్యం తాగి వచ్చి, తల్లిదండ్రులను తిడుతూ, చంపుతామని బెదిరిస్తున్న కుమారులపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేసిన ఘటన దుబ్బాక పట్టణంలో ఆదివారం జరిగింది. దుబ్బాక సీఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన కంచం కనకయ్య, రాజవ్వ దంపతులకు ముగ్గురు కుమారులు నరేష్, స్వామి, ఎల్లం, ఒక కుమార్తె కవిత ఉన్నారు.వీరికి ఒక ఇల్లు తో పాటు ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది.రెండవ కుమారుడు స్వామి, మూడవ కుమారుడు ఎల్లం ప్రతిరోజూ మద్యం సేవించి, తల్లిదండ్రులను ఇష్టం వచ్చినట్లు దూషిస్తూ, ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని, లేదంటే చంపుతామని బెదిరిస్తున్నట్టు తల్లిదండ్రులు వాపోయారు. గతంలో ఇలాంటి బెదిరింపులకు పాల్పడితే అప్పటి దుబ్బాక సీఐ వారి కుమారులను పోలీస్ స్టేషన్కు పిలిపించి, కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు. అయినప్పటికీ కుమారుల వేధింపులు ఆగలేదు. ఈ క్రమంలో వారి వేధింపులు భరించలేక, ప్రాణభయంతో ఆ వృద్ధ తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం నాలుగు రోజుల క్రితం సిద్దిపేటకు వెళ్లి, అక్కడి రోడ్లమీద నివాసమున్నారు. రెండు రోజుల క్రితం వృద్ధ తల్లిదండ్రులు స్థానికుల సహాయంతో సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కొడుకుల వేధింపులు భరించలేకపోతున్నామని, తమకు ప్రాణహాని ఉందంటూ ఇద్దరు కుమారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. దీనితో సిద్దిపేట సిపి రష్మీ పెరుమాళ్ ఆదేశాల మేరకు ఆదివారం దుబ్బాక సర్కిల్ కార్యాలయంలో సిఐ టి.రాజేష్, ఎస్సై కీర్తి రాజు ఆధ్వర్యంలో వృద్ధ తల్లిదండ్రులను, వేధిస్తున్న ఇద్దరూ కొడుకులను పిలిపించి, వారికి కౌన్సిలింగ్ ఇప్పించారు.అనంతరం తల్లిదండ్రులను వారింటికి చేర్చారు. తల్లిదండ్రులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కుమారులను హెచ్చరించారు. సిపి ఆదేశాల మేరకు ముగ్గురు కుమారులపై, కుమార్తెపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేష్ తెలిపారు.

## గ్రామాభివృద్ధికి పాటుపడతా

- బొప్పాపూర్ లో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన
- ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం
- సర్పంచ్ మాధవనేని భాను ప్రసాద్ రావు

**వుదయం - సిద్దిపేట బ్యూరో (మార్చి 29 ) :** అహర్నిశలు గ్రామాభివృద్ధికి కోసం పాటుపడతూ ప్రజా సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని బొప్పాపూర్ గ్రామ సర్పంచ్ మాధవనేని భాను ప్రసాద్ రావు అన్నారు.సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలం బొప్పాపూర్ గ్రామంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల సమస్యకు పరిష్కారం లభించింది.ఆదివారం గ్రామ



సర్పంచ్ మాధవనేని భాను ప్రసాద్ రావు ఆధ్వర్యంలో నలుగురు లబ్ధిదారులైన గవ్వల మమత, దుంపలపల్లి కల్పన, బొట్ల వజ్రవ్వ, ఈదుగల్ల బాబుల ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ మాధవనేని భాను ప్రసాద్ రావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంతో లబ్ధిదారులలో ఆనందం వెల్లివిరిసిందన్నారు. వారి సొంత ఇంటి కల నెరవేరే దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోనాపురం పద్మ , వార్డు సభ్యులు బండమీది క్రాంతి, పర్స పర్శరాములు, గవ్వల బుజ్జి, సీనియర్ నాయకులు అరిగే కృష్ణ, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## స్కూల్‌కు స్థలం ఏర్పాటు చేయాలి

**కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు**



**కుత్బుల్లాపూర్, మార్చి 29 (ఉదయం ప్రతినిధి ) :**

బౌరంపేట్ లోని జడ్పీహెచ్ఎస్ స్కూల్ కు స్థలం ఏర్పాటు చేయాలని కోరుతూ మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ, శంభీపూర్ రాజుని బౌరంపేట్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కోరారు. వెంటనే ఎమ్మెల్సీ స్పందించి మేడ్చల్ జిల్లా కలెక్టర్ కు ప్రభుత్వ భూమిలో స్థలం ఏర్పాటుకు సహకరించాలని కోరుతున్న సిఫారిసు లేఖను అందించగా బౌరంపేట్ ప్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్వి సురేందర్ రెడ్డి, సరుగారి ధర్మారెడ్డి, పల్పనూరి విష్ణువర్ధన్ రెడ్డి మేడ్చల్ జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రము అందజేశారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.

## మరకత శివాలయంలో మహిళలకు చీరల పంపిణీ

**ప్రముఖ వ్యాపారవేత్త గండేటి స్వరూప శ్రీరాములు గౌడ్**



**శంకర్‌పల్లి, మార్చి 29 (ఉదయం) :**

శంకర్‌పల్లి మండలం పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో ఆదివారం ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు. శంకర్‌పల్లి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గండేటి స్వరూప శ్రీరాములు గౌడ్ ఆలయంలో పనిచేస్తున్న మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఆలయ సేవకుల సంక్షేమం కోసం నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం భక్తుల్లో మంచి స్పందనను పొందింది. మహిళలకు చీరలు అందజేసి వారిని గౌరవించడం ఎంతో సంతోషంగా ఉందని స్వరూప శ్రీరాములు గౌడ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ స్వరూప శ్రీరాములు గౌడ్ చేసిన సేవా కార్యక్రమం ప్రశంసనీయం అని అన్నారు. ఆలయంలో సేవ చేసే మహిళలకు ప్రోత్సాహం అందించడం ద్వారా వారి మనోధైర్యం పెరుగుతుందని తెలిపారు. సమాజంలోని దాతలు, వ్యాపారవేత్తలు ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమం చివరలో స్వామివారి ఆశీర్వచనం తీసుకుని భక్తులు ఆనందంగా తిరిగి వెళ్లారు. చీరల పంపిణీ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిసింది.

## ఘనంగా మ్యాట్ కబడ్డీ పోటీలు ప్రారంభం

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరు**



**అమీన్పూర్ , మార్చి 29 (ఉదయం) :**

పటాన్చెరు నియోజకవర్గం బీరంగూడ డివిజన్ పరిధిలోని మండే మార్కెట్ వద్ద నిర్వహిస్తున్న 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి మ్యాట్ కబడ్డీ పోటీలను పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు భాగం కావాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నారు. గత పది సంవత్సరాలుగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకుడు పండు ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు శ్రీనివాసరెడ్డి, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు ఎల్లయ్య, జానీ తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరై పోటీలకు ఉత్సాహాన్ని తెచ్చారు.

## చందిప్పలో వైభవంగా దుర్గాభవాని

# జాతర మహోత్సవాలు

- చందిప్ప గ్రామంలో పెద్ద ఎత్తున బోనాలు.. భక్తులతో కిటకిటలాడిన ఆలయం
- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసిన చందిప్ప ఆలయ కమిటీ
- కోరికలు నెరవేరుతాయనే నమ్మకంతో చందిప్ప జాతరకు తరలివస్తున్న భక్తులు
- గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన చందిప్ప దుర్గాభవాని జాతర



**శంకర్‌పల్లి, మార్చి 29 (ఉదయం)**

శంకర్‌పల్లి మండలం పరిధిలోని చందిప్ప గ్రామంలో శ్రీ దుర్గాభవాని మాత జాతర మహోత్సవాలు బ్రహ్మాండంగా, అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. గ్రామంలోని ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతోంది. అమ్మవారి దర్శనానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. దుర్గాభవాని మాతకు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహిస్తూ గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్నారు. ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించే ఈ జాతర ఈసారి మరింత ఉత్సాహంగా జరుగుతోంది. ఆలయ పరిసరాలు పండుగ వాతావరణంతో కళకళలాడుతున్నాయి. జాతరలో భాగంగా చందిప్ప గ్రామ మహిళలు పెద్ద ఎత్తున బోనాలు తీస్తూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. బోనాలు సమర్పించే సమయంలో డప్పు చప్పుళ్లు, భక్తి పాటలు వినిపిస్తూ ఊరంతా ఉత్సాహంగా మారింది. గ్రామంలోని వీధులన్నీ తోరణాలు, పూల అలంకరణలతో శోభాయమానంగా ఉన్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ ఈ జాతరలో పాల్గొంటున్నారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తూ శ్రద్ధగా పూజలు చేస్తున్నారు. చందిప్పలో ఈ జాతర ప్రతి ఏటా ప్రత్యేకతను సంతరించుకుంటోంది.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చందిప్ప ఆలయ కమిటీ సభ్యులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఆలయం వద్ద శుభ్రత, తాగునీరు, క్యూలైన్లు, దర్శన సౌకర్యం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని భక్తులకు నీడ ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాల్లో రద్దీ పెరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పోలీసుల బందోబస్తు కూడా ఏర్పాటు చేయడంతో జాతర ప్రశాంతంగా కొనసాగుతోంది.

ప్రతి ఏటా చందిప్ప గ్రామంలో దుర్గాభవాని మాత జాతరను ఎంతో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారి మహిమతో కోరిన కోరికలు నెరవేరుతాయనే విశ్వాసంతో భక్తులు ఈ జాతరలో పాల్గొంటారని గ్రామ పెద్దలు తెలిపారు. అనేక మంది భక్తులు తమ కుటుంబ సమస్యలు తొలగిపోవాలని, ఆరోగ్యం మెరుగుపడాలని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ జాతర సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి మహా హారతులు నిర్వహిస్తున్నారు. చందిప్ప గ్రామంలో ఈ పండుగ జరగడం వల్ల గ్రామానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని స్థానికులు పేర్కొన్నారు.

జాతర విజయవంతం కావడానికి చందిప్ప గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా పనిచేస్తున్నారు. ప్రతి ఇంటి నుంచి సహకారం అందిస్తూ ఈ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామ యువకులు ముందుండి ఏర్పాట్లు చేస్తూ సేవలు అందిస్తున్నారు. మహిళలు బోనాలు, నైవేద్యాలు సిద్ధం చేస్తూ సంప్రదాయాన్ని కాపాడుతున్నారు. పెద్దలు ఆలయ కమిటీకి సూచనలు ఇస్తూ పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ జాతర గ్రామ ఐక్యతను ప్రతిబింబించేలా మారిందని భక్తులు అభిప్రాయపడ్డారు. జాతర సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అమ్మవారి అలంకరణ, హారతులు అత్యంత ఘనంగా కొనసాగుతున్నాయి. తెల్లవారుజామున నుంచే భక్తులు చందిప్ప దుర్గాభవాని ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. బోనాల సమర్పణతో ఆలయ ప్రాంగణం భక్తిశ్రద్ధలతో నిండిపోయింది. జాతర ముగిసే వరకు ఎలాంటి అవాంతరాలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు కూడా అమ్మవారి కృప అందరిపై ఉండాలని ప్రార్థనలు చేస్తున్నారు. చందిప్ప గ్రామంలో దుర్గాభవాని మాత జాతర మరికొన్ని రోజులు ఘనంగా కొనసాగనుంది.

## ప్రజా సమస్యలపై ఎంపీ ఈటెల పర్యటన

**డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించిన ఈటెల రాజేందర్**



**కుత్బుల్లాపూర్, మార్చి 29, (ఉదయం ప్రతినిధి):**

నిజాంపేట్ సర్కిల్ లోని డబుల్ బెదురూమ్ ఇండ్లను మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ సమస్యలు వివరించారు. పార్క్ నిర్మాణం, ప్రభుత్వ పాఠశాల, బస్తీ దవాఖాన ఏర్పాటు, బస్సు సౌకర్యం, తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ తాగునీటి సమస్య అన్ని ప్రాంతాల్లో ఉందని ఒక్కొక్కరికి రోజుకు 135 లీటర్ల నీరు అందించాలని,తాగునీటి సమస్య పరిష్కారం కోసం వెంటనే బోర్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. అన్ని డబుల్ బెడ్ రూమ్ భవనాలకు వాటర్ ప్రూఫింగ్ చేయాలని, జనాభా ప్రాతిపదికన ఆశ వర్కర్స్, అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏర్పాటు, అన్ని మౌలికవసతులు, ఏర్పాటు కృషి చేస్తామని, దోమల సమస్య నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ అడిషనల్ డీసీ రమేష్, ఏఈ ప్రవీణ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర మున్సిపల్ సెల్ కోకన్వీనర్ రావుల శేషగిరి,కుత్బుల్లాపూర్ కన్వీనర్ శేఖర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ విజయ లక్ష్మి సుబ్బారావు, ఎస్ సి మోర్చా రాష్ట్ర నాయకులు దాసి నాగరాజు, జిల్లా కార్యదర్శి ప్రొఫెసర్ చంద్రమౌళి, జిల్లా ఉపాధ్యక్షులు గరిగే శేఖర్, మీడియా సెల్ కన్వీనర్ సుమన్ రావు, జిల్లా అధికార ప్రతినిధి రచ్చ చక్రధర్, జిల్లా బిల్డర్స్ సెల్ కన్వీనర్ పద్మ ప్రసాద్, బాచుపల్లి అధ్యక్షులు ప్రసాద్ రాజు, ప్రగతి నగర్ అధ్యక్షులు నరేంద్ర చౌదరి, బీజేవైఎం నాయకులు సాయి కృష్ణా రెడ్డి, స్థానిక నాయకులు గజ్జెల్లి సంతోష్ కుమార్, సచిన్, ఉదయ్, భూపాల్, అశోక్, నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు

**నియామకపత్రం అందజేసిన మంత్రి వివేక్ వెంకట స్వామి**



**ఉదయం, సిద్దిపేట బ్యూరో (మార్చి 29) :**

కాంగ్రెస్ పార్టీలో కష్టపడి సేవలందించిన నాయకులకు తగిన గుర్తింపునిస్తుందని ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసి) చైర్మన్‌గా మీసం మహేందర్ యాదవ్ నియమితులయ్యారు.ఈ మేరకు ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి నియామక పత్రం అందజేసిన శుభాకాంక్షలు తెలిపారు.రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నూతన ఏఎంసి పాలకవర్గం కృషి చేయాలని సూచించారు.వారి వెంటనే కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ పూజల హరికృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

**చిన్నకోడూరు ఏఎంసి చైర్మన్‌గా మీసం మహేందర్ యాదవ్**

మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన మీసం మహేందర్ యాదవ్, పార్టీకి అంకితభావంతో పనిచేస్తూ, కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలుస్తూ, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ విశ్వసనీయ నాయకుడిగా గుర్తింపు పొందారు. అధికారం ఉన్నా లేకపోయినా పార్టీ సిద్ధాంతాల ప్రకారం పనిచేస్తూ, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగిన ఆయన సేవలను పార్టీ ఉన్నత నాయకత్వం గుర్తించింది. ఈ సందర్భంగా చిన్నకోడూరు మార్కెట్ కమిటీ కార్యాలయంలో మీసం మహేందర్ యాదవ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి సంతకం చేసి అధికారికంగా ఛార్జ్ తీసుకున్నారు. ఈ నియామకంపై మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, జిల్లా నాయకులు దామోదర్ రాజా నర్సింహ, పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, జగ్గారెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ అభివృద్ధి కోసం, రైతుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.




## సాయి కుమార్ గౌడ్ జనసేనలో చేరిక

**శంకర్‌పల్లి, మార్చి 29 (ఉదయం)**



జనసేన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సమక్షంలో శంకర్‌పల్లి ప్రాంతానికి చెందిన ప్రముఖ యువ నాయకుడు సాయి కుమార్ గౌడ్ జనసేన పార్టీలో అధికారికంగా చేరారు. ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ జెండా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ చేరికతో శంకర్‌పల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీకి మరింత బలం చేకూరుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. యువతలో పార్టీపై విశ్వాసం పెరుగుతున్నదానికి ఈ చేరిక నిదర్శనమని పలువురు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సాయి కుమార్ గౌడ్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షుడు శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆశయాలు, సిద్ధాంతాలు తనను ఎంతో ప్రభావితం చేశాయని అన్నారు. ప్రజాసేవనే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కళ్యాణ్ గారి నాయకత్వం దేశానికి అవసరమని స్పష్టం చేశారు. సమాజంలో మార్పు తీసుకురావాలంటే నిజాయితీగల నాయకత్వం ఉండాలని, ఆ దిశగా జనసేన పార్టీ నడుస్తోందని తెలిపారు. పవన్ కళ్యాణ్ గారి సారధ్యంలోని జనసేన ద్వారా భరతమాత ఋణం తీర్చుకునే అవకాశం లభిస్తుందని భావించి పార్టీలో చేరినట్లు చెప్పారు. ప్రజల కోసం నిరంతరం పోరాడే శక్తిగా జనసేన నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానిక జనసేన కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయి కుమార్ గౌడ్ గారికి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ జెండాలు, నినాదాలతో శంకర్‌పల్లి ప్రాంతంలో జనసేన శక్తిని చాటేలా వాతావరణం ఉత్సాహంగా మారింది. చేరిక కార్యక్రమం అనంతరం నాయకులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో శంకర్‌పల్లి మండలంలో జనసేన పార్టీ మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజల్లోకి వెళ్లి సమస్యలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. ఈ చేరికతో పార్టీకి కొత్త ఉత్సాహం వచ్చిందని, నియోజకవర్గంలో జనసేన ప్రస్థానం మరింత వేగం పుంజుకుంటుందని నాయకులు స్పష్టం చేశారు.

**ఉష**
**వుదయం సాహిత్యం**

# "నిజం చెపుతున్న వేపకాయంత కథలు"

రచన అంటే ఏమిటి? అనే ప్రశ్న కు జవాబు చాలా మామూలు మాటల్లో చెప్పాల్సివస్తే అది రచయిత తాలూకు(Decisive written response) లిఖిత నిర్ణాయక స్పందన. ఈ నిర్ణాయక స్పందన అది వైయక్తిక అస్తిత్వానికి ఏర్పడే విపత్తుకు సంబంధించినది కావచ్చు లేదంటే సామాజిక అస్తిత్వానికి వాటిల్లే విపత్తుకు సంబంధించినది కావచ్చు.రచయితలు తమ ఇచ్ఛ మేరకు లేదా అవకాశం మేరకు ఆయా ప్రక్రియలను ఎంచుకుంటారు.అట్లా ఎంపిక చేసుకునే ప్రక్రియల్లో కథ ను 'సమకాలీన చరిత్రను రికార్డు చేసే పనిముట్టు'గా ప్రసిద్ధ కథకులు డా.వి.చంద్రశేఖర్ రావు ప్రశంసించారు.ఈ సంబోధనకు పరిమితమై గొల్లకురుమల జీవితాల పై వచ్చిన సాహిత్యంలో
'వేపకాయంత నిజం' కథా సంకలనాన్ని విశ్లేషించాలనుకుంటున్నాను.విశ్లేషించే ముందు డా.వి.చంద్రశేఖర్ రావు గారే చెప్పిన ఇంకోమాట"I am product of my times and politics of my times"అనే వ్యాఖ్యను కూడా పాఠకులకు గుర్తు చేస్తున్నాను. వర్తమానంలో తమ చరిత్రను తాము లిఖించుకోవడంలో అంతర్భాగంగా , గొల్ల కురుమ సమాజం తమ రాజకీయ సాంస్కృతిక చైతన్యాన్ని సుస్థిరపరచుకోడానికి అవసరమైన సాహిత్య స్వరంగా ఈ కథా సంకలనం వెలుగు చూసిందని నేను భావిస్తున్నాను.అంతే కాదు భారతీయ సామాజిక కింది వర్గాల చరిత్ర కారుడు రణజిత్ గుహ ఆశించిన విధంగా -ఇప్పటిదాకా నిరాకరణకు , విస్మరణకు గురైన Under Class Stories నిజమైన నిరూపణ యోగ్యమైన చరిత్ర రచనకు మొత్తం సమాజంలోని బి.సి కుల్లాల్లో అతి పెద్ద భారతీయ ఉపజాతిగా ఉన్న యాదవుల విలక్షణమైన శీలవంతమైన సామాజిక నడవడిక ప్రాయోజకం కాగలదని విశ్వసిస్తున్నాను.

ఈ సంకలనానికి రూపతః వస్తుతః ఒక ప్రత్యేకత ఉంది.తెలుగు సాహిత్యంలోనే అత్యధిక కథలు రాసిన డా.కాలువ మల్లయ్య, బహుజన చైతన్యాన్ని రాజకీయశక్తిగా మార్చే పనిలో నిమగ్నమై నిబద్ధుడైన ప్రొఫెసర్.ప్రభంజన్ యాదవ్,కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాదు పరిశోధక విద్యార్థిని భారతి సంపాదకులుగా ఈ కథా సంకలనం రావడం అభినందనీయం. తొంభైల అనంతరం అస్తిత్వవాద సాహిత్యం కులం,ప్రాంతం నుంచి విస్తృతంగా వస్తున్న దరిమిలా ఆయా కులాలు,ప్రాంతాలు తాము ప్రధాన స్రవంతి సాహిత్యంతోపాటు తమ మీద వచ్చిన,తమ నుండి వచ్చిన రచనల అధ్యయనం పై దృష్టిని కేంద్రీకరించాయి.వ్యవస్థీకృత నియమాలకు, సాంఘిక దృగ్విషయాలకు తమ తమ జీవితాలు ఎట్లా 'సాంఘిక రుజువు (Social proof)'లు గా మిగిలాయో లేదా నిలబడ్డాయో నిరూపించడానికి ఈ ప్రత్యేక రచనల సృష్టి,సేకరణ,అధ్యయనం కులాలకూ ప్రాంతాలకూ అత్యంత అవసరమైనాయి.ఈ అవసరం రీత్యా ఇందులోని కథలు పైన పేర్కొన్న వస్తుతః,రూపతః ప్రత్యేకతను సంతరించుకున్నాయి.అగ్ర కులాలకు విధేయులు (Authority bias)గా ఉండటాన తమకు తాముగా ఎంత అన్యాయమై పోయింది తెలుసుకునే స్వీయవాస్తవికత (Self actualization)కు దోహదం చేసే కథలతో పాటు ఉత్పత్తి సంబంధాలు,గ్రామీణ జీవన మార్మికత ను,కడగండ్లను, పొరపొచ్చాలను విడమర్చి చెప్పడంతో పాటు ,ఒక సామాజిక వర్గం పరివర్తన చెందే క్రమంలో ఎదుర్కొనే సంఘర్షణకు సంబంధించిన సూక్ష్మ చరిత్రలు(Micro histories)అనదగిన పది కథలు ఈ సంకలనంలో ఉన్నాయి.ఇవి తెలుగు కథల్లో ప్రధానంగా చోటు చేసుకున్న కథన నిర్మాణానికి(Narrative structure) గల వైవిధ్యంతో పాఠకులను ఆకట్టుకుంటాయి.

గొల్ల కురుమలు భూ శ్రామికులు. బీసీల్లో మెజారిటీ వర్గం. పశు పోషణ ద్వారా జీవ వైవిధ్య వ్యవసాయాన్ని అనుసరించి బ్రతికే సాధుజీవులు, అక్షరాస్యత తక్కువ. చరిత్ర వీరిని యాదవ రాజులు గా కీర్తించినా వర్తమానంలో(Nomadic tribe) అర్ధ సంచార జీవులు గా పొట్టపోసుకుంటున్న వైనం వెనకాల కారణాలను ఈ కథలు తాత్వికంగా వెతికి పట్టిస్తాయి. అక్కడక్కడ సంపన్న కుంటుంబాలున్నట్టు కనిపించినా మొత్తం గా చూసినప్పుడు గొల్లకురుమలంతా పేద మధ్యతరగతే. ఇవాళ్టి నాగరికతా సూచికలతో కొలిస్తే అన్నింటా వెనుకబాటుతనమే. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పెద్ద వర్క్ ఫోర్స్ గా ఉన్నప్పటికినీ సామాజిక పంపిణీలో గొల్లకురుమలకు దక్కుతున్న వాటా అతిస్వల్పమే.ఆర్షస్వామ్యం ప్రవచించిన ఆచారవ్యవహారాలు పాటించడం వల్ల అబ్బిన దైవభక్తి,దాని నుండి సంక్రమించిన స్థానీయ సంస్కృతి ఆచార వ్యవహారాల పట్ల వీరవిధేయతతో పాటు ఆరాధనోత్సవాలు ,ఆశ్రితకులాల సంరక్షణ వెరసి గొల్ల కురుమల సాంప్రదాయిక జీవన విధానం విడిగా ఒక జాతీయత(Ethnicity)గా రూపుదిద్దుకుని చారిత్రక ప్రాశస్త్యాన్ని సాధించుకున్నది.

గొల్ల కురుమలు భూ శ్రామికులు. బీసీల్లో మెజారిటీ వర్గం.పశు పోషణ ద్వారా జీవ వైవిధ్య వ్యవసాయాన్ని అనుసరించి బ్రతికే సాధుజీవులు, అక్షరాస్యత తక్కువ.

చరిత్ర వీరిని యాదవ రాజులు గా కీర్తించినా వర్తమానంలో(Nomadic tribe) అర్ధ సంచార జీవులు గా పొట్టపోసుకుంటున్న వైనం వెనకాల కారణాలను ఈ కథలు తాత్వికంగా వెతికి పట్టిస్తాయి. అక్కడక్కడ సంపన్న కుంటుంబాలున్నట్టు కనిపించినా మొత్తం గా చూసినప్పుడు గొల్ల కురుమలంతా పేద మధ్యతరగతే.

ఇవాళ్టి నాగరికతా సూచికలతో కొలిస్తే అన్నింటా వెనుకబాటుతనమే. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పెద్ద వర్క్ ఫోర్స్ గా ఉన్నప్పటికినీ సామాజిక పంపిణీలో గొల్లకురుమలకు దక్కుతున్న వాటా అతిస్వల్పమే.ఆర్షస్వామ్యం ప్రవచించిన ఆచారవ్యవహారాలు పాటించడం వల్ల అబ్బిన దైవభక్తి,దాని నుండి సంక్రమించిన స్థానీయ సంస్కృతి ఆచార వ్యవహారాల పట్ల వీరవిధేయతతో పాటు ఆరాధనోత్సవాలు ,ఆశ్రితకులాల సంరక్షణ వెరసి గొల్ల కురుమల సాంప్రదాయిక జీవన విధానం విడిగా ఒక జాతీయత(Ethnicity)గా రూపుదిద్దుకుని చారిత్రక ప్రాశస్త్యాన్ని సాధించుకున్నది.

ఈ జాతీయతే కులీనతగానూ , సాంఘిక అడ్డంకిగానూ గొల్లకురుమల జీవితాలను నిరంకుశంగా శాసిస్తూ వస్తున్నది. దీన్ని ఈ కథలు వీటిల్లో నడిచే పాత్రల ద్వారా సంఘటనల ద్వారా ఎరుక పరుస్తాయి.సామాజిక శ్రేణీకరణలో గొల్ల కురుమలు ప్రకృతితో అతిసహజ, అతి సన్నిహిత సంబంధాలున్న పెద్ద సామాజిక వర్గం. పారిశ్రామిక యుగ లక్షణాలు ఒంటపట్టని ప్రకృతి జీవులు. విద్యార్జన, ఉద్యోగ సముపార్జన తద్వారా నగర సమాజంలో చేరడం అనే సామాజిక పరివర్తనలో భాగస్వామ్యం లేకపోయినందున, రాసుకోవడం రాయించుకోవడం పట్ల లేశమాత్రం స్పృహ అయినా లేకపోవడం వల్ల వీరిపై గత శతాబ్ద కాలంగా వచ్చిన సాహిత్యం స్వల్పం అనే చెప్పాలి.అందులో కథలు ఏ కొన్నో .ఆ కొన్నిటినైనా ఇప్పుడు ఈ రూపంలో సమాజం ముందు ఉంచడం సాహిత్యంలో యాదవుల స్థానానికి గల వెలితిని పూడ్చడంగా చెప్పుకోవచ్చు.ఒక రకంగా యాదవుల సాంఘిక చరిత్రకు ఈ ' వేపకాయంత నిజం ' కథలను సంగ్రహరూపా(Epitomes)లుగా నిర్వచించుకోవచ్చు.

ఇతివృత్తం వారీగా చూస్తే ఈ పది కథల్లో సంకలనం నామౌచిత్యపు కథగా'వేపకాయంత నిజం'లో-రాజ్యాంగ పరిధిలో ఆలోచించడం కూడా తప్పే అంటూ యాదవుల రాజకీయ స్పృహపై దాడి చేసే అగ్ర కుల అరాచకాన్ని కళ్లకు కట్టే కథను జి.వెంకట కృష్ణ రాశాడు.Political power is ultimate power అని చెప్పే కథ 'పెత్తనం'.దాన్ని అందిపుచ్చుకున్న నాడే గొల్ల కురుమల బతుకులు ఓ దారికొస్తయి అనే రాజకీయ స్వావలంబనా దృక్పథంతో ప్రభంజనం యాదవ్ ఈ పెత్తనం కథ రాశారు.రచయితగా ఏదో ఒకటి రాయడం కాదు . అస్తిత్వ వాదం యుగంలో మనం మన గురించి రాసుకోవాలి ఉద్బోధించే కథ 'శనార్థి'.దీని రచయిత డా.కాలువ మల్లయ్య.ఈయనకు సహస్ర కథా వృక్షం అని బిరుదు. ఎన్ని మార్పులు వచ్చినా భూస్వాముల అహంకారంలో మార్పు రానందు వల్ల కుమిలిపోతున్న యాదవ మహిళాధికారి కథ 'బండారి'.ఈ కథకుడు వాగుమూడి లక్ష్మీ రాఘవరావు.

ఐదో కథ'గొల్ల కథ'.రచయిత కె.రాంమోహన్ రాజు.నిరు పేదకు దేనికీ ఎప్పుడూ ఎక్కడా ఎవరూ సాయపడని తీరులో గొల్ల బుచ్చయ్య పడే సంఘర్షణను పాఠకులు అనుభవించవచ్చు.పల్లెల్లో తమను అన్యాయం చేసిన బూర్జువాల నుండి తమ మందను ,తమను గొల్ల కురుమలు తిరగబడి కాపాడుకోవడం ఎట్లాగో చెప్పే కథ'శివసత్తి శక్తి'.దీని రచయిత అల్లం రాజయ్య. ఈయన ప్రతిక్షేపించే వర్గ పోరాట దృక్పథం అద్భుతంగా పండింది ఈ కథలో.ఉత్పత్తి కులాల వ్యత్యాసాలను ,పశువుల పట్ల గల అమోఘమైన కారుణ్యాన్ని,మంత్రాల నెపంతో జరిగే గ్రామ కక్షలను శాస్త్రీయ దృక్పథంతో పరిష్కరించే కథ 'ఎర్రెద్దు'దీని రచయిత ఈ వ్యాసకర్త. సర్కసోళ్ల బతుకులు ఛిద్రమై పోయినప్పుడు ఉపకార గుణంతో ఆడించుకోడానికి సంఘజీవిగా ఆగమల్లు అనే గొర్లకాపరి తన మేకపోతును సర్కస్ వాళ్లకు ఇచ్చే జీవన సంబంధాల కథాబంధం'సర్కస్'.కథకుడు రావుల పుల్లారావు సర్కస్ ను చూపించిన పద్ధతి అపురూపం.మాజీ ప్రధాని బహుభాషా కోవిదులు, సాహిత్య వేత్త పి.వి.నరసింహా రావు గారు రాసినతెలుగు కథల్లో ఆణిముత్యం లాంటి కథ 'గొల్ల రామవ్వ'.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో ఓ కాంగ్రెస్ కార్యకర్తను రామవ్వ మనవరాలు మల్లమ్మ పక్కలేసుకొని ప్రాణాపాయం నుంచి ఎట్లా కాపాడిందో ఈ కథ తెలియజేస్తుంది.ఆఖరి కథా 'బిడ్డ పురిటి కొచ్చింది'.గొర్లకు బీమారి సోకినప్పుడు గొల్లలు తల్లడిల్లి పోయే తీరుకు,కటికలకు అమ్మినపుడు గొల్లల ప్రణావేశం,తురక వలీ సహజ ప్రవర్తన జమిలిగా వివరించే కథ ఇది.దీని రచయిత హనీఫ్ .కథన నైపుణ్యానికి ఇదో మచ్చుతున.

ఈ కథలను ఆంటోనియో గ్రాంస్కీ ప్రవచించిన 'సబాల్టర్నిజం' దృక్పథంతో తో విశ్లేషించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.పెత్తందారీ కులాలు(Elite cats) కింద అణచివేతకు గురవుతున్న కులం(non-elite cast)గా గొల్ల కురుమలు ఏయే ఒత్తళ్లకు లోనవతున్నది ఈ కథల్లో మనం స్పష్టంగా తెలుసుకోవచ్చు. విజ్ఞాన తత్త్వవేత్త ఆగస్టే కామ్టే చెప్పిన సామాజిక పరిణామా(Account of social evolution)నికి సంబంధించిన త్రిదశ నియమా(Law of three stages)లు వేదాంత (Theological),ఆధిభౌతిక(Metaphysical), సానుకూలత(Positive) లలో క్రమేణా యాదవుల సామాజిక స్థాయి నిర్వీర్యమైన తీరు వెనుక ఆధిపత్య శక్తు(Hegemonic Power)ల ఆగడాలను శివసత్తి రూపంలో ఎదుర్కొన్న తీరునూ ఈ సంకలనం వివరిస్తుంది. సంపదకు- భూమి కేంద్రమైన మధ్య యుగాల నుండి సంపదకు జ్ఞానమే మూలం అంటున్న నేటి 'జ్ఞాన సమాజ వ్యవస్థాపనా వాదం 'వరకు చూస్తే అణకువ(Humility)గల వారుగా గొల్ల-కురుమలు అనుభవిస్తున్న పరివేదన ఈ కథలకు సర్వత్రా స్వరమైంది.రెండు వేల ముప్పై హద్దుగా చెపుతున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సారభూతమైన విద్యా హక్కు (Right to Education ),ఉపాధి హక్కు(Right to Employment), సాధికారతా హక్కు (Right to Empowerment)లు ఒక రాజకీయ డిమాండుగా యాదవులు ముందుకొస్తున్న తరుణం ఇది.ఈ 'వేపకాయంత నిజం'కథా సంకలనం మార్క్సిజం అందించిన చైతన్యం తో,పూలే అంబేద్కరిజంలు చూపే దళిత బహుజన వాదాన్ని ముందుకు తీసుకుపోతుంది. ఉన్నత వర్గాలు చెపుతున్నఉత్త 'జోలి'(ముచ్చట)కి ఊకొట్టడం ఆపాలని గొల్లకురుమలను చైతన్యపరుస్తుంది. విద్యా ఉపాధి రంగాల్లో, విజ్ఞాన పరిశోధనల్లో దూసుకెళ్లినపుడే తమ అస్తిత్వానికి మనుగడతో పాటు సాంఘిక మర్యాద వర్ధిల్లుతుందని చెపుతుంది. యాదవుల సాంస్కృతిక రాజకీయాలను బలంగా ప్రభావితం చేసే వైపుకు ఈ సంకలనం దృష్టి సారించింది. ప్రాపంచిక వాస్తవాధీన రేఖ వద్ద యాదవులను నిలబెడుతుంది. తమ గురించి తాము మరియు ఇతర సృజన మిత్రులు రాసిన కొన్ని కథలతో ప్రచురించిన ఈ వేపకాయంత వెర్రి సంకలనం టాగూర్ చెప్పినట్టు
' Prose is ever the doer' అనే సాహిత్యోక్తికి ఆచరణపత్రంగా నిలిచి రసావేశం కంటే మిక్కుటంగా భౌతిక సత్యాల ప్రోదిని సాహిత్య క్షేత్రాలకు చరిత్రకు ప్రసరిస్తుంది.



- డా.బెల్లి యాదయ్య
9848392690

**భారతీయ కవిత**

## పురాతన శిలలు

నునుపైన తెల్లని గుండ్రని ఆదిమ శిలలు
చాలా దూరం నుంచే వచ్చి వుంటాయి
ఈ ఏ సీ రెస్టారెంట్ నునుపైన కిటికీ ఫ్రేమ్ లో
కుదురుకోవడానికి –
" మహీ నది విశాలమైన ఒడ్డున మేము
ఇలాంటి రాళ్ళతోనే ఆడుకున్నాం"
అని నాయిన మాతో అనే వాడు.

కరెంట్ పోయినపుడు మామిడి చెట్టు కింద
మేము నిప్పు రవ్వల కోసం ఇలాంటి రాళ్ళనే
రాపిడి చేసి
ఆ వెలుతురులో స్నేహితుల కళ్ళల్లోకి చూసిన
ఆ సాయంత్రాలు నాకు గుర్తున్నాయి
ఆ స్నేహితులు ఇప్పుడంతగా గుర్తుకు లేరు

పెళ్ళయాక మేము మొదటి యాత్ర చేసినపుడు
దూరాన వున్న నార్బులింగ్కా ధ్యానస్థలిలోని
ఒక నిశ్శబ్ద ఉద్యానవనం దగ్గర ఇలాంటి రాళ్ళనే
చూశాను
కొంత చెరిగిన రాతలున్న అవి ఓ చోట ఒద్దికగా
పేర్చబడి
"ఓం పద్మే హం'★ అనే మాటలను
శ్వాసిస్తుండగా–

అంతకు చాలా యుగాల క్రితం
చిమ్మ చీకటి గుహల్లో
ఆదిమ మానవులు ఇవే రాళ్ళనుంచి నిప్పును
రాజేసుకుని వన్య మృగాల కళ్ళల్లోకి చూసే వారు

ఇవే రాళ్ళు
నిప్పు పుట్టక ముందే వుండేవి
ఇంకా అంతకు ముందు కూడా ఉండేవి
మనకు పూర్వమే.
(★"ఓం మణి పద్మే హం" అనేది ఆరు మాత్రల
ప్రసిద్ధ బౌద్ధ మంత్రం)

గుజరాతీ మూలం & ఆంగ్లానువాదం:
మెహల్ దేవ్ కాలా
తెలుగు సేత: దర్భశయనం శ్రీనివాసాచార్య



## విశ్వగురు ఆకాంక్ష

సకల జన సంక్షేమమను
ఆకలెక్కువ కలి కాలానికి
సమత్వమే తనకు మక్కువ .
సరి న్యాయం తన ధర్మమంటున్న వేళ :

అనాది ధర్మమొకటున్నదనీ
దేశ కాల మానాల కతీతంగా
యుగాల కిందట ఎక్కడ ఉన్న వాళ్ళక్కడ
ఎగుడు దిగుడుగా ఎల్లప్పటికీ ఉండడమే
లోక నీతి, రీతి కావాలని ----

తర్కాతీతులైన శవ మానస సమూహమే
దానికి తిరుగులేని సాక్ష్యమనీ
కలియుగ లోపాలను సవరించాలనీ
అది యావద్విశ్వానికి ఇలా వర్తించాలని :
ఆది ధర్మం అప్రశ్నితంగా సాగిపోను
సతులుగా చితి ముద్దులాడను రూప్
కన్వరొకటే చాలదనీ

అభినవ గురుధర్మ మేదో ఆచంద్ర
తారార్కమై నిలిచి పోను
ఇంద్ర కుమార్ మేఘ్వాలొక్కడే సరిపోదని ----

ఒక్క ఆలిసమ్మ, ఒక్క రోహిత్ఒ, ఒక్క ప్రణయ్
మీదుగా వెళ్ళిపోయిన ధర్మ రథచక్రాల సవ్వడి
సకల లోకపు చెవుల కింపుగ
స్వర మూర్ఛనలాలకించే మహద్భాగ్యానికి వాళ్ళు
మాత్రమే చాలరనీ ----
ఆర్ష ధర్మం నాల్గుపాదాలపై

నిక్కి నీల్గుతు నడిచిపోను
ముందు కుడి కాలికింద ఎవ్వరో ఒక్క మహిళ
ఎడమ చక్రం కింద ఒక దళితురాలు
వెనక కుడి ఎడమ చక్రాల గతికి
ఒక్కసంచార జాతి సరి తూగరనీ ---

ధగద్ ధగ ధగలతో మెరిసిపోతూ
విశ్వగురు భావి మహోజ్వల
మహాప్రస్థానపు నీడలో మలిగిపోగల
విశాల హృదయులిపుడు కావాలనీ--

మనిషి మలినాన్నెత్తిపోసే
స్వచ్ఛమైన స్వధర్మాచరణలోనే
జన్మ ధన్యంచేసుకోగల అస్పృశ్యులు
తిరిగి రావాలనీ - --
సాటి మనుషుల ఉసురుతో
మోక్ష దాహం తీర్చగలిగే
మన్వంతరాలకు మరలివెళ్ళే ముక్తి మార్గం
ఆది అంతం లేని ధర్మాచరణలోనే సాధ్యమనీ
నిరవధిక ధర్మం నింగి చేర్చను నియమించబడిన
రోదశీ నౌకలకు సైతం స్త్రీ , దళిత శ్రామిక



జన రక్త తర్పణం కావాలని - --

విద్యాసాగర్ అంగలకుర్తి
హైదరాబాదు

*గమనిక :* గతంలో ఈ పేజీలో తన పేరుతో ప్రచురించిన 'మరణం అంచున వున్నవాడి ప్రశ్న' అనే కవిత తన రచన కాదని బహుశ అది ఒక మణిపురి కవితకు తాను చేసిన అనువాదమని రచయిత తెలియజేస్తున్నారు.

## అస్తిత్వ వేదన, సామాజిక చైతన్యం

ప్రాచీన కాలం నుండి ఆధునిక సాంకేతిక యుగం వరకు సమాజం ఎంత పరిణామం చెందినప్పటికీ, స్త్రీ జీవితం మాత్రం ఇంకా అనేక సంకెళ్ల మధ్యే కొట్టుమిట్టాడుతోంది. శైలజ గారి కవిత్వం కేవలం భావోద్వేగాల వ్యక్తీకరణ మాత్రమే కాదు, అది ఒక సామాజిక దర్పణం. పుట్టినప్పటి నుండి మరణం వరకు స్త్రీ పోషించే వివిధ పాత్రల వెనుక ఉన్న నిశ్శబ్ద రోదనను, అణిచివేతను ఆమె అక్షరబద్ధం చేశారు.అడుగడుగునా జీవన్మరణ పోరాటమే / అనుక్షణం అవమానాల పరంపరే / బతుకమ్మ జాలి దయ లేని / సజీవ కళేబరాలతో సహజీవనమే.కవయిత్రి తన కవితలో స్త్రీ జీవితాన్ని "జీవన్మరణ పోరాటం"గా అభివర్ణించారు. స్త్రీకి బయటి ప్రపంచంలోనే కాదు, కుటుంబం అనే వ్యవస్థలో కూడా అవమానాలు ఎదురవుతూనే ఉన్నాయి. చైతన్యం ఉన్న మనిషిని "సజీవ కళేబరం"గా మార్చేసే సామాజిక పరిస్థితులపై ఆమె ఎక్కుపెట్టిన విమర్శ ఇది. సమాజం ఆమెను ఒక వ్యక్తిగా కంటే, ఒక వస్తువుగా లేదా బాధ్యతల మోతగా మాత్రమే చూస్తోందనే ఆవేదన ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది.ప్రకృతికి నేనంటే పరిహాసమే/ పురుష సంతానం పట్ల పక్షపాకమే/ నా సర్వస్వాన్ని అర్పించి/ నన్ను తనకు సమర్పించుకోమంటుంది.ఈ పంక్తులు పితృస్వామ్య వ్యవస్థలోని లోతైన వివక్షను వేలెత్తి చూపుతున్నాయి. జీవ గమనానికి స్త్రీ మూలమైనప్పటికీ, సమాజం పురుష సంతానానికి ఇచ్చే ప్రాధాన్యతను, స్త్రీ పట్ల చూపే చిన్నచూపును కవయిత్రి నిలదీశారు. తన సర్వస్వాన్ని ధారపోసినా, తిరిగి ఆమెకు దక్కేది పరిహాసమే కావడం గమనార్హం.నేను పెట్టిన బిక్షే/ పాలు తాగి రొమ్ము గుద్దే/ పైశాచిక ప్రవృత్తి ఎందుకు నీకు?/ వడ్ల గింజతో ఊపిరి తీస్తావు / జిల్లేడు పాలతో జీవన్ముక్తి కలిగిస్తావు / ఆధునిక యంత్ర పరికరాలతో/ వెతికి మరియు ఉరితీస్తావు.పాత రోజుల్లో "వడ్ల గింజ" లేదా "జిల్లేడు పాలతో" ఆడపిల్లల ప్రాణాలు తీసే అనాగరిక పద్ధతులు ఉండేవని, కానీ నేడు ఆధునిక యంత్రాలతో (Scanning/Feticide) గర్భంలోనే ఆమెను ఉరితీస్తున్నారని చెప్పడం కవయిత్రి సామాజిక స్పృహకు నిదర్శనం.స్త్రీ పెట్టిన భిక్ష (జన్మ) వల్లే మనుగడ సాగిస్తున్న పురుషుడు, తిరిగి ఆమెనే హతమార్చడంలోని వైరుధ్యాన్ని "పాలు తాగి రొమ్ము గుద్దే" నైజంగా అభివర్ణించారు.తలంబ్రాలతోనే బతుకు తెల్లారిందని/ సప్తపది పేరుతో సర్వం సమసి పోయిందని / అతని ఆశల యజ్ఞానికి/ బలి పశువును నేనయ్యానని/ బాధ్యత లేని బంధం మధ్య / డొల్లగా మారానని.వివాహ వ్యవస్థలో స్త్రీ తనను తాను ఎలా కోల్పోతుందో శైలజ గారు కవిత్వీకరించారు.ఏడు అడుగుల బంధం ఆమె సర్వస్వాన్ని దహించివేసే "ఆశల యజ్ఞం"గా మారిందని, ఆమె ఆ యజ్ఞంలో కేవలం ఒక "బలి పశువు" మాత్రమేనని చెప్పడం అత్యంత బాధాకరం.బాధ్యత లేని బంధాల మధ్య స్త్రీ ఒక "డొల్ల"గా మిగిలిపోవడం అనేది నేటికీ అనేక కుటుంబాలలో కనిపిస్తున్న చేదు నిజం."నిన్న నేను లేను, రేపు ఉండను" అనే మాటల్లో ఒక అస్థిరత కనిపిస్తుంది. గడియ గడియకు మృత్యువు తొంగిచూస్తుండటం అంటే, అది శారీరక మరణం మాత్రమే కాదు, ఆత్మగౌరవం చనిపోవడం కూడా కావచ్చు. సమాజం ఆమెకు ఇచ్చే గుర్తింపు లేకపోవడమే "ఉన్నా లేనట్లే" అనే భావనను కలిగిస్తోంది.మామిడాల శైలజ గారి కవిత్వం కేవలం కన్నీటి గాథ కాదు, అది ఒక హెచ్చరిక. స్త్రీ హృదయంలోని అంతర్లీన వేదనను సమాజానికి వినిపించే ప్రయత్నం. ఈ కవితా వికాసం నేటి మహిళలకు తమ హక్కుల పట్ల, అస్తిత్వం పట్ల చైతన్యాన్ని కలిగిస్తుందని ఆశిద్దాం. స్త్రీని కేవలం ఒక పాత్రగా కాకుండా, ఒక మనిషిగా గౌరవించే రోజు రావాలని శైలజ కవిత్వం ఆకాంక్షిస్తోంది.



డా.పూసపాటి
వేదాద్రి
9912197694

# తెలంగాణా జానపద పాట

తెలంగాణ సంస్కృతిలో భాగంగా సామాన్య ప్రజల పలు కుబడుల నుండి జాలువారిదే జానపదం అది వారి కష్టములలో సుఖములలో పండగల్లో సంస్కృతిలో తనకు తానే ఒదిగి పొదగబడి ఉంటుంది
జానపదం వర్ణన:
ఓ తల్లి పిల్లవాడిని తన పొత్తిళ్లలో అత్తుకొని పాడే పాటవు తది అలుపొచ్చిన శరీరానికి చెమట చుక్క ముత్యంలా మెరిసి తాను ప్రకాశితం అవుతుంది అధికారులను నిలదీయుటకు చైతన్య గీతికలో పాలుపంచుకుంటుంది.పెళ్లిలో ముందుకు నడిపే సారధి అయి సంస్కృతిని నేను నడుపుతున్నానని చెరగని ముద్ర అవుతుంది. మన ఈ జానపద పాట అత్తారింటికి వచ్చిన కోడలు ఎదుర్కొనే సమస్యలకు తానై సమాధానం చూపుతూ కుటుంబ వ్యవస్థను కాపాడే చుక్కాని అవుతుంది.
ఈడొచ్చిన పదుచుకు పదుచువాని ప్రేమను ఆరాధించే పల్లవుతుంది .సరాగాలను పంచేరాగాన్ని ఎంచుకొని ఆనంద హరివిల్లును తాకి పులకరించిన వర్ణాలను అందరికీ పంచుతుంది.
జానపదం వస్తువు:-
జానపదానికి వస్తువు ఏదైనా అది పెద్ద పెద్ద ఆర్భాటాల వాయిద్యాలను వెతకకుండానే పేదవాడు స్వయంగా చేసుకున్న తంబురానో, డోలో మరేదైనా అందులోనే నేనున్నానంటూ వాటి సన్నని తీగల అంచులను తాకగానే జానపదం మురిసిపోయి లాలిత్యాన్ని మొలకపోస్తూ తన గాంధర్వాణి అందిస్తూ అలరిస్తుంది. తన రూపం పంట పొలాల ఆకుపచ్చని అంచులలో అందరితో కలిసిపోయి, కల్మషాల కల్పులను తొలగిస్తూ శ్రమైక జీవనాన్ని పంచుతూ, నడుము వంచి పని చేస్తూ నలుగురికి అన్నాన్ని పంచగలదని నిరూపిస్తున్నది .
ఆకుపచ్చని పంట పొలాల నడుమ జాలువారే నదీమత రంగాల నురుగులను,పాలపొంగులను కలగలుపు కొని, కోకిల రాగాలను కలుపుకొని, గజరాజులను నడకలను, సింహాల గర్జనలను పలకరిస్తూ.... లేడి పిల్లల చురుకుదనాన్ని చూపుతూ ఇంద్రధనస్సుల వర్ణాలను పంచే జనపదం. అమ్మమ్మల కథల సారమై హరిదాసుల భక్తి చింతనలై, ఆలయాలలో పాడే భజనలై,కొడుకుకు తండ్రి చెప్పే జీవన పాటై,గురువు శిష్యులకు అందించే విజ్ఞాన శాస్త్రమై వెలుగొందుతుంది తెలంగాణ జానపదం.
చైతన్య గీతం, జానపదం:-
ఉద్యమాలకు ఊపిరిలోదుతూ, పండు ముసలి అయిన పడుచు పిల్లడైనా పదం పదం కలిసి పాటగా మారి ఉద్యమ సంద్రంలో తాను ఒక అలగా ఎగిసిపడగలదు. చైతన్య దీప్తి వెలుగొంద గలదు.
ఆధ్యాత్మిక గీతం జానపదం :-
ఆధ్యాత్మిక వింతనకు జానపదం తన తాత్వికతను, ఒక ప్రత్యేక ముద్రను వేసింది సూర్యోదయపు మేల్కొలుపుల కోసం గుడిగంటగా మారింది.జీవితపు ఒడిదుడుకులను తట్టుకొని వెలుగులు పంచే చిరు దివ్వె అయింది. సాయంత్రాన స్వాంతన చేకూర్చే పిల్ల గాడ్పు అయింది.రాత్రి సమయాన నిద్రపుచ్చే జోల పాటగా మారింది .
పని తో పాటు జాన పద పాట :-
పొట్ట చేత పట్టుకొని పంట పొలాల కోతలకు పోయిన మనుషులను దగ్గర చేసే దప్పు పాటల మోతయ్యింది. పెయ్యంత పచ్చిపుండై విశ్రాంతినాశించే సమయాన నీ తోడంట నేనున్నానంటూ తానై మూలిగే అలసిన ప్రాణానికి మువ్వల గీతి అయ్యి ఒక కొత్త పాటగా తనను తాను ఆవిష్కృతమైంది.
పాటకు పదిలమైన స్థానం:-
దూరాన ఉన్న కొడుకును తన కౌగిట హత్తుకుని ఆత్మీయతను పంచే పూలపాన్పు అయ్యింది. బాధ్యతను మోసే పెనిమిటికీ,భార్య తుడిచే చీర కొంగ అయ్యింది .ఆకలిగా ఉన్న తాతకు అడగకుండా ఇచ్చిన సద్దన్నంకూడైయ్యింది .పెద్దమ్మను పాటల పెద్దమ్మగా ముందు వరుసలో కూర్చోబెట్టి పోటీల పాటల కచేరీకి పరిచిన తివాచీ అయ్యింది .



జీవపదం జానపదం :-
బావ మరదళ్ళు తాతా-మనమరాలు కొంటె చూపులు కోనంగి చేష్టలు, అద్దాల రవికలు, కోరమీసాలు ఇలాంటి పదాలన్నీ జానపదంలో ఇమిడి పోయి ,తాను సైతం అంటూ గజ్జ కట్టి ఆట ఆడాల్సిందే. కొంటెతనముతో ఒకరినొకరు వయలు ఒలుక పోసుకుంటూ పాడే పాటలు ఎక్కువగా జానపదంలో కనిపిస్తాయి.
కొత్త జానపదం పుట్టుక :-
కొసరంత కోపం వచ్చిన చిన్నని నవ్వుతో పటాపంచాలవుతుంది లేదా మళ్లీ మరో జానపదం అయ్యి తన కోపానికి తాపాన్ని వెతుక్కుంటుంది. కొత్త పాటగా రూపుదిద్దుకుంటుంది.
పేరంటాలలో జానపదం :-
అవ్వ నువ్వు పదం బాగా పాడుతావులే అబ్బా నీకన్నానా , ఆ...నాకు యాడ వస్తాయి అంటూనే బరికి సిద్ధమైన పోటీ తత్వం అందులో కనబడకుండానే కనబడుతుంది. పెద్దదానవంటూ గౌరవిస్తూనే అందుకునే పాటకు కోరస్ ను వినయంగా అందించిన ఆ సమయంలో కొత్త జాన పద పాటతానై పుట్టి అక్కడ పరిసమాప్తమవుతుంది.
స్త్రీ " ఆరాధ్య దైవం " జానపదం:-
కష్టాల కన్నీళ్ళ కడలిని ఎలాగైనా ఈదగా తప్పదని బిడ్డల ఆలనా పెనిమిటి కష్టాలను వడబోయక తప్పదని తెలిసిన ఆమె...
దానయ్య దానయ్య
దానయ్య మావ
దాగుడుమూతలేలయ్య || 2 ||
దంపుడు బియ్యం తెస్తినిర
దంచేదాగ ఆగయ్య || 2||
దండమీద నీకోసం కొత్తంగిని
దాస్తీరా
కోపం ఎందుకు రా మామయ్య
|| 2 ||
దానయ్య దానయ్య
దానయ్య మావ
దాగుడుమూతలేలయ్య || 2 ||
అంటూ అప్పటికప్పుడు స్త్రీ ల నోటిలో రూపుదిద్దుకున్న పాటలు ఎన్నో ఎన్నెన్నో.
జానపదం ప్రచారం:-
జానపద పాటలు ప్రచారంలో అలసత్వానికి గురవుతున్నాయి అని అనడంలో సత్య దూరం లేదు.ప్రభుత్వ పక్షం నుండి కూడా ఎన్నో చర్యలను తీసుకొని జానపదంపై ఇంకా పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉంది. పల్లె పాటలన్నీ ఇంకా మౌఖికంగానే ఉన్నాయి. అవి ప్రచురణకు లోను కావడం లేదు. జానపదంపై పరిశోధన చేసే వారికి ప్రత్యేక రాయితీలను అందించి ప్రభుత్వం జానపద పురోగతికి తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉన్నది.
జానపదం సామాజిక మాధ్యమం :-
నేడు ప్రతి ఒక్కరి చేతిలో సెల్ ఫోను పేరిట సామాజిక మాధ్యమం రాజ్య మేలుతుంది. ఆ రాజ్యమేలుతున్న సామాజిక మాధ్యమంలో జానపద పాట కొంత మేరకు తన స్థానాన్ని పదిల పరుచుకుంటున్న మాట వాస్తవమే . నూతన రంగంలో జానపదం ఒక్కప్పటి కన్నా నేడు తనను తాను మెరుగుపరుచుకుంది.
సినీ రంగం జానపదం ;-
సినీ రంగంలో తెలంగాణ యాసను సంతరించుకున్న జానపద కి ప్రత్యేక గుర్తింపు ఉంది. తెలంగాణ మొత్తంలో ఏ జిల్లా ప్రాంతానికి చెందిన ఆయా యాసలతో కూడుకున్న జానపద పాటల సంగ్రహణను చేపట్టాల్సిన అవసరం ఉన్నది .
జానపద పాటల లో పెళ్లి పాటలు వ్యవసాయ పాటలు ఆడవారి పాటలు విప్లవ పాటలు చైతన్య పాటలు వంటివి ఎన్నో ఇంకా ప్రజల నోటి పాటలలో నిక్షిప్తమై ఉన్నాయి. అప్పుడప్పుడు నాలుకలపై నాట్యంచేస్తున్నాయి.
పూర్వపు జానపద గీతాలు ;-
అమ్మమ్మ పాటలు,తాతయ్య తాత్విక గీతాలు, పల్లె వనంలో నారు పాటలు, కలుపు పాటలు ఇలా ఎన్నో ఎన్నెన్నో పూర్వపు గీతాలుఉండేవి .అన్నకు పెండ్లి జరుగుతుందంటే వచ్చే వదినపై కొంటెగా పాడే పాటలు ముందుగానే నేర్చుకొని పాడేవారు. ఆడవారి శుభకార్యాలలో పది పాటలు పాడితే గాని ఆ కార్యక్రమాలు పూర్తి అయ్యేవి .కేజీ నుండి పీజీ వరకు జానపద పాటల విశిష్టతను గురించి తెలిపే పాఠ్యాంశాలను చేర్చాల్సిన అవసరం ఉంది .
పల్లె పదాలు నిరక్షరాస్యుల పెదవి చాటున దాగి ఉన్న పాటలను పాట రూపంలో ముద్రణ రూపంలో తీసుకురావడానికి ప్రభుత్వం కంకణబద్ధం కావాలి. కూని రాగాల నుండి అంతర్జాతీయ స్థాయిలలో మన తెలంగాణ జానపద పాట గుర్తింపును ప్రభుత్వం తన భుజస్కందాలపై వేసుకొని గుర్తింపు తీసుకు రావలసిన అవసరం ఉంది.
ప్రభుత్వం నుండే కాకుండా తెలంగాణలోని ప్రతి ఒక్కరూ జానపద పాటల మాధుర్యాన్ని ప్రతి ఒక్కరికి అందించే విధంగా ప్రయత్నం చేయాలని కోరుకుంటున్నాను.



సాక హరీష్ బాబు,
PGT తెలుగు ఉపాధ్యాయులు,
తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల ,
నారాయణపేట, 9493603594

# జాతీయం-అంతర్జాతీయం

## శ్రీలంకకు భారత్ ఇంధన సాయం



**వుదయం డెస్క్, మార్చి 29 :**

పశ్చిమాసియా సంఘర్షణ ప్రపంచ చమురు, గ్యాస్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న నేపథ్యంలో, భారతదేశం తన నైబర్‌హుడ్ పాలసీలో భాగంగా రంగంలోకి దిగింది. ఇంధన సంక్షోభ సమయంలో తమ దేశానికి ఇంధనాన్ని పంపి వేగవంతమైన మద్దతు అందించినందుకు శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే ఆదివారం న్యూఢిల్లీకి ధన్యవాదాలు తెలిపారు.

కొలంబోకు భారతదేశం నుండి 38,000 మెట్రిక్ టన్నుల ఇంధనం అందిందని ఆయన ఎక్స్‌పై పోస్ట్ చేశారు.

మధ్యప్రాచ్య సంఘర్షణ కారణంగా శ్రీలంక ఎదుర్కొంటున్న ఇంధన సరఫరా అంతరాయాల గురించి కొన్ని రోజుల క్రితం భారత ప్రధాని నరేంద్ర మోడీతో మాట్లాడాను. భారతదేశం తక్షణ మద్దతుకు కృతజ్ఞతలు. నిన్న కొలంబోకు 38,000 మెట్రిక్ టన్నుల ఇంధనం చేరుకుంది. ఈ విషయంలో సన్నిహిత సమన్వయం చేసినందుకు విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జయశంకర్‌కు కూడా ధన్యవాదాలు, అని దిస్సనాయకే ఆ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు.

ఈ వారం ప్రారంభంలో, అమెరికాఇజ్రాయెల్ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా తలెత్తిన ఇంధన సంక్షోభంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శ్రీలంక అధ్యక్షుడితో మాట్లాడారు.

భారత్‌శ్రీలంక ఇంధన సహకారాన్ని బలోపేతం చేయడం, ప్రాంతీయ భద్రతను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్న కీలక కార్యక్రమాల పురోగతిని మేం సమీక్షించాం. సన్నిహిత, విశ్వసనీయ భాగస్వాములుగా, ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవడంలో కలిసికట్టుగా పని చేయాలనే మా నిబద్ధతను పునరుద్ఘాటించాం, అని మోడీ తమ సంభాషణ గురించి ఎక్స్‌పై పోస్ట్ చేశారు.

కొలంబోలోని భారత హైకమిషన్ ప్రకారం, గతంలో పశ్చిమ ఆసియా, సింగపూర్ నుండి ఇంధన సరఫరాలను పొందిన శ్రీలంక, పశ్చిమాసియా సంఘర్షణ కారణంగా తీవ్ర అంతరాయాలను ఎదుర్కొంటోంది. శ్రీలంక ఐఓసీతో ఒప్పందాలు ఉన్న సరఫరాదారులు, అమెరికాఇరాన్ సంఘర్షణ, హొర్ముజ్ జలసంధిలో దిగ్బంధనం కారణంగా సరఫరాలను అందించలేమని తెలిపారు. పైన పేర్కొన్న అంతరాయాల కారణంగా, ఐఓసీఎల్ నుండి భారతదేశానికి సహాయక సరఫరాలను అభ్యర్థించడం జరిగింది. ప్రస్తుత 38,000 మెట్రిక్ టన్నుల రవాణా ఈ సరఫరాలలో భాగమే. ఇంధన సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు భారత ప్రభుత్వం, లంకా ఐఓసీ ద్వారా శ్రీలంకకు మద్దతును అందించింది," అని హైకమిషన్ ప్రకటనలో పేర్కొంది. ప్రకటన ప్రకారం 38,000 మెట్రిక్ టన్నులను సరఫరా చేయగా, అందులో 20,000 ఎంటిలు డీజిల్, 18,000 ఎంటిలు పెట్రోల్ ఉన్నాయి.

## గల్ఫ్ దేశాలకు మోడీ కృతజ్ఞతలు

**న్యూఢిల్లీ, మార్చి 29 (వుదయం) :**



పశ్చిమాసియాలో గత నెలరోజులుగా కొనసాగుతున్న సంఘర్షణ పలు దేశాలకు ఇబ్బందికరమైన, తీవ్ర పరిస్థితులను సృష్టించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం అన్నారు.

మన్ కీ బాత్ 132వ ఎపిసోడ్‌లో మాట్లాడుతూ, ఆ ప్రాంతంలో నివసిస్తున్న దాదాపు కోటి మంది భారతీయులకు అండగా నిలిచినందుకు ఆయన గల్ఫ్ దేశాలకు కృతజ్ఞతలు తెలిపారు. సంక్షోభ సమయంలో భారత పౌరులకు ఈ దేశాలు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను, సౌకర్యాలను కల్పించాయని ఆయన పేర్కొన్నారు. గత నెల రోజులుగా తీవ్రమైన ఘర్షణ కొనసాగుతోంది. అక్కడ నివసిస్తున్న దాదాపు కోటి మంది భారతీయులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు, సౌకర్యాలు కల్పిస్తున్న గల్ఫ్ దేశాలకు నేను హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను, అని ప్రధాని మోదీ అన్నారు.

ప్రస్తుతం కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో గల్ఫ్‌లో పెద్ద సంఖ్యలో ఉన్న ప్రవాస భారతీయుల భద్రతపై భారత్ నిరంతరం ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉంది.

ఈ సంక్షోభ సమయంలో ప్రజలు ఐక్యంగా ఉండాలని, తప్పుడు సమాచారానికి దూరంగా ఉండాలని ప్రధాని కోరారు. దేశానికి హాని కలిగించే వదంతులు, రాజకీయ ప్రకటనల పట్ల ఆయన హెచ్చరించారు. రాజకీయాల్లో పాల్గొంటున్న వారు అలా చేయడం మానుకోవాలి, పుకార్లు వ్యాపింపజేస్తున్న వారు దేశానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సమాచారాన్ని మాత్రమే ప్రజలు విశ్వసించాలి, అని ఆయన అన్నారు. ఈ సవాలును కలిసికట్టుగా అధిగమించడానికి పౌరులు శాంతంగా, ఐక్యంగా ఉండాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇదిలా ఉండగా, ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ కింద అమెరికాఇజ్రాయెల్ దాడులతో ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఇరాన్ యుద్ధం ఒక నెలగా కొనసాగుతోంది. దీని తరువాత, తెహ్రాన్ హొర్ముజ్ జలసంధిని మూసివేయడంతో, ప్రపంచ చమురు సరఫరా సంక్షోభం తలెత్తింది.

ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, చక్కెర వాడకాన్ని తగ్గించుకోవాలని, వంట నూనె వినియోగాన్ని 10 శాతం మేర తగ్గించుకోవాలని ప్రధాని మోడీ ప్రజలకు సూచించారు.

అందరూ ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలని నేను ఎప్పుడూ కోరుతూనే ఉన్నాను. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఇప్పుడు 100 రోజుల కన్నా తక్కువ సమయం మిగిలి ఉంది. ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్ క్రియేటర్ యువరాజ్ దువా పోస్ట్‌కు నేను ఇచ్చిన సమాధానంపై మీలో చాలా మంది కామెంట్ చేశారు. చక్కెర వాడకాన్ని తగ్గించుకోమని తన తండ్రిని అడగమని అతను నన్ను కోరాడు. నా అభ్యర్థన అతని తండ్రిపై సానుకూల ప్రభావాన్ని చూపినందుకు నేను సంతోషంగా ఉన్నాను. మీరందరూ కూడా చక్కెర వాడకాన్ని తగ్గించుకోవాలని, నేను ముందే చెప్పినట్లుగా, వంట నూనె వాడకాన్ని కూడా 10% తగ్గించుకోవాలని కోరుతున్నాను. ఈ చిన్న ప్రయత్నాలు మిమ్మల్ని ఊబకాయం, జీవనశైలి వ్యాధుల నుంచి దూరంగా ఉంచుతాయి.

### బిజెపి అధికారంలోకి వస్తే
## చేపలు, మాంసం తినలేరు



**కోల్‌కత, మార్చి 29 (వుదయం) :**

రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలు చేపలు, ఇతర మాంస పదార్థాలను తినకుండా నిలవరిస్తారంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆదివారం ఆరోపించారు.

బిజెపి పాలిత రాష్ట్రాలలో చేపలు తినరని, ఒకవేళ బిజెపి అధికారంలోకి వస్తే ప్రజలు మాంసం లేదా గుడ్లు కూడా తినలేరు. బిజెపి ఏకపక్షం, వారు ఏ మతాన్నీ విశ్వసించరు అంటూ పురూలియాలో జరిగిన ఎన్నికల సభలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి చిత్రమైన ఆరోపణలు చేశారు.

**బిజెపి హింసను రెచ్చగొడుతుంది**

అల్లర్లను రెచ్చగొట్టడం ద్వారా బిజెపి అధికారంలోకి వస్తుందంటూ మమత తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఈ వ్యక్తులు అల్లర్లను ప్రేరేపిస్తారు. అల్లర్లను రెచ్చగొట్టి, ప్రజలను పొట్టన పెట్టుకుని వీరు అధికారంలోకి వస్తారు. గిరిజనులపై, మహిళలపై అత్యధిక దాడులు బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే జరుగుతాయి. ఇతర రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే ప్రజలపై దాడులు జరుగుతున్నాయి. మనం మాత్రం ఎవరినీ అణచివేయం, అని ఆమె అన్నారు.

**పోలింగ్ షెడ్యూల్ ప్రకటన**

పశ్చిమ బెంగాల్‌లో పోలింగ్ రెండు దశల్లో నిర్వహిస్తారు; మొదటి దశ ఏప్రిల్ 23న, రెండవ దశ ఏప్రిల్ 29న జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు మే 4న జరుగుతుంది.

మతం పట్ల భారతీయ జనతా పార్టీ ఏకపక్ష వైఖరిని అవలంబిస్తోందని ఆరోపిస్తూ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆ పార్టీని విమర్శించారు.

మీరు మీ సొంత మత ఆచారాలను పాటిస్తారు, కానీ బీజేపీ మాత్రం ఏకపక్షంగా వ్యవహరిస్తుంది. వారు ఆ ఆచారాలను విశ్వసించరు. ధర్మం అంటే మానవత్వం అని, పనే ధర్మమని, ధర్మానికి మరో పేరు కర్మ అని, మంచి పనులు చేయడమే ధర్మమని శ్రీకృష్ణుడు చెప్పాడు. కానీ వీరు మాత్రం అల్లర్లను ప్రేరేపిస్తారు. వీరు చేసేదేమిటి? ప్రజలను పొట్టన పెట్టుకోవడం ద్వారానే వీరు అధికారంలోకి వచ్చారు, అని ఆమె విమర్శించారు.

**బిజెపి పాలిత రాష్ట్రాలలో హింస**

బిజెపి పాలిత రాష్ట్రాలలో హింస అధికంగా ఉంటుందని మమత ఆరోపించారు. గిరిజనులపై అధిక దాడులు ఎక్కడ జరుగుతాయి? బిజెపి పాలిత రాష్ట్రాలని గుర్తు పెట్టుకోండి. మహిళలపై అత్యాచారాలు కూడా అక్కడే జరుగుతాయని, యుపి, రాజస్థాన్, ఎంపీని ప్రస్తావించారు.

**టిఎంసి వైఖరి**

తమ పార్టీ వైఖరిని పట్టి చూపుతూ, తృణమూల్ కాంగ్రెస్ అంటే శాంతి అని, తృణమూల్ కాంగ్రెస్ అంటే మానవత్వమని, టిఎంసి అంటే అందరినీ గౌరవించడమని, టిఎంసి అంటే ఇతరులతో కలిసి నడవడమని తాము విశ్వసిస్తామని మమత అన్నారు.

## మరో మాజీ మంత్రి అరెస్టు

**ఖాట్మండు, మార్చి 29 (వుదయం) :**

ఒక మనీలాండరింగ్ కేసుకు సంబంధించి నేపాలీ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఇంధన మంత్రి దీపక్ ఖడ్కాను ఆదివారం నేపాలీ పోలీసులు అరెస్టు చేసినట్టు అక్కడి మీడియా పేర్కొంది. నేపాల్ పోలీసుల సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (సిఐబి) ఆదివారం ఉదయం ఖడ్కాను అదుపులోకి తీసుకుందని, సిఐబి ప్రతినిధి శివ కుమార్ శ్రేష్ఠ చెప్పినట్లు ది హిమాలయన్ పత్రిక పేర్కొంది. మనీ లాండరింగ్ దర్యాప్తు విభాగం నుంచి అభ్యర్థన అందిన నేపథ్యంలో, పోలీసులు ఖడ్కాను విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నారని సదరు ఖాట్మండు పోస్ట్ తెలిపింది.

గత సంవత్సరం జరిగిన జెన్ జీ నిరసనల సందర్భంగా, ఖడ్కా, మాజీ ప్రధానమంత్రులు షేర్ బహదూర్ దేవుబా, పుష్ప కమల్ దహల్‌ల నివాసాల వద్ద కాలిపోయిన కరెన్సీ నోట్ల ముక్కలు ఉన్న చిత్రాలు, వీడియోలు వెలుగులోకి వచ్చాయని అది పేర్కొంది. ఫోరెన్సిక్ లాబొరేటరీ పరీక్షల ద్వారా ఈ విషయాలు తరువాత నిర్ధారితమైనట్టు సమాచారం. ఇంధన, జలవనరులు, నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేస్తున్నప్పుడు, ప్రాజెక్టులకు లైసెన్సులు, కాంట్రాక్టులు ఇప్పించడంలో సహాయపడినందుకు ప్రతిఫలంగా ఖడ్కా ఆర్థిక లబ్ధి పొందారని ఆరోపణలు ఉన్నాయని అందులో పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 8, 9 తేదీలలో జరిగిన జెన్ జీ ఉద్యమాన్ని అణచివేయడంలో ప్రమేయం కలిగి ఉన్నారనే ఆరోపణలపై మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ, మాజీ హోం మంత్రి రమేష్ లేఖక్‌లను అరెస్టు చేసిన ఒక రోజు తర్వాత ఈ అరెస్టు జరిగింది.



ఆ ఉద్యమంలో దాదాపు రెండు డజన్ల మంది యువకులతో సహా 76 మంది మరణించారు.

## ఈ నేరగాళ్లను గుర్తుంచుకోండి

### 168 మంది చిన్నారుల మరణానికి కారణం వీరే: ఇరాన్

**వుదయం డెస్క్, మార్చి 29 :**



యుఎస్ఎస్ స్ప్రువాన్స్‌కు చెందిన యుఎస్ నావికాదళ కమాండర్లు లీ ఆర్ టేట్, ఎగ్జిక్యూటి ఆఫీసర్ జెఫ్రీ ఇ యార్క్‌ను మినాబ్‌లోని పాఠశాలపై క్షిపణి దాడికి ఇరాన్ దోషులుగా నిర్ధారిస్తూ , వారి పేర్లను ఆదివారం ప్రకటించింది. ఈ దాడిలో సుమారు 168 మంది చిన్నారులు మరణించిన విషయం తెలిసిందే. వీరందరి ఫోటోలను ఇంతకు ముందు విడుదల చేసిన ఇరాన్ ప్రస్తుతం ఈ ఘటనకు దోషులైన ఇద్దరు అధికారుల ఫోటోలను ఎక్స్‌పై విడుదల చేసింది.

ఈ ఇద్దరు నేరగాళ్లను గుర్తుంచుకోండి. వీరే మూడుసార్లు టామాహాక్ క్షిపణులను ప్రయోగించమని ఆదేశించారు. అవే మినాబ్ పాఠశాలలోని 168మంది చిన్నారుల మరణానికి కారణమయ్యాయి అంటూ ఇరాన్ పోస్టు చేసింది.

ఫిబ్రవరి 28న ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి) స్థావరాలపై దాడులు చేస్తుండగా మినాబ్‌లోని ఓ పాఠశాలను అమెరికాకు చెందిన టామాహాక్ క్షిపణి తాకింది. ఈ ఘటనలో 160 మందికి పైగా చిన్నారులు, 14 మంది టీచర్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలోనే భారత్, దక్షిణాఫ్రికా, నైజీరియాలోని ఇరానియన్ రాయబార కార్యాలయాలు వీరి ఫోటోలను విడుదల చేశాయి. అమెరికా యుద్ధనౌక ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జేఫ్రీ యీ యార్క్, కమాండింగ్ ఆఫీసర్ లీ ఆర్ టేట్ ఫోటోలను ఎక్స్ వేదికగా పంచుకున్నాయి. ఈ ఇద్దరి నేరగాళ్లనును గుర్తుంచుకోండి. మూడుసార్లు తొమహాక్ క్షిపణిని ప్రయోగించారు. 168 చిన్నారుల మృతికి కారణమయ్యారు అంటూ ఆయా రాయబార కార్యాలయాలు పేర్కొన్నాయి.

## విస్తరించిన నో కింగ్స్ ఉద్యమం

**వుదయం డెస్క్, మార్చి 29 :**

ఈ శనివారం 'నో కింగ్స్' ఉద్యమం ముందెన్నడూ లేనంత భారీగా ప్రజలను సమీకరించడంతో, ప్రపంచవ్యాప్తంగా దేశీయంగా, అంతర్జాతీయంగా నిరసనల వెల్లువ విరుచుకుపడింది. మాన్‌హాటన్‌లోని ఆకాశహర్మ్యాల నుండి ఇడాహోలోని డ్రిగ్స్ వంటి ప్రశాంత ప్రాంతాల వరకు, లక్షలాది మంది నిరసనకారులు వీధుల్లోకి వచ్చి, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండవ పదవీకాలపు అజెండాను, ముఖ్యంగా ఇరాన్‌తో నెల రోజుల పాటు సాగిన యుద్ధాన్ని, ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ అమలులో ప్రాణాంతకమైన ఉధృతిని తీవ్రంగా వ్యతిరేకించారు. భారీ జనసమూహం ముందు నిలబడి, మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్ ప్రదర్శనకారులను ప్రజాస్వామ్య విలువలకు ప్రతిరూపాలుగా కొనియాడారు. ఆయనతో పాటు అమెరికా సెనేటర్ బెర్నీ సాండర్స్ కూడా చేరారు. కాగా, వైట్ హౌస్ యధావిధిగా స్పందించింది. ఒక ప్రతినిధి ఈ ప్రదర్శనలను రాజకీయ ప్రేరిత నాటకాలుగా కొట్టిపారేశారు. లండన్, పారిస్, రోమ్‌లలో ముఖ్యమైన ర్యాలీలు జరిగినట్లు వార్తలు వచ్చాయి.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

### 1 మావోయిస్టు మృతి

**వుదయం డెస్క్, మార్చి 29 :**

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మావోయిస్టులకు, పోలీసులకు మధ్య ఆదివారం జరిగిన ఎదురు కాల్పులలో ఒక మావోయిస్టు మృతి చెందాడు. కాగా, అతడి తలపై రూ.5 లక్షల రివార్డు ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. సుక్మా జిల్లాలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టుల ఉనికి ఉన్నట్టుగా నిఘా సమాచారం అందుకున్న జిల్లా రిజర్వ్ గార్డ్ దళం సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించింది. ఈ నేపథ్యంలోనే మావోయిస్టులు, పోలీసుల మధ్య కాల్పులు ప్రారంభమయ్యాయి.

ఉదయం ప్రారంభమైన కాల్పులు కొనసాగుతున్నట్టు సుక్మా జిల్లా ఎస్‌పి కిరణ్ చవాన్ ధృవీకరించారు. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలంలో గాలింపు జరుపగా, ఒక మావోయిస్టు మృతదేహాన్ని, అతడి ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నట్టు చవాన్ తెలిపారు.

మృతుడిని ప్లాటూన్ నంబర్ 31 సెక్షన్ కమాండర్ (పిపిసిఎం)గానూ, సుక్మా జిల్లాలోని పూలన్‌పాడ్ గ్రామానికి చెందిన వ్యక్తిగానూ పోలీసులు గుర్తించారు. కైలాష్ తలపై రూ. 5 లక్షల రివార్డు ఉందని, పౌరుల హత్యలు, భద్రతా దళాలపై దాడులు, ఐఇడి పేలుడు కుట్రలతో సహా పలు కేసుల్లో అతడి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. మావోయిస్టు కేడర్లు లొంగిపోయి, పునరావాస ప్రయోజనాలు పొందేందుకు ఉన్న గడువు తుది దశలో ఉందని బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ తెలిపారు. మిగిలిన కేడర్లు హింసను విడనాడి, సాధారణ జీవితంలో కలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 2026 మార్చి 31 నాటికి దేశం నుంచి వామపక్ష తీవ్రవాదాన్ని నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదేపదే చెబుతున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో బస్తర్‌లోని కీలక ప్రాంతాల్లో భద్రతా దళాలు తమ ఆపరేషన్లను ముమ్మరం చేశాయి.

ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నందున మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని పోలీసు అధికారులు తెలిపారు.

## స్వార్థ పార్టీల మధ్య ప్రజలు నలిగిపోతున్నారు

### కేరళ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోడీ

**పాలక్కడ్, మార్చి 29 (వుదయం) :**

రెండు స్వార్థపూరిత పార్టీల మధ్య కేరళమ్ ప్రజలు నలిగిపోతున్నారంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో, ఆదివారంనాడు కేరళంలోని పాలక్కాడ్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. వామపక్ష కూటమిని, కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా దుయ్యబట్టిన మోడీ, ఒకరు అవినీతిపరులైతే, మరొకరు అంతకంటే ఎక్కువ అవినీతిపరులు. వీరిద్దరూ కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితమవుతున్నారంటూ విమర్శించారు.

'వికసిత కేరళం' నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని బీజేపీ నొక్కిచెబుతోందని, ఒకవేళ తాము అధికారంలోకి వస్తే కేరళ ప్రజలు కచ్చితంగా ఒక మార్పును చూస్తారని మోడీ పేర్కొన్నారు. స్వార్థపూరితమైన ఆ రెండు పార్టీలు దశాబ్దాల తరబడి రాష్ట్రాన్ని దోచుకున్నాయని ఆయన ఆరోపించారు. ఆ రెండు పార్టీలలో ఒకటి అవినీతిమయమైతే, మరొకటి అంతకంటే ఎక్కువ అవినీతిమయమని ఆయన విమర్శించారు.

ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌ల మధ్య ఒప్పందం ఉందని, కొన్ని ఏళ్లు ఎల్‌డిఎఫ్ రాష్ట్రాన్ని పాలిస్తుందని, తర్వాత యుడిఎఫ్ పాలిస్తుందని మోడీ అన్నారు. రెండు కూటములూ కూడా నిద్రలేకుండా, భయంతో ఉన్నాయని ఆయన అన్నారు.

**కేరళలో బిజెపి ప్రభావం**

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకి పెరుగుతున్న మద్దతును ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, భయం కారణంగానే మిగిలిన రెండు కూటములు బీజేపీని లక్ష్యంగా చేసుకుంటున్నాయని మోడీ అన్నారు. కేరళ ప్రజలు ఇకపై ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌ల ఖాళీ వాగ్దానాలను విశ్వసించడం లేదు. కేవలం బీజేపీఎన్డీయే మాత్రమే ప్రజల ఆకాంక్షలను నెరవేర్చగలదు, అభివృద్ధిని సాకారం చేయగలదు అని ప్రధాని పేర్కొన్నారు.

రాష్ట్ర రాజకీయ ముఖచిత్రంలో మార్పు వచ్చిందని, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ఒక విశ్వసనీయ ప్రత్యామ్నాయంగా ఆవిర్భవించిందని ఆయన ఉద్ఘాటించారు. ఆ రెండు కూటమిలకు సంబంధించిన కుంభకోణాలపై బీజేపీ ప్రభుత్వం విచారణ జరిపి, నిజాన్ని ప్రజల ముందు ఉంచుతుందని ప్రధాన మంత్రి హామీ ఇచ్చారు.

అంతకుముందు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించడానికి ముందు మోడీ కేరళ సంప్రదాయ వాయిద్యమైన 'చెండ'ను మోగించారు. తన ప్రసంగం ముగిసిన అనంతరం, ఆయన ఇప్పుడు త్రిసూర్‌కు బయలుదేరనున్నారు; అక్కడ నగర నడిబొడ్డున ఆయన ఒక భారీ రోడ్‌షో నిర్వహించనున్నారు.

**తర్వాత ఏమిటి?**

కేరళ 2026 అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తరుణంలో, బీజేపీ గణనీయమైన ఫలితాలను సాధించాలని ఆశిస్తోంది. రాష్ట్రంలో ఎన్నికలు ఏప్రిల్ 9న ఒకే దశలో జరగనుండగా, ఫలితాలు మే 4న వెలువడనున్నాయి.

## ప్రపంచ ఉగ్రవాద కేంద్రంగా పాక్

**వుదయం డెస్క్, మార్చి 29 :**



ఉగ్రవాదానికి పుట్టినిల్లు, ఎగుమతిదారుగా పాకిస్తాన్ పోషిస్తున్న దీర్ఘకాలిక పాత్ర మరోసారి బట్టబయలైంది. ఈసారి ఈ విషయాన్ని సాక్షాత్తు అమెరికా కాంగ్రెస్ బయటపెట్టింది. మార్చి 25న విడుదలైన ఒక నివేదిక, ఇస్లామాబాద్ నిరంతరం కాదనడానికి ప్రయత్నించిన ఒక నిజాన్ని బట్టబయలు చేసిందిఅదేమిటంటే, ప్రపంచంలోని అత్యంత ప్రమాదకరమైన ఉగ్రవాద సంస్థలకు పాకిస్తాన్ ఇప్పటికీ ఒక సురక్షిత స్వర్గధామంగా ఉంది.

ఆ నివేదిక ప్రకారం, ప్రస్తుతం పాకిస్తాన్ గడ్డ నుంచి 14 ఉగ్రవాద సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వీటిలో హిజ్బుల్ ముజాహిదీన్, జైష్ఎమహ్మద్, లష్కర్ఎతయ్యిబా వంటి భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకున్న ఉగ్రవాద సంస్థలతో పాటు; అల్‌ఖైదా, అల్‌ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్‌కాంటినెంట్ (ఎక్యూఐఎస్), ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ (ఐఎస్‌కెపి) వంటి ప్రపంచ స్థాయి ఉగ్రవాద నెట్‌వర్క్‌లు కూడా ఉన్నాయి.

**ఉగ్రవాద బలం, కార్యాచరణ ఉనికి**

పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ వ్యాప్తంగా ఒక్క ఐఎస్‌కేపీలోనే 4,000 నుంచి 6,000 మంది ఉగ్రవాదులు చురుకుగా ఉన్నారని ఈ నివేదిక వెల్లడించింది. దీనికి తోడు, అల్‌ఖైదా కార్యకర్తలు తమ కార్యకలాపాల కోసం పాకిస్తాన్ భూభాగాన్ని ఉపయోగించుకుంటూనే ఉన్నారు. ఆ దేశం ప్రపంచ ఉగ్రవాద వ్యవస్థలో లోతుగా పాతుకుపోయి ఉందనే ఆందోళనలను ఈ అంశమే మరింత బలపరుస్తోంది.

గత సంవత్సర కాలంగా, ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ తర్వాత, తాము ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నిర్మూలించామని, లష్కర్ఎతయ్యిబా, జైష్ఎమహ్మద్ వంటి గ్రూపులను నిషేధించామని పాకిస్తాన్ పదేపదే చేస్తున్న వాదనలకు ఇది పూర్తిగా విరుద్ధంగా ఉంది. యూఎస్ కాంగ్రెస్ నివేదిక ఈ వాదనలు అబద్ధమని బట్టబయలు చేసింది. పాకిస్తాన్‌లో 1,000 మందికి పైగా లష్కర్ ఉగ్రవాదులు , 500 మందికి పైగా జైష్ కార్యకర్తలు ఇప్పటికీ చురుకుగా ఉన్నారని ఇది స్పష్టంగా పేర్కొంది. ఒక్క హిజ్బుల్ ముజాహిదీన్‌లోనే సుమారు 1,500 మంది ఉగ్రవాదులు పనిచేస్తున్నారు. వీరి స్పష్టమైన లక్ష్యం భారతదేశమే.

**నిరాకరణ ధోరణి**

పాకిస్తాన్ నిరాకరణ ధోరణి కొత్తేమీ కాదు. 1970ల నుంచి, ఆ దేశం ఉగ్రవాదులకు క్రమపద్ధతిలో శిక్షణనిస్తూ, ఆశ్రయం కల్పిస్తూ, వారిని విదేశాలకు పంపిస్తూనే, అధికారికంగా వారి చర్యల నుండి తనను తాను దూరం చేసుకుంటోంది.

ఇటీవలి ఒక ఉదాహరణ ఈ ద్వంద్వ వైఖరిని స్పష్టం చేసింది. ఫిబ్రవరి 22న, కిష్టావర్‌లో భారత బలగాలు ముగ్గురు జైష్ఎమొహమ్మద్ ఉగ్రవాదులను హతమార్చాయి. అతీక్ఉర్‌రెహ్మాన్ అలియాస్ అబ్దుల్ మతీన్ అలియాస్ సైఫుల్లా, చౌదరి మత్‌బీర్ హుస్సేన్ అలియాస్ ఫర్మాన్, అబ్దుల్ ఘనీ అలియాస్ హురైరా. ఈ ముగ్గురూ పాకిస్తానీ జాతీయులే. అయినప్పటికీ, కేవలం కొన్ని రోజుల తర్వాత, పాకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి తాహిర్ అంద్రాబీ వారు భారత పౌరులని పేర్కొంటూ, వారిని స్వాతంత్ర్య సమరయోధులుగా అభివర్ణించారు.

**పాక్ వాదనలను ఖండించే డాక్యుమెంటరీ సాక్ష్యం**

ఉగ్రవాది సైఫుల్లా గుర్తింపుకు సంబంధించి పాకిస్తాన్ చేస్తున్న తప్పుడు వాదనలను, ఏబీపీ న్యూస్ సంపాదించిన ప్రత్యేక డాక్యుమెంటరీ సాక్ష్యం బట్టబయలు చేసింది. అబుల్ మతీన్ అలియాస్ అతీక్ ఉర్ రెహ్మాన్ అలియాస్ సైఫుల్లా పాకిస్తాన్‌లోని అబోటాబాద్ నివాసి. అతని వద్ద అక్టోబర్ 29, 2022న జారీ చేసిన చెల్లుబాటు అయ్యే పాకిస్తానీ కంప్యూటరైజ్డ్ నేషనల్ ఐడెంటిటీ కార్డ్ (సిఎన్‌ఐసి) ఉంది. ఇది అతని పౌరసత్వానికి స్పష్టమైన రుజువు, దీనిని ఇస్లామాబాద్ కాదనలేదు. ఈ నెంబర్ పాకిస్తాన్ జాతీయ డేటాబేస్‌లో అతని చట్టబద్ధమైన గుర్తింపును నిర్ధారిస్తుంది. అధికారిక కుటుంబ నమోదు రికార్డుల ద్వారా జరిపిన తదుపరి ధృవీకరణలో, అతని కుటుంబం మొత్తం పాకిస్తాన్‌లోనే నివసిస్తున్నట్లు నిర్ధారణ అయింది. ఇది అతన్ని పాకిస్తానేతరుడిగా చిత్రీకరించడానికి పాకిస్తాన్ చేస్తున్న ప్రయత్నాన్ని నేరుగా ఖండిస్తోంది. ఈ డాక్యుమెంటరీ సాక్ష్యం ఇస్లామాబాద్ వాదనను నిశ్చయంగా బద్దలుకొట్టి, వారి ధోరణిని బహిర్గతం చేస్తుంది.

**పహల్గామ్ దాడి తర్వాత పునరావృతమైన ధోరణి**

పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత కూడా ఇలాంటి ధోరణే వెలుగులోకి వచ్చింది. ఈ దాడిలో పాల్గొన్న బిలాల్ అఫ్జల్, హబీబ్ తాహిర్, హసన్ జఫర్ అనే ముగ్గురు ఉగ్రవాదులను ఆపరేషన్ మహాదేవ్‌లో భారత బలగాలు హతమార్చాయి. పాకిస్తాన్ మరోసారి వారిని తమ పౌరులుగా అంగీకరించడానికి నిరాకరించింది.

అయితే, వారి సిఎన్ఐసి పత్రాలులు నిజాన్ని బయటపెట్టి, వారి పాకిస్తానీ గుర్తింపును ధృవీకరించాయి. బలమైన ఆధారాలు ఉన్నప్పటికీ, పదేపదే చేస్తున్న ఈ నిరాకరణలు ఒక ఉద్దేశపూర్వక వ్యూహాన్ని స్పష్టం చేస్తున్నాయి: అంతర్జాతీయ జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి పాకిస్తాన్ ఉగ్రవాదులను పోషించడం, మోహరించడం, ఆపై వారిని వదులుకోవడం కొనసాగిస్తోంది.

**ప్రపంచ కథనానికి సవాలు**

అమెరికా కాంగ్రెస్ నివేదిక ఇప్పుడు ఈ ముసుగును తొలగించింది. భారతదేశం, అనేక ప్రపంచ సంస్థలు చాలా కాలంగా చెబుతున్న విషయాన్ని ఇది ధృవీకరిస్తుంది, అదేమిటంటే, పాకిస్తాన్ కేవలం ఆతిథ్య దేశం మాత్రమే కాదు, ఉగ్రవాదానికి క్రియాశీలక సహకారి కూడా. ఈ తాజా వెల్లడితో, అంతర్జాతీయ సమాజాన్ని తప్పుదోవ పట్టించడానికి ఇస్లామాబాద్ చేసిన ప్రయత్నాలు పూర్తిగా అపనమ్మకానికి గురయ్యాయి. ప్రపంచం ఇకపై పాకిస్తాన్ కథనాన్ని నమ్మడం లేదు. ప్రపంచ ఉగ్రవాదానికి కేంద్రంగా దాని పాత్ర ఇప్పుడు అత్యున్నత స్థాయిలలో పక్కాగా నమోదు చేశారు.




# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## మల్లారం ముద్దుబిడ్డకు జాతీయ గుర్తింపు

**ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మల్లారం చిన్నారికి చోటు**

**52 సెకన్లలో 39 నగరాల మారుపేర్లు చెప్పి అబ్బురపరిచిన ప్రాజ్ఞాత్మిక**




**హనుమకొండ/భీమదేవరపల్లి, మార్చి 29 (వుదయం ప్రతినిధి) :**

తెలంగాణ రాష్ట్రంలోని హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలిక పెద్ది ప్రాజ్ఞాత్మిక తన అసాధారణ జ్ఞాపక శక్తితో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ప్రతిష్ఠాత్మక 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్' ద్వారా అధికారికంగా 'ఐబీఆర్ అచీవర్' టైటిల్‌ను కైవసం చేసుకుంది.

ఫిబ్రవరి 17, 2021న జన్మించిన ఈ చిన్నారి, కేవలం 52 సెకన్ల వ్యవధిలో భారతదేశంలోని 39 నగరాల పేర్లను వాటి భౌగోళిక మారుపేర్లతో సహా స్పష్టంగా చెప్పి రికార్డు సృష్టించింది. ప్రాజ్ఞాత్మిక చూపిన ఈ వేగం, జ్ఞాపకశక్తిని పరిశీలించిన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ యాజమాన్యం ఫిబ్రవరి 24, 2026న ఈ రికార్డును ధృవీకరించింది.

ఈ ఘనతకు గుర్తుగా మార్చి 13, 2026న ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ చీఫ్ ఎడిటర్ డాక్టర్ బిస్వరూప్ రాయ్ చౌదరి సంతకంతో కూడిన అధికారిక సర్టిఫికేట్‌ను చిన్నారికి అందజేశారు.

ఇంత చిన్న వయసులోనే జాతీయ స్థాయి గుర్తింపు సాధించిన ప్రాజ్ఞాత్మికను గ్రామస్తులు మరియు కుటుంబ సభ్యులు అభినందనలతో ముంచెత్తుతున్నారు. ఈ విజయం మల్లారం గ్రామానికి గర్వకారణమని వారు సంతోషం వ్యక్తం చేశారు.

## ఘనంగా 'ఉల్లాస్' పరీక్షలు




**ములుగు, మార్చి 29 (వుదయం ప్రతినిధి) :**

అక్షర వెలుగుల దిశగా అడుగులు జిల్లాలో ఘనంగా 'ఉల్లాస్' పరీక్షలుజిల్లాలో 3,924 మంది నిరక్షరాస్యులకు నిర్వహించిన 3వ తరగతి స్థాయి పరీక్ష జిల్లా యంత్రాంగం పర్యవేక్షణలో విజయవంతంగా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో నిరక్షరాస్యతను నిర్మూలించడమే లక్ష్యంగా చేపట్టిన 'ఉల్లాస్' (ULLAS) అక్షరాస్యత కార్యక్రమం నేడు ఉత్సాహంగా సాగింది. జిల్లాలోని 10 మండలాల పరిధిలో గల 182 లొకేషన్లలో ఈ పరీక్షలను నిర్వహించారు. గతంలో జిల్లాలో అక్షరాస్యత కార్యక్రమం కింద పేరు నమోదు చేసుకున్న 8,150 మంది నిరక్షరాస్యులలో, మొదటి విడతగా నేడు 3,924 మంది అభ్యర్థులు 3వ తరగతి స్థాయి సామర్థ్య పరీక్షకు హాజరయ్యారు.అదనపు కలెక్టర్ పర్యవేక్షణ అదనపు కలెక్టర్ ఎం. సంపత్ రావు ఈ పరీక్షా కేంద్రాలను స్వయంగా సందర్శించి, పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. వయసుతో నిమిత్తం లేకుండా చదువుకోవాలనే పట్టుదలతో పరీక్షకు హాజరైన వారిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.పాల్గొన్న అధికారులుఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డిఆర్డిఓ ఎం. శ్రీనివాస్ రావు,

అదనపు డిఆర్డిఓ గొట్టె శ్రీనివాస్, డిఇఓ సిద్ధార్థ రెడ్డి జిల్లా ఉల్లాస్ నోడల్ అధికారి కృష్ణ బాబు, అడల్ట్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ అధికారి వేణుగోపాల్,జిల్లా సమాఖ్య అధ్యక్షులు పద్మ తో పాటు డిపిఎం లు, ఏపిఎం లు, సిసి లు, విఓఎ లు, కమ్యూనిటీ సభ్యులు, సంబంధిత మండలాల ఎంఈఓలు, సర్పంచులు పంచాయతీ సిబ్బంది క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

వృద్ధాప్యంలోనూ అక్షరాలు దిద్దుతూ, తమ సంతకాన్ని తామే పెట్టుకునే స్థాయికి చేరిన అభ్యర్థుల ఉత్సాహం ఈ కేంద్రాల్లో స్పష్టంగా కనిపించింది.

## మధిరలో ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు






**మధిర మార్చి 29, వుదయం ప్రతినిధి:**

తెలుగువారి ఆత్మగౌరవం,బడుగు బలహీనవర్గాల సంక్షేమం, మహిళలకు సమున్నత ఆర్థిక,సామాజిక భద్రతల పునాదులపైనే తెలుగుదేశం పార్టీ 44 సంవత్సరాల క్రితంఆవిర్భవించిందని, ఖమ్మం టిడిపి పార్లమెంటరీ అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రామనాథం స్వర్గీయ యన్.టి.ఆర్. విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఆయన మాట్లాడుతూ, పార్టీ స్థాపించిన 9 నెలల్లోనే జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ని దాదాపు అన్ని జిల్లాల్లో ఘోరంగా మట్టికరిపించి, తొలి కాంగ్రేసేతర ముఖ్యమంత్రి గా అన్న నందమూరి తారక రామారావు సారథ్యంలో టిడిపి అధికారాన్నికైవసం చేసుకుందని గుర్తుచేసారు.రెండు రూపాయలకు కిలో బియ్యం, పేదవారికి ఇళ్లు,జనతా వస్త్రాలు లాంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో నేటికి యన్.టి.ఆర్.నిలిచిపోయారని కొనియాడారు.చంద్రబాబు కూడా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని,వారి స్ఫూర్తితో కార్యకర్తలందరూ పార్టీని ముందుకు తీసుకెళ్లాలని ఉద్భోధించారు.రాష్ట్ర నాయకులు చేకూరి శేఖర్ బాబు మాట్లాడుతూ,పార్టీ ఆవిర్భావం నుండి అధికారంలో వున్నా, ప్రతిపక్షంలో వున్నా పేద ప్రజల బలహీన వర్గాల ప్రయోజనమే పరమావధిగా పార్టీ కృషి చేస్తున్నదని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ని భూస్థాపితం చేస్తామన్న వాళ్లే కనుమరుగై పోయారని,ఎద్దేవా చేసారు.

జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తెలంగాణ లో కూడా పూర్తి స్థాయిలో పార్టీ పునర్నిర్మాణ కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. ఐటిడిపి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వేమూరి సునీల్ మాట్లాడుతూ, భారతదేశ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీగా తెలుగుదేశం పార్టీ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంతరించుకున్నదని, తెలుపుతూ మొదటి సారి లోకసభలో ప్రధాన ప్రతిపక్షహోదా సాధించటం,

స్వర్గీయ బాలయోగిని లోకసభలో స్పీకర్ గా ఎన్నుకోవడం, రాష్ట్ర అసెంబ్లీలో దళిత మహిళ ప్రతిభా భారతిని స్పీకర్ గా ఎంపిక చేసుకోవడం, రాష్ట్రపతి గా స్వర్గీయ అబ్దుల్ కలాంని ఎన్నుకోవడంలో ప్రధాన భూమిక పోషించటం జరిగిందన్నారు.ఎన్టీఆర్ ఆశయాలకనుగుణంగా చంద్రబాబు అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల్లో దూసుకుపోతున్నారని, కొనియాడారు.

మల్లాది హనుమంతరావు,మార్నీడి పుల్లారావు, సట్టు వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ స్వర్గీయ యన్.టి.ఆర్. ఆశయసాధన కోసం అందరమూ పునరంకితులమౌదామని తెలుపుతూ టిడిపి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి నుండి కౌన్సిలర్లు గా గెలుపొందిన వంకాయలపాటి వెంకట నాగేశ్వరరావు (బాబు), ములకలపల్లి వినయ్, బోడేపూడి రేవతి లకు డాక్టర్ రామనాథం,వాసిరెడ్డి ప్రకాశరావు, చేకూరి శేఖర్ బాబు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం అంబేద్కర్ సెంటర్, చేకూరి రవి ఇంటివద్ద, రిక్రియేషన్ క్లబ్ సెంటర్, 17వ వార్డు సెంటర్,జిలుగుమాడు సెంటర్లలో వున్న నందమూరి తారక రామారావు విగ్రహాలకు డాక్టర్ రామనాథం,మల్లాది హనుమంతరావు, చేకూరి శేఖర్ బాబు,వంకాయలపాటి బాబు,చటారి ముసిలి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో దురిశాల ఆనందరావు, గద్దం రమేష్,యలమంచిలి శివ, దేవభక్తుని వెంకట్, కర్నాటి శ్రీనివాసరావు,ఈదర వెంకటేశ్వరరావు, చౌదరి, వాసిరెడ్డి ఈశ్వర్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, సూర్యదేవర భద్రయ్య, వట్టికొండ రామమోహన్ రావు,చావా శివాజి, వాసిరెడ్డి సూర్యప్రకాశరావు,వాసిరెడ్డి నాగేశ్వరరావు,చెన్నం స్వామి, వేల్పుల కొండ, రావూరి రంగయ్య, వీరవల్లి కోటేశ్వరరావు,అనుమోలు సతీష్,పాశం రామనాథం,కోనేరు రాణి,మాధవరావు, చటారి ముసిలి,జమ్ముల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**చండూరు, మునుగోడు మార్చి 29 (వుదయం):**



అసెంబ్లీలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విద్య, నీటిపారుదల, రహదారుల అంశాలపై విస్తృతంగా మాట్లాడారు. గత ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, టీచర్ల అసమాన పంపిణీ, ఆహార నాణ్యత లోపాలపై ఆందోళన వ్యక్తం చేశారు. విద్యకు అధిక బడ్జెట్ కేటాయించి, పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు.నీటిపారుదల రంగంలో గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల రాష్ట్రం అప్పులపాలైందని, అనేక ప్రాజెక్టులు పూర్తి కాలేదని విమర్శించారు. దిండి, బ్రాహ్మణవెల్లంల వంటి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసి రైతులకు నీరు అందించాలని కోరారు. అన్ని నియోజకవర్గాలకు సమానంగా నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

రహదారుల విషయంలో ప్రాజెక్టుల్లో ప్రమాదకర మలుపులను సరిచేసి రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పనుల పర్యవేక్షణకు స్వతంత్ర ఇంజనీర్లను నియమించాలని సూచించారు.

## పరీక్షల ఒత్తిడిని ఆత్మవిశ్వాసంతో గెలవండి

**– జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వర్ధన్నపేట, మార్చి 29 (వుదయం ప్రతినిధి) :**



"పరీక్షలు జీవితంలో ఒక భాగం మాత్రమే.. భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటే విజయం మీ సొంతమవుతుంది" అని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద విద్యార్థినులకు పిలుపునిచ్చారు. 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఆదివారం వర్ధన్నపేటలోని ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ కాలేజ్ గర్ల్స్ హాస్టల్‌ను సందర్శించారు.

**విద్యార్థులతో ముఖాముఖి**

విద్యార్థినులతో నేరుగా ముచ్చటించిన కలెక్టర్, వారి చదువు, పరీక్షల సన్నద్ధత మరియు హాస్టల్ సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణ, సమయపాలనతో చదువుకోవాలని.. ఒత్తిడికి లోనుకాకుండా ఉండటానికి సరైన నిద్ర, పోషకాహారం మరియు వ్యాయామం తప్పనిసరి అని సూచించారు. సందేహాలుంటే వెంటనే ఉపాధ్యాయులను సంప్రదించాలని కోరారు. విద్యార్థుల్లో భయం పోగొట్టి ఆత్మవిశ్వాసం నింపేందుకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు, కేజీబీవీల్లో ప్రత్యేక అధికారులు ఈరోజు 'స్ట్రెస్ మేనేజ్‌మెంట్' కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. హాస్టల్ స్టోర్ రూమ్‌లోని సరుకుల నాణ్యతను, నిల్వ విధానాన్ని ఆమె స్వయంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీబీసీడీవో పుష్పలత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావు, హాస్టల్ వార్డెన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ 'ప్లాటినం జూబ్లీ' వేడుకలు

**పాలిటెక్నిక్ విద్యే ఉన్నత శిఖరాలకు పునాది**

**– జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**హనుమకొండ, మార్చి 29 (వుదయం ప్రతినిధి) :**




వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం కళాశాల ప్రాంగణంలో 'ప్లాటినం జూబ్లీ' వేడుకలను పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు.

ప్రాక్టికల్ నాలెడ్జ్‌కు నిలయం: కలెక్టర్ మాట్లాడుతూ, బీటెక్ విద్యార్థుల కంటే పాలిటెక్నిక్ విద్యార్థులకే ఆచరణాత్మక జ్ఞానం ఎక్కువగా ఉంటుందని, అందుకే వీరు త్వరగా స్థిరపడతారని కొనియాడారు. తన తండ్రి కూడా పాలిటెక్నిక్ చదివి ఉన్నత స్థాయికి చేరడం తనకి స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. కళాశాల నూతన భవన నిర్మాణానికి రూ. 28 కోట్లు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ... సాంకేతికత మారుతున్న తరుణంలో విద్యార్థులు కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవాలని,AI వంటి టెక్నాలజీలను అందిపుచ్చుకోవాలని సూచించారు. జ్ఞాపకాల సందడి 20 ఏళ్ల యువకుల నుండి 80 ఏళ్ల వృద్ధుల వరకు వివిధ బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు దేశ విదేశాల నుండి తరలివచ్చారు. తమ పాత తరగతి గదుల్లో కూర్చుని విద్యార్థి దశ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఇ.వి. శ్రీనివాస్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ డా. బైరి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## రామాలయంలో వసంతోత్సవ వేడుకలు

**మధిర మార్చి 29, (వుదయం ప్రతినిధి):**



అంగరంగ వైభవంగా మధిరలోని శ్రీరామాలయంలో భక్తుల కోలాహలం నడుమ శ్రీరాములవారికి సంబంధించిన వడ్లు దంచుట కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. వసంతోత్సవాల సందర్భంగా జరిగిన ఈ ప్రత్యేక వేడుకలు భక్తి, ఆనందాలతో నిండిపోయాయి.ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ వంగవేటి రాజశేఖర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు నారాయణచార్యుల దంపతులు, శ్రీనివాస శేషాచార్యులు,నీలిమ దంపతులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.మేళ్లచెరువు వెంకటేశ్వరరావు దంపతులు, శివరాజు శ్రీనివాసరావు దంపతులు,పుల్లఖండం సత్యనారాయణ మూర్తి, అవధానుల భాస్కరశర్మ, చారుగుండ్ల ప్రసాద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.మహిళా భక్తులు సాంప్రదాయ పద్ధతిలో వడ్లు దంచుతూ స్వామివారికి సేవలు అందించగా, ఆలయం మొత్తం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా భక్తులు శ్రీరాములవారి ఆశీస్సులు పొందుతూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

## టీడీపీ పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవం

***ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ జడ్పీటిసి మేడిశెట్టి రాములు.**

**పర్వతగిరి మార్చి 29 ( వుదయం ప్రతినిధి ):**



వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు రామసాని కృష్ణ ఆధ్వర్యంలో ముఖ్య అతిథి మాజీ జడ్పీటీసీ మెడిశెట్టి రాములు సమక్షంలో తెలుగుదేశం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి అన్న యన్.టి.ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అర్పించినారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ జెడ్పిటిసి మేడిశెట్టి రాములు అన్నారం గ్రామ పార్టీ కార్యకర్తలు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.తెలుగుదేశం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్నారం గ్రామంలో 200 మందికి అన్నదానం చేసారు.మాజీ జడ్పీటీసీ మెడిశెట్టి రాములు మాట్లాడుతూ... నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల ఆత్మ గౌరవం కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అది 1982 మార్చి 29 వ తారీఖు ఒక సామాన్యుడు ఆనంద పడిన క్షణాలు, తెలుగు వాడి ఆత్మ గౌరవం ప్రపంచానికి చాటి చెప్పిన క్షణాలు, అన్న నందమూరి తారక రామారావు , పేద ప్రజల అభ్యున్నతి కోసం, బడుగు బలహీన వర్గాల శ్రేయస్సు కోసం తెలుగుదేశం పార్టీ (టీడీపీ) 1982, మార్చి 29న ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో స్థాపించబడింది. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని కాపాడటం మరియు కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా నిలవడం ఈ పార్టీ ముఖ్య ఉద్దేశం. పార్టీ ఆవిర్భావం తర్వాత, కేవలం తొమ్మిది నెలల్లోనే ఎన్టీఆర్ అధికారంలోకి రావడం భారత రాజకీయాల్లో ఒక సంచలనం సృష్టించింది అన్నారు."సమాజమే దేవాలయం పేద ప్రజలే దేవుళ్ళు" అనే సిద్ధాంతంతో మొదలై నేటికి(మార్చి 29 కి)44 సంవత్సరాలు అయిన సందర్భంగా అన్నారం గ్రామంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు రామసాని కృష్ణ ఆధ్వర్యంలో జెండా ఎగరవేయటం జరిగిందని మాజీ జడ్పీటీసీ మెడిశెట్టి రాములు తెలిపారు.ఈ సందర్భంగా రామసాని కృష్ణ మాట్లాడుతూ, పార్టీ ఆవిర్భావం నుంచి తాము క్రమశిక్షణతో, నిబద్ధతతో పనిచేస్తూ వస్తున్నామని తెలిపారు. రాష్ట్ర రాజకీయ పరిణామాల నేపథ్యంలో కొంత వెనుకబడి ఉన్నప్పటికీ, పార్టీపై ఉన్న అభిమానం తమ గుండెల్లో ఎప్పటికీ నిలిచే ఉంటుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తామని, మండల వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు లూనావత్ బిక్ష నాయక్, జనగాం లక్ష్మణ్, గొల్లపల్లి మహేందర్, అలీసాబ్, ఎస్‌కే మైబెల్లి, దురిశెట్టి ప్రభాకర్, బుర్ర దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**పరకాల మార్చి 29 (వుదయం ప్రతినిధి):**

నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, పరకాల నియోజకవర్గం వెలమ వాడ లో ఉన్న టీడీపీ జెండా దగ్గర ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ చిత్రపటానికి, పూలమాల వేసి జెండా ఆవిష్కరించిన టీడీపీ పరకాల నియోజకవర్గం బాధ్యులు (కందుకూరి నరేష్), చిదురాల రామన్న .ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ పరకాల నియోజకవర్గం బాధ్యులు కందుకూరి నరేష్ మాట్లాడుతూ...తెలుగుదేశం పార్టీని 1982లో స్థాపించిన ఎన్టీఆర్ గారు, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానేత. ఆయన రాజకీయాల్లోకి రావడం ప్రజాసేవ కోసం మాత్రమే. ఆయన పాలనలో అనేక ప్రజా ప్రయోజన కార్యక్రమాలు అమలు చేశారు.ప్రధానంగా:పేద ప్రజల కోసం ₹2 కిలో బియ్యం పథకం ప్రవేశపెట్టారుఈ కార్యక్రమం లో టీడీపీ మండలం అధ్యక్షులు, చిదురాల రామన్న ,ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శంకర్, బోయిని రాజశేఖర్, ఉపాధ్యక్షులు, బోలోజీ స్వామి, కార్యదర్శి, పసునూటి మంజుల, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి
## జిల్లా కలెక్టర్ అంకిత్




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 30 (వుదయం ప్రతినిధి):**

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 3890 కేసుల పరిష్కారం

జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్*

సూర్యాపేట, మార్చి 29(వుదయం)

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 28న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 3890 కేసులు పరిష్కరించబడినట్లు జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ తెలిపారు. ప్రజలకు త్వరిత న్యాయం అందించడమే లోక్ అదాలత్ లక్ష్యమన్నారు. పరిష్కరించిన కేసుల్లోఎంవియాక్ట్, డీడీ కేసులు 1845, ఈ పిటి కేసులు 1463, ఐపీసీ కేసులు 498,ఎసు ఎల్ ఎల్కేసులు 84 ఉన్నట్లు తెలిపారు. పోలీస్ శాఖ, న్యాయ విభాగం మరియు ఇతర శాఖల సమన్వయంతో ఈ కేసుల పరిష్కారం సాధ్యమైందని ఎస్పీ తెలిపారు. భవిష్యత్తులో నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## కలెక్టరేట్ లో ప్రజావాణి - గిరివాణి ప్రోగ్రామ్



**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**ములుగు, మార్చి 29 (వుదయం ప్రతినిధి) :**

సోమవారం రోజున ములుగు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి గిరివాణి (గిరిజన దర్బార్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం రోజున ఐటీడీఏ ఏటూరు నాగారం లో నిర్వహించే గిరివాణి (గిరిజన దర్బార్) కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఈనెల 30వ తేదీన కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని గిరిజనులు, గిరిజనేతరులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకొని తమ అర్జీలను సమర్పించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## ఘనంగా 'కాంగ్రెస్ జెండా పండుగ'



**హనుమకొండ టౌన్, మార్చి 29 (వుదయం ప్రతినిధి):**

హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం రోజున 'కాంగ్రెస్ జెండా పండుగ' కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హన్మకొండ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు బొచ్చు చందర్ హాజరై, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొచ్చు చందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సేవాదళ్ సైనికుల్లాపనిచేయాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, సేవా భావమే కాంగ్రెస్ సేవాదళ్ బలమని ఆయన కొనియాడారు.ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు కీలక నేతలు తాళ్లపల్లి రాజు (హన్మకొండ నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు)ఏరుకొండ రవీందర్ గౌడ్ (పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు)పల్లపు యాదగిరి (రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ ఇన్స్పెక్టర్)నెట్టె బాలరాజు (జిల్లా ఉపాధ్యక్షులు,కాంగ్రెస్ సేవాదళ్) తాటికొండ ప్రసాద్ (జిల్లా జనరల్ సెక్రెటరీ, కాంగ్రెస్ సేవాదళ్)బిరుదు రాజు శ్రీధర్ రాజు (సోషల్ మీడియా విభాగం, హన్మకొండ జిల్లా సేవాదళ్)ధూమాల కిషోర్ (పరకాల మండల సేవాదళ్ అధ్యక్షులు)మేకల రవీందర్ (హసన్‌పర్తి మండల సేవాదళ్ అధ్యక్షులు) సీనియర్ నాయకులు సముద్రాల సోమయ్య, జిల్లెల్ల కృష్ణమూర్తి తో పాటు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## కామారెడ్డిలో 31 న ఉద్యోగ మేళా




**కామారెడ్డి, (వుదయం ప్రతినిధి):** ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల కామారెడ్డి లో టి యస్ కె సి ఆధ్వర్యంలో టాస్క్ సౌజన్యంతో ప్రముఖ కంపెనీలైన శ్రీరామ్ ఫార్చ్యూన్, ముత్తుట్ ఫైనాన్స్, క్రిస్ ఫైనాన్షియల్ లిమిటెడ్, వరుణ్ మోటార్స్ లో ఉద్యోగాల కొరకు ఈ నెల 31 మంగళవారం రోజు కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా.కె.విజయ్ కుమార్ ఆదివారం తెలిపారు. ఈ ఉద్యోగ మేళాకు ఏదైనా ఇంటర్ , డిగ్రీ, బీటెక్ , బీఫార్మసీ, పి జిలో 50% మార్కులు కలిగి వుండి, 28 సంవత్సరాల లోపు వయసు ఉన్న వారు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మంగళవారం రోజు ఉదయం 10 :30 గంటల లోపు రెస్యూమే, ఆకాడమిక్ సర్టిఫికెట్స్ తో కళాశాలలో హాజరై సదవకాశాన్ని వినియోగించుకోగలరని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాల టియస్ కెసి విభాగంలో లేదా 94403 56276, 91823 04067 నెంబరు ల లో సంప్రదించగలరని తెలిపారు.

## లోక్ అదాలత్‌లో 3758 కేసుల పరిష్కారం

### కరీంనగర్ సీపీ గౌస్ ఆలం

**కరీంనగర్ (వుదయం ప్రతినిధి)** ఈ నెల 28 శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కేసులను వేగవంతంగా పరిష్కరించడంలో పోలీస్ శాఖ, న్యాయ విభాగం, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో విశేష ఫలితాలు సాధించబడి, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ లోక్ అదాలత్ నిర్వహించబడిందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా మొత్తం 3758 కేసులు విజయవంతంగా పరిష్కరించబడినట్లు పేర్కొన్నారు. మోటార్ వెహికల్ యాక్ట్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 2791, ఈ పెట్టీ కేసులు 511, ఐపిసి/బిఎన్ఎస్ కేసులు 427, ఎస్ఎల్ఎల్ కేసులు 29 పరిష్కరించినట్లు తెలిపారు.జాతీయ లోక్ అదాలత్ వంటి కార్యక్రమాలు ప్రజలకు త్వరిత న్యాయం అందించడంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న కేసులను పరస్పర అవగాహనతో, చట్టబద్ధంగా పరిష్కరించడం ద్వారా కోర్టులపై భారం తగ్గించడంతో పాటు, ప్రజల సమయం మరియు ఖర్చు కూడా ఆదా అవుతుందన్నారు. అదేవిధంగా, ప్రజలు తమ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియల నుంచి విముక్తి పొందగలరని, భవిష్యత్తులో నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమాల్లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. కమీషనరేట్లోని పోలీస్ అధికారులు, సిబ్బంది, న్యాయవాదులు మరియు సంబంధిత శాఖల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ స్థాయిలో కేసుల పరిష్కారం సాధ్యమైందని కమిషనర్ పేర్కొన్నారు.



## వయోజన నిరక్షరాస్య మహిళలకు..

# అమ్మకు అక్షరమాల పరీక్షలు

### డీఆర్డీఓ, మెప్మా ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిర్వహణ

### హాజరైన 12వేలకు పైగా మంది మహిళలు

**రాజన్న సిరిసిల్ల, వుదయం ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని వయోజన నిరక్షరాస్య మహిళలకు అమ్మకు అక్షరమాల కార్యక్రమం కింద పరీక్షలు నిర్వహించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలకు అనుగుణంగా డీఆర్డీఓ, మెప్మా ఆధ్వర్యంలో జిల్లాలోని 23,375 మంది వయోజన నిరక్షరాస్య మహిళలకు జిల్లాలోని అన్ని మండలాల్లోని గ్రామపంచాయతిల్లో అమ్మకు అక్షరమాల కార్యక్రమం కింద మూడు నెలల పాటు పుస్తకాలు అందజేసి, పాఠాలు బోధించారు. బోధన పూర్తి కాగా, జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఆదివారం వయోజన నిరక్షరాస్య మహిళలకు ఐకేపీ అధికారులు, సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. మొత్తం 12,856 మంది పరీక్షలు రాశారు. మహిళలు బోధన సద్వినియోగం చేసుకొని. పరీక్షలకు హాజరయ్యారు. ఐకేపీ అధికారులు పాల్గొన్నారు.



## వయోజన విద్యాశాఖ ద్వారా ఉల్లాస్



**జగిత్యాల(వుదయం ప్రతినిధి)** అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో భాగంగా నిరక్షరాసులైన మహిళలను మహిళా సంఘాల ద్వారా గుర్తించి వారికి ఆదివారం జిల్లాలోని మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సంఘం సభ్యులకు వయోజన విద్యా శాఖ వారు ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా పరీక్షలు నిర్వహించారు ఆదివారం నిర్వహించిన పరీక్షలలో జిల్లా వ్యాప్తంగా ఐదు మున్సిపాలిటీలలో 900 మంది మహిళలు పరీక్షలకు హాజరయ్యారు మహిళలు జిల్లా కలెక్టర్ కి కృతజ్ఞతలు తెలిపారు

## తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**పెద్దపల్లి (వుదయం ప్రతినిధి)** తెలుగు వారి ఆత్మ గౌరవ ప్రతీకగా, పేదలకు భరోసాగా అన్న స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు గారి ఆలోచనల్లోంచి పుట్టిందే తెలుగుదేశం పార్టీ.ఆనాటి నుండి నేటి వరకు పార్టీ దిగ్విజయంగా పేదల పక్షాన నిలబడుతూనే ఉంది, ఎప్పటికీ ఈ పరంపర కొనసాగిస్తూనే ఉంటుంది. ఈరోజు పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పెద్దపల్లి కేంద్రంలో పార్టీ సీనియర్ నాయకులు పెద్దపల్లి పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యులు అక్కపాక తిరుపతి కోళ్ల కిషన్ రావు పెద్దపల్లి మున్సిపల్ అధ్యక్షుడు కొప్పుల మురళి NTR విగ్రహానికి పూలమాలలంకరణ చేసి జెండావిష్కరణ గావించారు. తెలుగువారి ఆత్మగౌరవం, అభ్యున్నతి కోసం పుట్టింది తెలుగుదేశం పార్టీ. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అని నినదించిన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ ఎన్టీఆర్ గారి స్ఫూర్తితో పేద ప్రజలకు అండగా నిలిచింది టీడీపీ పార్టీ అని జిల్లా అక్కపాక తిరుపతి అన్నారు. టీడీపీ ఆవిర్భావం తర్వాతే సమాజంలో అణగారిన, బడుగు, బలహీనవర్గాలకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు వచ్చింది. దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. ప్రపంచంలో తెలుగు వారిని నెం.1గా చేయడమే లక్ష్యంగా నేడు నారా చంద్రబాబునాయుడు గారి నాయకత్వం లో పార్టీ ముందుకు సాగుతుందన్నారు.1982 మార్చి 29న ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ 44 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ప్రాంత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అధ్యక్షుడు అక్కపాక తిరుపతి నిజ వర్గ ఇన్చార్జ్ కోళ్ల కిషన్ రావు పెద్దపల్లి మున్సిపల్ అధ్యక్షుడు కొప్పుల మురళి శ్రీనివాస్తి పాల్గొన్నారు.



## ఉల్లాస్ పథకంలో భాగంగా

# నిరక్షరాస్యులకు పరీక్షలు

**జన్నారం,మార్చ్ 29(వుదయం విలేఖరి)** ఉల్లాస్ పథకంలో భాగంగా మండలంలోని పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని నిరక్షరాస్యులైన వయోజన మహిళలకు ఆదివారం రోజున మండల కేంద్రంలోని జిల్లా బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు.పరీక్షా కేంద్రాన్ని జిలా వయోజన విద్యాధికారి ఏ.పురుషోత్తం సందర్శించారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, మంచిర్యాల జిల్లాను 100 శాతం అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలని అన్నారు. నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లాస్ పథకాన్ని అమలు చేస్తున్నాయని, దీనిలో బాగా 15 ఏళ్ల పైబడిన నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాసులుగా మార్చేందుకు చదవడం రాయడం నేర్పించడమే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ ఏ. సత్యనారాయణమూర్తి, ఏపిఎం లలిత కుమారి, డిఆర్పి కందుల తిరుపతి, ఎం సుమన్ ,రవీందర్ పాల్గొన్నారు.



## ఘనంగా తెలుగుదేశం

# ఆవిర్భావ దినోత్సవం



**జన్నారం, (వుదయం విలేఖరి)** జన్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం రోజున ఆ గ్రామంలో ఆదిలాబాద్ జిల్లా పార్లమెంటరీ కార్యదర్శి పులిశెట్టి శ్రీనివాస్ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేకు కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేసి వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ..పార్టీ ఎదుగుదలకు కృషి చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావును స్మరించుకున్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్నాడని అన్నారు. అలాగే గ్రామాల అభివృద్ధి, యువత పాత్ర, మహిళల సాధికారత వంటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. కమిటీ అధ్యక్షులు పులిశెట్టి శైలజ,సీనియర్ నాయకులు గాజుల బుచిమల్లు,లక్కయ్య, మామిడి నర్సయ్య , ఒజోజుల మొగిలి, ముంజంపెల్లి లచ్చన్న, పోషమల్లు, గొల్లపల్లి ప్రసాద్, గంధం పద్మారావు, భాగ్యరావు, సొగల శైలు, పెద్దన్న, సారం రాఘవులు, రవి, పులిశెట్టి అనంతవ్వ పాల్గొన్నారు.

# గంజాయి మొక్కలు స్వాధీనం



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా , సిర్పూర్ (యూ) సబ్ ఇన్స్పెక్టర్ డి.రామకృష్ణ ఆధ్వర్యంలో విశ్వసనీయ సమాచారంపై చర్యలు చేపట్టారు. సమాచారం ప్రకారం మారుగూడ గ్రామ పరిధిలోని వ్యవసాయ భూమిలో కోవా అర్జున్ అనే వ్యక్తి అక్రమంగా గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు తెలిసి, సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించి, చట్టపరమైన విధానాలను అనుసరించి రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖ అధికారులను పంచులుగా తీసుకొని దాడి చేశారు.పోలీస్ బృందం సంఘటన స్థలానికి చేరుకోగా అనుమానాస్పదంగా ప్రవర్తించిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా, అతను కోవా అర్జున్ (వయస్సు 37 సంవత్సరాలు), నివాసం మారుగూడ గ్రామం అని తెలిపాడు. విచారణలో అతను తన వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలను సాగు చేసినట్లు ఒప్పుకున్నాడు.తదుపరి, వ్యవసాయ శాఖ అధికారుల సమక్షంలో భూమిని పరిశీలించగా మొత్తం 08 గంజాయి మొక్కలు (సుమారు 2 నుండి 3 అడుగుల ఎత్తు) గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన గంజాయి మొక్కల విలువ సుమారు రూ. 80,000/ గా అంచనా వేశారు. ఈ మొక్కలను పంచుల సమక్షంలో సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. ఆ వ్యక్తి ని అదుపులోకి తీసుకొని, అతనిపై ఎన్డిపిఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు, తదుపరి విచారణ కొనసాగుతోంది.

## తల్లిదండ్రులను..

# నిర్లక్ష్యం చేస్తే జీతంలో కోత



**ఆదిలాబాద్: వుదయం ప్రతినిధి,** వృద్ధ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో కోత విధించే బిల్లుకు బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని, చదువుకుని మంచి ఉద్యోగాల్లో ఉన్నవారే తల్లిదండ్రులను పట్టించుకోకపోవడం సమాజానికి ఆందోళనకర పరిస్థితి అని బీజేఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ పేర్కొన్నారు.అసెంబ్లీలో జరిగిన చర్చలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వృద్ధాశ్రమాలు చాలా అరుదుగా ఉండేవని, ప్రస్తుతం వాటి సంఖ్య పెరుగుతుండటం కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న సంకేతమని అన్నారు. ఒకప్పుడు అనాథలు మాత్రమే వృద్ధాశ్రమాల్లో ఉండేవారని, ఇప్పుడు కుటుంబాలు ఉన్న వృద్ధులనే అక్కడికి పంపించడం బాధాకరమని వ్యాఖ్యానించారు.వృద్ధులను హింసించే లేదా నిర్లక్ష్యం చేసే ఉద్యోగుల జీతాల్లో కనీసం 15 శాతం కోత విధించేలా కఠిన చట్టం తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యతను గుర్తించేలా చట్టం ఉండాలని అభిప్రాయపడ్డారు. వృద్ధులను ఆదరించే వారికి వారి ఆస్తుల్లో భాగస్వామ్యం కల్పించే అంశంపై కూడా ప్రభుత్వం ఆలోచించాలని కోరారు.

## మల్లేశం యాదవ్ ను సన్మానించిన యాదవ సంఘం నాయకులు

**పెద్దపల్లి మార్చి 29 (వుదయం ప్రతినిధి)** పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నికైన యాదవ్ ముద్దుబిడ్డ మేకల మల్లేశం యాదయ్ ను మర్యాద పూర్వకంగా కలసి శాలువా తో సన్మానించిన యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు, బి ఆర్ ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు సలెంద్ర రాములు యాదవ్, పాల్గొన్న పెద్దకాల్వల సర్పంచ్ కనకమ్మ పోల్ రాజు, జాగృతి నాయకులు సలెంద్ర కొమురయ్య బీజేపీ మండల అధ్యక్షులు పర్స సమ్మయ్య కలువల రాజేశం పాల్గొన్నారు



## మియత్-ఎ-హఫ్ఫాజ్ ఈద్ మిలాప్



**కరీంనగర్ (వుదయం ప్రతినిధి)** నగరంలో ని ముకర్రంపురాలోని కరీంనగర్ ఫంక్షన్ హాల్‌లో జమియత్ఎహఫ్ఫాజ్ అధ్యక్షుడు ఖాజీ అహ్మద్ మంక్బత్ షా ఖాన్ అధ్యక్షతన ఒక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా ఫాదర్ క్రిస్టోఫర్ యం ఆర్ ఓ ఈ నరేంద్ర పాల్గొన్నారు. ఈ ఈద్ మిలాప్ కార్యక్రమంలో నగర ప్రముఖులతో పాటు దేశంలోని ముస్లిమేతర సోదర సోదరీమణులు కూడా పాల్గొన్నారు. దేశ సోదర సోదరీమణులు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. జమియత్ఎహఫ్ఫాజ్ చేపట్టిన సామాజిక సంక్షేమ సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు, వైద్యులు, ఇంజనీర్లు, మత పెద్దలు పాల్గొన్నారు. జమియత్ఎహఫ్ఫాజ్ అతిథులకు విందు భోజనం మరియు షేర్‌ఎ ఖోర్మాను అందించింది. జమియత్ హఫాజ్ అధికారులు హఫీజ్ జియావుల్లాఖాన్, హఫీజ్ రిజ్వాన్ ఫలాహి, హఫీజ్ సాదిఖ్ అలీ అహ్మద్, హఫీజ్ ముదస్సర్ ఉర్ రెహమాన్, హఫీజ్ ఫరీదుద్దీన్, వసీమ్ మహ్మద్, హఫీజ్ వసీమ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల విద్యాభివృద్ధికి 'ఉల్లాస్' అక్షరాభ్యాసం

**నాగిరెడ్డిపేట్,వుదయం** కేంద్ర ప్రభుత్వం వయోజన విద్యాశాఖ మరియు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ సమన్వయంతో అమ్మకు అక్షరాభ్యాసం ఉల్లాస కార్యక్రమాన్ని అమలు చేసిందని మండల ఇంచార్జ్ ఏపిఎం రామ్ నారాయణ గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా మండల ఇన్చార్జి ఏపిఎం రామ్ నారాయణ గౌడ్ మాట్లాడుతూ... అమ్మకు అక్షరమాల పేరుతో మహిళలను అక్షరాస్యులుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. ఉల్లాస్లో భాగంగా జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళ నిరక్షరాశులకు గుర్తించారు.అక్షర వికాసం పుస్తకల సహాయంతో తెలుగు చదవడం అంకెలు గుర్తించడం సాధన చేయించారు.కామారెడ్డి జిల్లాలో 526 సెంటర్లు 16,331 మంది మహిళలకు పరీక్ష నిర్వహించారు.అదే విధంగా నాగిరెడ్డిపేట్ మండలంలో 1867 నిరక్షరాశులను గుర్తించడం జరిగిందని మండల ఇన్చార్జి ఏపిఎం రామ్ నారాయణ గౌడ్ తెలిపారు.మొదటి విడతగా 26 సెంటర్లు 500 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో జిల్లా నుండి డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ డిపిఎం నూకల శ్రీనివాస్,మండల ఇన్చార్జ్ ఏపిఎం రామ్ నారాయణ, అచ్చయపల్లి సర్పంచ్ సాయిలు,ధర్మారెడ్డి సర్పంచ్ గులపల్లి లక్ష్మీనారాయణ, అక్కంపల్లి సర్పంచ్ వెంకా గౌడ్,ఉపసర్పంచులు గౌడ్,సీసీలు,వివోఏలు, తదితరులు పాల్గొన్నారు.



## నవోదయలో సీటు సాధించిన

# విద్యార్థికి ఘన సన్మానం

**నాగిరెడ్డిపేట్,వుదయం**

మండలంలోని మెల్లకుంట తాండ గ్రామానికి చెందిన కోర్ర నిఖిల్ జవహర్ నవోదయ విద్యాలయం 6వ తరగతి ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి సీటు సాధించాడు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి ఉమన్నగారి మనోహర్ రెడ్డి ఆయనను శాలువాతో సత్కరించి తిరుపతి లడ్డూ ప్రసాదం అందజేశారు.ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా విద్యార్థులు మెరుగైన విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని తెలిపారు. భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదిగి మండలానికి, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వజ్ర నాయక్,కొర్ర వాసేందర్ గోవింద నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్షా సమావేశం

**కరీంనగర్ (వుదయం ప్రతినిధి)** హాజరైన ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు జిల్లా కలెక్టర్,మున్సిపల్ కమిషనర్, ఇరిగేషన్ ,టూరిజం ఉన్నతాధికారులు.మానేరు రివర్ ఫ్రంట్ పనుల పురోగతి, పెండింగ్ నిధులు మరియు ప్రాజెక్టు పూర్తికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చ.ప్రాజెక్టును వేగవంతం చేయాలని అధికారులకు మంత్రుల ఆదేశం. జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులతో క్షేత్రస్థాయి నివేదికలపై ఆరా.త్వరలో మానేరు రివర్స్ ఫ్రంట్ పై మంత్రుల క్షేత్ర స్థాయిలో పర్యటన భూ సేకరణ, అంచనా వ్యయం, సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.



## ఆత్మ కమిటీ ఉపాధ్యక్షులు పదవి ఉన్నదా?

**నాగిరెడ్డిపేట్,వుదయం** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల నూతనంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఆత్మ కమిటీలను ఏర్పాటు చేసి అధ్యక్షులను డైరెక్టర్లను నియమించడం జరిగింది.దాంట్లో భాగంగా ఎల్లారెడ్డి నియోజకవర్గం ఆత్మ కమిటీ అధ్యక్షులుగా లింగంపేట్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దశరథను నియమించడం జరిగింది. నాగిరెడ్డిపేట్ మండలం నుండి రాఘవపల్లి, తాండూర్,నాగిరెడ్డిపేట గ్రామాల నుండి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు క్రిస్టఫర్, లక్ష్మణ్ ఠాగూర్, దివిటి కిష్టయ్యలను డైరెక్టర్గా నియమించడం జరిగింది.ఆత్మ కమిటీలో అధ్యక్షులు,డైరెక్టర్లు మాత్రమే ఉంటారని ఎల్లారెడ్డి ఏడిఏ సుధమాధురి తెలిపారు. కానీ తాండూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండల ప్రధాన కార్యదర్శి దివిటీ కిష్టయ్య ఆత్మ కమిటీ ఉపాధ్యక్షులుగా తానే పదవిని సృష్టించుకుని సోషల్ మీడియాలో ప్రచురితం చేస్తూ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ తన పెత్తనని కొనసాగిస్తున్నారని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు లోలోపల చర్చించుకుంటున్నారు.ఆత్మ కమిటీ ఉపాధ్యక్షులుగా అధికారికంగా లేకున్నా కానీ దివిటి కృష్ణయ్య అనే వ్యక్తి తానే ఆత్మ కమిటీ ఉపాధ్యక్షులుగా ఏర్పాటు చేసుకొని ఇష్టానుసారంగా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దివిటీ కిష్టయ్య ఉన్న విషయం కూడా స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు కూడా సమాచారం లేదని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. కృష్ణయ్య ఉపాధ్యక్షుల పదవి లేకున్నా అలా ఎందుకు వ్యవహరిస్తున్నారో తెలియడం లేదని స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మనోభావాలు దెబ్బతీయడానికా ?లేక ఎమ్మెల్యేకు చెడ్డ పేరు తేవడానికి చేస్తున్నారో అర్థం కావడం లేదని మరికొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు అంటున్నారు.ఆత్మ కమిటీ ఉపాధ్యక్షులుగా ఉండాలంటే రెండు మూడు ఎకరాల పొలం అయినా ఉండాలని మరికొందరు అంటున్నారు. ఎమ్మెల్యే స్పందించి దివిటీ కిష్టయ్య వ్యవహరిస్తున్న తీరును కట్టడి చేయాలని కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.

## గుర్తుతెలియని మృతదేహం, వివరాలు తెలిస్తే సమాచారం అందించండి: ఈస్గాం ఎస్సై చంద్రశేఖర్

**ఆసిఫాబాద్ మార్చి 29 (వుదయం ప్రతినిధి)** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఈస్గాం పోలీస్ స్టేషన్ పరిధిలోని మోసం గ్రామ శివారులో బండల ఒర్రె వద్ద ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఈస్గాం ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. సుమారు రెండు రోజుల క్రితం మరణించి ఉండవచ్చని,మృతుడు సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తిగా కనిపిస్తున్నాడన్నారు. అతను ఎరుపు రంగు టీషర్ట్, ఆష్ కలర్ షార్ట్ ధరించి, మెడలో నలుపు రంగు దారం, కుడి చేతికి కడియం, అలాగే ఎరుపు మరియు పసుపు రంగుల దారాలు ధరించి ఉన్నట్లు గుర్తించారు.ఇట్టి వ్యక్తిని ఎవరైనా గుర్తుపట్టిన పక్షంలో వెంటనే పోలీసులకు సమాచారం అందించవలసిందిగా కోరుతున్నారు.సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు:ఎస్ఐ, ఈస్గామ్: 8712670538 సీఐ, కాగజ్‌నగర్ రూరల్: 8712670508 డీఎస్పీ, కాగజ్‌నగర్: 8712670504 ఈ విషయంపై సమాచారం అందించిన వారికి గోప్యత కాపాడబడుతుందని పోలీసులు తెలిపారు.



# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు



## కౌన్సిలర్ గా గెలిచిన హిందూ ఫ్రెండ్స్ సభ్యులకు ఘన సన్మానం

**నారాయణపేట టౌన్ (వుదయం ప్రతినిధి)**
హిందూ ఫ్రెండ్స్ చారిటబుల్ గ్రూప్ లో ఉన్న ముగ్గురు సభ్యులు మున్సిపాలిటీ ఎన్నికల్లో కౌన్సిలర్లుగా ఎన్నిక కావడంతో ఆసంఘం సభ్యు లు ఆదివారం ఘనంగా సన్మానించారు.నారాయణపేట పట్టణంలోని వివిధ పాఠశాల లో 199091పదోత రగతి బ్యాచ్ లో చదువు కున్న మిత్రులు ఏర్పరచిన హిందూ ఫ్రెండ్స్ చారిటేబుల్ ఆధ్వర్యం లో సభ్యులుగా ఉండి ప్రజాప్రతినిధులు గా ఎన్నికైన తోటి మిత్రులు ఒక టవ వార్డు కౌన్సిలర్ సత్య రఘుపాల్ రెడ్డి, పదిహేనవ వార్డు కౌన్సిలర్ బండి రాజేశ్వరి శివరాం రెడ్డి,17వ వార్డు కౌన్సిల ర్ కల్పన రఘు రామ య్య గౌడ్,21 వ వార్డు కౌన్సి లర్ కమాలపూర్ ప్రభాకర్ లను సన్మానించారు.ఈ కార్యక్రమం హిందూ ఫ్రెండ్స్ చారిటేబుల్ అధ్యక్షుడు ధనంగేరి లక్ష్మికాంత్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు మాట్లాడు తూ మాకు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం పరుచుకొని ఎల్లప్పుడూ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి వాటిని తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తామని అన్నారు.అందరూ కలిసికట్టుగా పార్టీలకతీ తంగా పనిచేసి పట్టణ అభి వృద్ధి కి కృషి చేస్తామని తెలి పారు.ఈ కార్యక్రమంలో హిందూ ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు అమ్మపల్లి చెన్న రెడ్డి, పవడి కృష్ణ,సుతారి రాంరెడ్డి,నందు పటేల్, పోలేపల్లి వినోద్ కుమార్, సుధాకర్,బండి శివరాం రెడ్డి రాజేష్, వెంకటేష్,నాగర్జన రెడ్డి, డాక్టర్.తిరుపతి,సతీష్ గౌడ్,మల్లికార్జున ,చింత రఘు నాగమల్లేశ్,కొండ్లోల శ్రీనివాస్,మన్నే జయ ప్రకాష్,సత్య నారాయణ, ప్రకాష్ గౌడ్,నారాయణ గౌడ్,శివ కుమార్ పాల్గొన్నారు.

## వీర శైవ లింగాయత్..
# సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా







**సంగారెడ్డి వుదయం ప్రతినిధి**
సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లిలో ఆదివారం నిర్వహించిన వీరశైవ లింగాయత్ సమాజం సమావేశం రాజకీయ, సామాజిక ప్రాధాన్యతను సంతరించుకుంది. పీఎస్ఆర్ గార్డెన్ వేదికగా జిల్లా అధ్యక్షుడు ఇప్పపల్లి నర్సింలు అధ్యక్షతన, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరై సమాజ సమస్యలపై స్పందించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, వీరశైవ లింగాయత్ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సమాజ అభివృద్ధి కోసం అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ముఖ్యంగా బసవ భవనం నిర్మాణానికి సంబంధించి మరో ఎంపీ సురేష్ షెట్కార్‌తో కలిసి సహకారం అందిస్తానని తెలిపారు. మాజ ఐక్యతే అభివృద్ధికి మూలమని పేర్కొంటూ, అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. శైవ సంప్రదాయాలకు ప్రతీక అయిన బసవేశ్వరుడు చూపిన మార్గంలో నడవాలని సూచించారు.కంది మండలంలోని కాశీపూర్ గ్రామంలో భవన నిర్మాణానికి కేటాయించిన భూమిపై కూడా ఎంపీ స్పష్టత ఇచ్చారు. భూమికి సంబంధించిన లీగల్ అంశాలు సక్రమంగా ఉంటే, అన్ని విషయాలను తానే చూసుకుంటానని, ఎట్టి పరిస్థితుల్లోనూ భవన నిర్మాణం పూర్తి చేయించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ సమావేశంలో మహిళల భాగస్వామ్యం విశేషంగా కనిపించింది. మహిళల పాత్రను గుర్తించడంతో పాటు వారి సమస్యలపై కూడా చర్చించారు. సమాజ నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.మొత్తంగా, ఈ సమావేశం వీరశైవ లింగాయత్ సమాజ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే దిశగా కీలకంగా నిలిచింది. ఎంపీ ఇచ్చిన హామీలు సమాజంలో కొత్త ఆశలను రేకెత్తించాయి.ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు మరెల్లి అడవప్ప, వెన్న చక్రేశ్వర్, అశోక్, మహిళా విభాగానికి చెందిన అరుణ, శారద, కోశాధికారి సంతోష్ పాటిల్, అణిశెట్టి జయప్రకాష్, జిల్లా అధికార ప్రతినిధి శరత్ బాబు, మీడియా ఇన్‌చార్జ్ మల్లేశం, మండల తాలూకా అధ్యక్షులు శివకుమార్, నాగేశ్వర్, సతీష్ పాటిల్, మాటూరి సంతోష్, ప్రసాది రవిశంకర్, నవీన్, మహిళా సర్పంచులు, కౌన్సిలర్లు మరియు వీరశైవ సమాజ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

## మన్ కి బాత్ వీక్షించిన బిజెపి నాయకులు

**నారాయణపేట టౌన్ (వుదయం ప్రతినిధి)**
ప్రతి నెల చివరి ఆదివారం భారత ప్రజలకు టెలికాస్ట్ ద్వారా తన మనసులోని మాటను తెలుపుతూ దేశం లోని, ప్రపంచంలోని సమకాలంలో జరుగుతున్న అన్ని సమస్యలను తట్టి లేపుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం నిర్వహించిన 132వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నారాయణపేట జిల్లా కేంద్రంలో బిజెపి నాయకులు శ్రద్ధగావీక్షించారు.ఎండాకాలంలో వచ్చే పరీక్షల నుండి మొదలుకొని ప్రపంచ క్రికెట్ విజయాలను మొదలుకొని పశ్చిమాసియా దేశంలో ఇరాన్, ఇజ్రాయిల్ అమెరి కాలో యుద్ధ విషయాలు చాలా స్పష్టమైన రీతిలో భారత దృష్టి కోణంలో దేశ ప్రజలకు వివరించిన తీరు అద్భుతంగా ఉందని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్,అదనపు న్యాయవాది నందు నామాజీ పేర్కొన్నారు. మన్ కీ బాత్ ను వీక్షించిన వాటిలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యామ్,పాటు సీనియర్ నాయకుడు శ్యాంసుందర్ గౌడ్ ,శ్రీనివాస్రెడ్డి,ఉమాకాంత్ ,మహేష్ ,కుమార్ ,అర్జున్, పల్లా రఘులు ఉన్నారు.

## నేషనల్ లోక్ అదాలత్‌లో
# రికార్డు స్థాయిలో 3195 కేసుల పరిష్కారం



**వికారాబాద్: వుదయం ప్రతినిధి:**
ఈ నెల 28 న జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్ అత్యంత విజయవంత మైందని ఎన్నడూ లేని విధంగా భారీ సంఖ్యలో 3195 కేసులు పరిష్కారమయ్యాయని జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలోని అన్ని సబ్‌డివిజన్ల పరిధిలో పోలీసులు, న్యాయశాఖ సమన్వయంతో పనిచేయడం వల్ల ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని ఆమె కొనియాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా మొత్తం 3195 కేసులు పరిష్కారం కావడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఇందులో ముఖ్యంగా 441 FIR కేసులు, 2694 DD (డీడీ) కేసులు, మరియు 60 ఈపెట్టి (Epetty) కేసులు పరిష్కరించబడ్డాయని వివరించారు. ఈ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారుల మధ్య రాజీ కుదిర్చి, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని, తద్వారా సామాన్య ప్రజలకు సమయం మరియు ఖర్చు ఆదా అయ్యాయని ఎస్పీ ఆనందం వ్యక్తం చేశారు.
సబ్‌డివిజన్ల వారీగా చూస్తే, తాండూరు సబ్‌డివిజన్ అత్యధికంగా 1686 కేసులను పరిష్కరించి ప్రథమ స్థానంలో నిలవగా, పరిగి సబ్‌డివిజన్ 846కేసులు, వికారాబాద్ సబ్‌డివిజన్ 631 కేసులను పరిష్కరించాయని ఎస్పీ గణాంకాలను వివరించారు. ఒక్క రోజే (28.03.2026) జిల్లా వ్యాప్తంగా 157 FIR కేసులను పరిష్కరించి లక్ష్యానికి మించి ఫలితాలను సాధించామని ఎస్పీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి, జిల్లాలో పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించి ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించాలని అధికారులను కోరారు. చట్టపరమైన చిక్కుల నుంచి ప్రజలు విముక్తి పొందేందుకు లోక్ అదాలత్ ఒక మంచి వేదిక అని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఇంతటి భారీ స్థాయిలో కేసుల పరిష్కారానికి కృషి చేసిన అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, DCRB డీఎస్పీ జానయ్య, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ డీఎస్పీ ఎన్. యాదయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్,జిల్లా లోని సీఐలు, ఎస్ఐలు మరియు ఇతర పోలీస్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## రక్తదానం చేయండి.. ప్రాణాలను కాపాడండి

**గద్వాల వుదయం ప్రతినిధి)**
రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని ధరూర్ గ్రామ సర్పంచ్ డి.ఆర్. విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని శక్తి కాంప్లెక్స్‌లో గద్వాల ప్రభుత్వ రక్తనిధి సహకారంతో బ్లడ్ డోనర్ ఆర్గనైజర్ ధరూర్ రవి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని గద్వాల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నవీన్ క్రాంతి, సర్పంచ్ విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో గాయపడిన వారికి రక్తం అత్యంత అవసరమవుతుందని పేర్కొన్నారు. దాతలు ఇచ్చే ఒక్క యూనిట్ రక్తంతో పలువురి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ప్రజలు తమ పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు వంటి ప్రత్యేక సందర్భాల్లో రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు.శిబిరంలో 20 యూనిట్ల రక్తం సేకరించబడగా, దాతల సేవలను వారు అభినందించారు. రక్తాన్ని ప్లాస్మా, ప్లేట్‌లెట్లు, ఎర్ర మరియు తెల్ల రక్తకణాలుగా విడదీసి అవసరమైన వారికి అందించవచ్చని వివరించారు.కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర నాయకులు డి.శ్యామ్, రిపోర్టర్లు కంసాలి రవి, సీతారాములు, నౌషాద్, శ్రీధర్, భాస్కర్ రెడ్డి, రామకృష్ణ, బాలరాజు నాయుడు, చాకలి రవి, సంజీవ్, గోపి, దశరథం, సవారన్న, పరుశ, రక్తనిధి పిఆర్ఓ రాకేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## స్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్



**సంగారెడ్డి వుదయం**
సంగారెడ్డి పట్టణంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో వీరేశైవ సమాజం జిల్లా అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక సేవలో భాగంగా స్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయడం విశేషం. ఈ హెల్త్ క్యాంప్‌ను స్టార్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ సతీష్ పాటిల్, డాక్టర్ బిందు మేడం ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్య బృందం సుమారు 100 మంది రోగులను పరిశీలించి, అవసరమైన చికిత్స అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేసింది.ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ఒక మంచి ప్రయత్నంగా నిలిచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.



## సీఎం రిలీఫ్ చెక్కు పంపిణీ

**నారాయణపేట టౌన్ (వుదయం ప్రతినిధి)**
అనారోగ్యంతో చికిత్స పొందిన విఎచ్ పి నాయకుడు ప్రవీణ్ కడుదాస్ కి ఆదివారం తన కార్యాల యంలో నారాయ ణపేట నియోజక వర్గానికి చెందిన ప్రవీణ్ కు సి ఎం రిలీఫ్ ఫండ్ కింద 22 వేల చెక్కును కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయ వాది నందు నామాజీ అందజేశారు.ఈ సంద ర్భంగా నందు నామాజీ మాట్లాడు తూ ప్రతి వ్యక్తి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథ కాలను సద్వినియోగం చేసు కోవాలని సూచించారు.ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు,ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కే.ప్రభాకర్,మహేష్,ఉమాకాంత్,అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**కల్వకుర్తి (వు దయం ప్రతినిధి)**
కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామానికి చెందిన మాడ్గుల ముత్యాలమ్మ అనారోగ్యంతో మృతి చెందింది . ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచు కాయితి ఆశాదీప్ రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబానికి అన్ని విధాల అండగా నిలుస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితి విజయ్ కుమార్ రెడ్డి,ఉప సర్పంచు ఎట్టి సరిత విజయ్ , గ్రామ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు



## నైపుణ్యాల అభివృద్ధి ద్వారానే ఉన్నతమైన జీవితం



**సంగారెడ్డి, మార్చి 29, వుదయం :**
కేంద్ర మానవ వనరులు మరియు యువజన వ్యవహారాల శాఖ సహకారంతో తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డి ఎన్ఎస్ఎస్ విభాగాలు 2, 3, 4 ఆధ్వర్యంలో కలవకూర్, మల్కాపూర్, అంగడిపేట గ్రామాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శీతాకాల శిబిరాలలో భాగంగా "నాయకత్వ లక్షణాలు - నైపుణ్యాల అభివృద్ధి" అంశంపై ఆదివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని సోలాపూర్‌కు చెందిన జ్ఞాన ప్రబోధిని సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జ్ఞాన ప్రబోధిని స్వచ్ఛంద సంస్థ జాయింట్ సెక్రటరీ అమూల్ గాంగిలి మాట్లాడుతూ, యువత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని అన్నారు. నైపుణ్యాల ద్వారానే సరైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని, నాయకత్వ లక్షణాలు మరియు నైపుణ్యాల అభివృద్ధితో యువత ఏ లక్ష్యాన్నైనా సాధించగలదని పేర్కొన్నారు.యువత స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని, దేశ నిర్మాణం యువత చేతుల్లోనే ఉందని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో నిర్మాణాత్మక కార్యక్రమాలను ప్రాయోగికంగా నిర్వహించినట్లు తెలిపారు.అదేవిధంగా బాలికలను ఉద్దేశించి అమూల్ గాంగిలి మాట్లాడుతూ, జాతి నిర్మాణంలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, మహిళలు లక్ష్యాన్ని నిర్ణయించుకొని కృషి చేస్తే ఏ స్థాయికైనా ఎదగగలరని అన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ్ కుమార్, డాక్టర్ వాణి మరియు ఇతరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 11,193 కేసులు పరిష్కారం

**వుదయం సిద్దిపేట బ్యూరో (మార్చి 29)**
సిద్దిపేట పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసుల పరిష్కారంలో విశేష ఫలితాలు సాధించబడినట్లు పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టుల పరిధిలో ఉన్న మొత్తం 11,193 కేసులు పరిష్కరించబడినట్లు పేర్కొన్నారు. వాటిలో ఐపీసీ (IPC) కేసులు - 733, డీడీ (DD) కేసులు - 7,995, ఈపెట్టీ (ePetty) కేసులు - 2,465 ఈ కేసుల పరిష్కారంతో బాధితులకు తక్షణ న్యాయం అందించడంతో పాటు, కోర్టులపై ఉన్న భారం కూడా గణనీయంగా తగ్గినట్లు సీపీ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్, మల్కాజిగిరి జిల్లాల తర్వాత మూడో స్థానంలో సిద్దిపేట జిల్లా అత్యధిక కేసుల పరిష్కారాలను నమోదు చేసి అగ్ర స్థానంలో నిలిచిందని తెలిపారు.ఈ విజయవంతమైన కార్యక్రమానికి సహకరించిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, సిబ్బంది మరియు సంబంధిత శాఖలందరికీ సీపీ అభినందనలు తెలిపారు.



## పాడి రైతులను ఆదుకోవాలి



**గద్వాల, (వుదయం ప్రతినిధి)**
పాలు ఉత్పత్తి చేసే పాడి రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం నాయకుడు ఏ. వెంకటస్వామి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీరెల్లి రోడ్డులో ఆదివారం నిర్వహించిన పాల ఉత్పత్తిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు.విజయ డైరీ ద్వారా ప్రభుత్వమే నేరుగా పాలను సేకరించి, రైతులకు వారానికి ఒకసారి చెల్లింపులు చేయాలని కోరారు. ఇతర రాష్ట్రాల నుంచి పాలను దిగుమతి చేయడం వల్ల స్థానిక పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ఖర్చులు, తగ్గుతున్న ధరల కారణంగా పాడి రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. . బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీతో సబ్సిడీ రుణాలు అందించి పాడి రంగాన్ని ప్రోత్సహించాలని కోరారు. పాడి రంగాన్ని బలోపేతం చేస్తే పాల ఉత్పత్తి పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.గౌరవ అధ్యక్షుడిగా ఏ. వెంకటస్వామి, అధ్యక్షుడిగా మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పెద్ద పరుశరాముడు, కోశాధికారిగా రఘు తదితరులను ఎన్నుకున్నారు ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ పాడి రైతులంతా సంఘటితంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐక్య పోరాటాల ద్వారానే తమ హక్కులను సాధించగలరని పేర్కొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కలెక్టరేట్ పార్కు.. అభివృద్ధికి రూ.10 లక్షలు

**సంగారెడ్డివుదయం:**
పట్టణంలోని కలెక్టరేట్ పార్కును మరింత సుందరీకరించేందుకు మున్సిపల్ చైర్పర్సన్ కూన వనిత రూ.10 లక్షల నిధులను మంజూరు చేశారు. ఆదివారం పార్కును పరిశీలించిన ఆమె, మరో రెండు రోజుల్లో టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల రెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే విధంగా పార్కును అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిరోజు యోగా చేస్తేనే సంపూర్ణ ఆరోగ్యం

సంగారెడ్డి: ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం కలెక్టర్ కార్యాలయం పార్కులో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిరోజూ యోగా సాధన చేస్తే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని మున్సిపల్ చైర్మన్ వనిత అన్నారు. పతాంజలి యోగ సభ్యులు దత్తు, మున్సిపల్ సిబ్బంది, వాకర్లు కలిసి యోగాసనాలు సాధన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి కూడా పాల్గొన్నారు.



## మహిళల.. అభ్యున్నతికి కృషి

**సంగారెడ్డి వుదయం**
సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి లోని పీఎస్ఆర్ గార్డెన్‌లో వీరశైవ లింగాయత్ జిల్లా సమాజం అధ్యక్షుడు ఇప్పపల్లి నర్సింహులు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ కార్యదర్శి గిరిజ షెట్కార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు లేనిదే సృష్టిలేదని, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.లింగాయత్ సమాజానికి సంబంధించిన ఏ సమస్యలైనా ఉన్నా, వాటిని తన తండ్రి ఎంపీ సురేష్ షెట్కార్‌తో కలిసి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని సభాముఖంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమాజ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్

**కల్వకుర్తి మార్చి 29 (వు దయం )**
నియోజకవర్గ పరిధిలోని వెల్దండ మండల్ , పెద్దాపూర్ , కోట) గ్రామంలో వయోజనుల కోసం ఉల్లాస్ నవ భారత సాక్షరత మూల్యాంకన పరీక్ష కేంద్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాలు సందర్శించారు. గ్రామం అభివృద్ధి చెందుతుందని ఆమె తెలిపారు. గ్రామంలోని ఆసక్తి గల మహిళలు చురుకుగా పాల్గొని వయోజన విద్యను పొదలని గ్రామ సంఘ సభ్యులు, వలంటీర్లు కృషి సూచించారు. గ్రామ సర్పంచ్ కేశ మల్ల అనూష కృష్ణ, ఉప సర్పంచ్ ప్రసాద్ లు పాల్గొన్నారు

## దళితులపై దాడులు.. పట్టించుకోని అధికారులు..

**నారాయణపేట (వుదయం ప్రతినిధి)**
నారాయణపేట జిల్లాలో దళితులపై దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఈ దాడులపై అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని కనపరుస్తూ సరైన చర్యలు తీసుకోకపోవడం ద్వారా జిల్లాలోని దళితులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేసింది. ఈనెల 25వ తేదీన నారాయణపేట పట్టణంలో మోతే ఎర్ర కాశప్ప బుడగ జంగం పై కన్నా శివకుమార్ అతని అల్లుడు రవికుమార్లు కర్రలతో దాడి చేసి చంపడానికి ప్రయత్నం చేశారు. తీవ్ర రక్తస్రావమైన కాశప్పను ఆసుపత్రుల్లో చేర్పించారు. అమ్మిరెడ్డి పల్లెలో ఈనెల 27వ తేదీన రాముల వారి కళ్యాణం సందర్భంగా దళిత దంపతులు లక్ష్మీ(గ్రామ సర్పంచ్) ఆంజనేయులును కళ్యాణం నిర్వహణలో ఉండకూడదని, పూజలో కూర్చున్న సర్పంచ్ దంపతులను లేపి పంపి అవమానపరిచిన కమర్షియల్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న వెంకట్రామరెడ్డి పై అతని అనుచరులపై కేసు నమోదు అయ్యింది. నిందితులను నేటికి వారిని రిమాండ్ కు పంపలేదు. చేయూత స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, కుల నిర్మూలనా పోరాట సమితి జిల్లా అధ్యక్షులు డి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు చంటి, ప్రజా కళామండలి జిల్లా అధ్యక్షులు రమేష్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు టీ మాధవ్, చేయూత స్వచ్ఛంద సంస్థ ఎజాజ్ సోఫీ పాల్గొన్నారు.

# ఖచ్చితంగా ట్రాఫిక్ నియమాలు పాటించాలి

**వికారాబాద్: వుదయం ప్రతినిధి**
రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించడం ప్రతి వాహన దారుడి భాధ్యతని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివదర్ రెడ్డి,ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన "అరైవ్ అలైవ్" (Arrive Alive) కార్యక్రమంలో భాగంగా, వికారాబాద్ జిల్లా మోమిన్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏజేఆర్ గార్డెన్స్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, శిబిరాన్ని ప్రారంభించి, వాహనదారులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అని తెలిపారు. ముఖ్యంగా వాహనం నడిపే సమయంలో స్పష్టమైన కంటి చూపు ఉండటం అత్యంత అవసరమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. డీజీపీ మార్గదర్శకత్వంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమం మూడవ విడతలో భాగంగా జిల్లావ్యాప్తంగా పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యులు వాహనదారులకు కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపాలు ఉన్నవారిని గుర్తించారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, మోమిన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. వెంకట్ , ధరూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రఘు రాములు,ఎంపిఐ శ్రీ లక్ష్మి, మోమిన్ పేట్ సర్పంచ్ సంధ్య, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది మరియు వాహనదారులు, స్థానిక ప్రజలు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# చేతి సంచితో ప్లాస్టిక్ నివారణపై ఇంటింటి ప్రచారం



**చెట్లను నాటుదాం – పర్యావరణాన్ని కాపాడుదాం**
**వార్డు కౌన్సిలర్ బైరబోయిన శ్రీదేవి శ్రీనివాస్**

**సూర్యాపేట మార్చి 29(వుదయం):** జిల్లా కేంద్రంలోని 17వ వార్డు చింతల చెరువు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో "మొక్కలు నాటుదాం - ప్లాస్టిక్ నివారిద్దాం - పర్యావరణాన్ని కాపాడుదాం" అనే అంశంపై చేతి సంచితో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధి ప్రజలకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, మొక్కల పెంపకం ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ ఇంటింటికి స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా గ్రీన్ క్లబ్ ట్రస్ట్ అధ్యక్షుడు మున్నా నరేందర్, వార్డు కౌన్సిలర్ బైరబోయిన శ్రీదేవి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వాడకం తగ్గించి చేతి సంచులను ఉపయోగించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తోట కిరణ్, అలేఖ్య, బొలిశెట్టి మధు, మిర్యాల వెంకటేశ్వర్లు, సోమ హేమమాలిని, మిట్టపల్లి సువర్ణ లక్ష్మి, యమా రజిని, తల్లాడ రామచంద్రయ్య, సోమ సురేష్, దేవరశెట్టి నాగరాజు, మంచాల శ్యామ్, అరుణ, సురేందర్, గుండా కిరణ్, వెంకట్, సంపత్, సతీష్ బాబు, మామిడి శంకర్, బైరబోయిన సైదులు, పవన్, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



**కోదాడ: మార్చి 29(వుదయం):** తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం కోదాడ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు నాగబండి రామమూర్తి నగర్ నుండి ఖమ్మం క్రాస్ రోడ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాజీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లినేని సైదేశ్వరరావు మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం పార్టీని స్థాపించి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని అన్నారు. తెలుగుదేశం పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణలో తిరిగి పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఓరుగంటి ప్రభాకర్, మాజీ రాష్ట్ర కార్యదర్శి బయ్యా సూర్యనారాయణ, కొల్లు నరసయ్య, గుళ్ళపల్లి సురేష్, జనపనేని కృష్ణారావు, గురవయ్య, కట్ల సతీష్, కొల్లు సత్యనారాయణ, కోడి వాసు, చావల శ్రీను, నాగేశ్వరరావు, కోటిరెడ్డి, శోభన్, సర్పంచులు చల్లా గురవయ్య, ఉమా పిచ్చయ్య, వేమూరి సతీష్, ఏటుకూరి సురేష్, నరేష్ రెడ్డి, రేవంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకలు

**- గుల్లపల్లి వెంకటేష్ గౌడ్**
**- ఏప్రిల్ 2న విప్లవ వీరుడికి నివాళులు**
**మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుల పిలుపు**



**యాదాద్రి భువనగిరి / మార్చి (వుదయం జిల్లా ప్రతినిధి):** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని ఏప్రిల్ 2వ తేదీన జిల్లావ్యాప్తంగా ఊరూరా, వాడవాడలా ఘనంగా నిర్వహించాలని గౌడ జనహక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) జిల్లా అధ్యక్షులు గుల్లపల్లి వెంకటేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ వీరోచిత చరిత్రను, ఆయన చేసిన పోరాటాలను నేటి తరానికి చాటిచెప్పాలని కోరారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ...మొఘల్ సామ్రాజ్య క్రూర పాలనకు, జమీందార్ల దౌర్జన్యాలకు ఎదురొడ్డి నిలిచిన మహోన్నతుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు. 1650లో ఖిలాషాపూర్ గ్రామంలో సామాన్య గౌడ కుటుంబంలో జన్మించిన ఆయన, అణగారిన వర్గాలను ఏకం చేసి మొఘల్ సైన్యాన్ని గడగడలాడించారని గుర్తు చేశారు. దళితులు, వెనుకబడిన వర్గాలతో సైన్యాన్ని ఏర్పాటు చేసి, గెరిల్లా యుద్ధం ద్వారా మొఘలులకు ప్రధాన శత్రువుగా మారారు. ఖిలాషాపూర్, తాడికొండ, భువనగిరి వంటి కోటలు నిర్మించి సార్వభౌమాధికారాన్ని చాటారు. 1708లో వరంగల్ కోటను ఆక్రమించి విజయ పతాకం ఎగురవేశారు. ఆయన ధ్యేయం సాన్ని అద్దుకుంటూ, మహిళల గౌరవాన్ని కాపాడుతూ 'అపర శివాజీ'గా, 'హిందూ ధర్మ పరిరక్షకుడు'గా ప్రజల హృదయాల్లో నిలిచారు. తెలంగాణ ప్రభుత్వం పాపన్న గౌడ్ వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో, ఏప్రిల్ 2న ప్రతి గ్రామంలో గౌడ కుల బాంధవులు, బహుజనులు ఐక్యంగా పాల్గొని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని వెంకటేష్ గౌడ్ కోరారు. ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన బాటలో నడవడమే పాపన్న గౌడ్ కు మనం ఇచ్చే నిజమైన గౌరవమని ఆయన అన్నారు.

# రైతు బిడ్డ బోసెల్లి నవీన్‌కు ఓయూ డాక్టరేట్



**హైదరాబాద్, మార్చి 29 (వుదయం ప్రతినిధి):** రైతు బిడ్డ, పెద్దపల్లి జిల్లా పాల్తెం గ్రామానికి చెందిన బోసెల్లి నవీన్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం (OU) డాక్టరేట్ ప్రదానం చేసింది. ఓయూలోని బిజినెస్ మేనేజ్మెంట్ విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. నాగేశ్వర్ రావు పర్యవేక్షణలో నవీన్ తన పరిశోధనను పూర్తి చేశారు. "హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు నిధులు సమకూర్చడంలో నాన్‌బ్యాంకింగ్ ఆర్థిక సంస్థల పాత్ర" అనే అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనా గ్రంథానికిగాను ఓయూ అధికారులు ఈ డాక్టరేట్‌ను ప్రకటించారు. పూర్తిస్థాయి పరిశోధన (ఫుల్‌టైమ్ పీహెచ్‌డీ) కోసం నవీన్ 2018లో తనకు వచ్చిన ఎస్ఆర్డీఎస్ (SRDS) అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగాన్ని సైతం వదులుకోవడం గమనార్హం. డాక్టరేట్ సాధించిన సందర్భంగా ప్రొఫెసర్లు, గ్రామస్తులు, మిత్రులు ఆయనను అభినందించారు. తన పరిశోధనకు సహకరించిన గైడ్ డాక్టర్ నాగేశ్వర్ రావుకు, తన తల్లిదండ్రులకు నవీన్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం : డీజీఎం రమణా రెడ్డి




**కోదాడ మార్చి 29(వుదయం):** కోదాడ పట్టణంలోని స్థానిక నారాయణ హైస్కూల్‌లో కాన్వొకేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీజీఎం రమణా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని క్రమశిక్షణ, కష్టపడి చదవడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నారాయణ విద్యాసంస్థలు నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలను కూడా బోధిస్తున్నాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేసి అభినందించారు. పాఠశాల ఏజీఎం రమేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ హరిత మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, సమయపాలన అలవాటు చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు సభ, మహేశ్వరి, ఏఓ వీరారెడ్డి, డీన్ రమణయ్య, వైస్ ప్రిన్సిపల్ సలీమా, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ముగిసింది.

# అలరించిన చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన



**మధిర మార్చి,29, వుదయం ప్రతినిధి** :శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మధిర మున్సిపాలిటీ పరిధిలోని జిలుగుమాడు లో శ్రీ హనుమాన్ కోదండ రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరాముల వారి పట్టాభిషేకము,అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ సీతారాముల వారి కళ్యాణాన్ని వేద పండితులు అనంత ఆచార్యులు చేతుల మీదుగా అంగరంగ వైభవంగా నిర్వహించగా అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.పట్టాభిషేకం కార్యక్రమం సందర్భంగా కొఠారి శ్రీను బాబు సహకారంతో డాన్స్ మాస్టర్ నాగరాజు ఆధ్వర్యంలో కళాసాధన నృత్య కళానికేతన్ చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమం చూపరులను ప్రత్యేకంగా ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో చిన్నారులు వెంకటేశ్వర స్వామి, శ్రీరాముడు,శివపార్వతుల గెటప్పులతో వేసిన ప్రత్యేక నృత్యాలు భక్తులకు కట్టిపడేశాయి.అనంతరం నృత్య చిన్నారులకు జిలుగుమాడు సభ్యులు గ్రామ పెద్దలు కొటారి రాఘవ,శ్రీ హనుమాన్ కోదండరామ దేవాలయ కమిటీ వారు,మధిర ప్రెస్ క్లబ్ సభ్యుల చేతుల మీదుగా కళాకారులకు బహుమతులు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షులు పుతుంబాక కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# డెలివరీ బాయ్‌పై నరేందర్ రెడ్డి దౌర్జన్యం

**పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని**
**కార్మిక సంఘ డిమాండ్**




**చండూరు, మార్చి 29 (వుదయం):** చండూరు మండల కేంద్రంలో తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న నగేష్ గౌడ్‌పై బీజేవైఎం నాయకుడు పిన్నింటి నరేందర్ రెడ్డి దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు.పుల్లంల గ్రామానికి చెందిన నరేందర్ రెడ్డి ఇంటికి గ్యాస్ సిలిండర్ డెలివరీకి వెళ్లిన నగేష్ గౌడ్‌ను అదనపు సిలిండర్ ఇవ్వాలని డిమాండ్ చేశారని, యాజమాన్యంతో మాట్లాడి ఇస్తానని చెప్పినందుకు ఆగ్రహంతో అతనిపై విరుచుకుపడి అసభ్యంగా ప్రవర్తించినట్లు తెలిపారు. అనంతరం గ్యాస్ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి నగేష్‌ను ఉద్యోగం నుంచి తొలగించేలా చేశారని ఆరోపించారు.ఇదే తరహాలో గతంలో లింగయ్య అనే మరో డెలివరీ బాయ్‌ను కూడా వేధించి ఉద్యోగం కోల్పోయే పరిస్థితి తీసుకొచ్చారని గుర్తుచేశారు. కరోనా వంటి క్లిష్ట సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించిన డెలివరీ సిబ్బందిపై ఇలాంటి దౌర్జన్యాలు చేయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు.నరేందర్ రెడ్డిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, నగేష్ గౌడ్‌కు తిరిగి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ విషయంలో చర్యలు తీసుకోకపోతే జిల్లా బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, డీఎస్పీకి ఫిర్యాదు చేస్తామని కార్మిక సంఘ నాయకులు హెచ్చరించారు.

# పబ్లిక్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



**కోదాడ, మార్చి 29(వుదయం):** సామాజిక సేవా కార్యక్రమాల్లో కోదాడ పబ్లిక్ క్లబ్‌ను అగ్రస్థానంలో నిలుపుతామని క్లబ్ అధ్యక్షుడు కత్రం సీతారాం రెడ్డి, కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. ఆదివారం కోదాడ పబ్లిక్ క్లబ్‌లో నిర్వహించిన నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వారు పాలక వర్గ సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్లబ్ నియమ నిబంధనలు పాటిస్తూ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. క్లబ్ లక్ష్యాలైన వినోదం, వికాసం, విజ్ఞానం సాధనకు పాలక వర్గం కృషి చేస్తుందని తెలిపారు. నూతన పాలక వర్గానికి సీనియర్ సభ్యులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. అందరి సూచనలు, సలహాలు పాటిస్తూ గౌరవ సభ్యుల సహకారంతో కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ పదవులకు న్యాయం చేస్తామని తెలిపారు.1968లో స్థాపించబడిన కోదాడ పబ్లిక్ క్లబ్ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. తమ పాలక వర్గం ఎన్నికకు సహకారం అందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి, మాజీ మంత్రి వీరేపల్లి లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు వేనెపల్లి చందర్ రావు, బొల్లం మల్లయ్య యాదవ్, ఎన్నికల అధికారి ఎస్.ఆర్.కే. మూర్తి లకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా తోట రంగారావు, గుండపునేని వెంకట సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా వంగవీటి గురునాథం, కోటమర్తి విద్యాసాగర్ రావు, కార్యవర్గ సభ్యులుగా తమ్మన బోయిన రామయ్య, అమరనాయిని శేషగిరిరావు, సుంకర సత్యనారాయణ, మేకల ప్రతాప్, ముంద్రా రవికుమార్, ఇర్ల నాగమునీందర్ రెడ్డి, కుక్కడపు వెంకటేశ్వర్లు (బాబు) ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు మాజీ డిసిసిబి చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, మాజీ సర్పంచ్ పారా సీతయ్య, పైడిమరి సత్తిబాబు, రావెళ్ల సీతారామయ్య, భరత రెడ్డి, నాగార్జున, పట్టాభిరెడ్డి, చింతలపాటి శ్రీను, వెంకటేశ్వరరావు, గౌరవ సభ్యులు పాల్గొన్నారు.

# మునుగోడు ఎడారిగా మారే ప్రమాదం
# కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



**చండూరు, మార్చి 29 (వుదయం):** రానున్న కాలంలో మునుగోడు నియోజకవర్గం ఎడారిగా మారే ప్రమాదం ఉందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం చండూరులో పాల్గొని మాట్లాడారు. శ్రీశైలం నుంచి ఎదుల్ల వద్ద నీటి పంపకాలలో లక్ష్మాపురం, శివన్నగూడెం ప్రాజెక్టులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.
ఎదుల్ల వద్ద 436 అడుగుల వద్ద రెగ్యులేటర్ ఏర్పాటు చేస్తే మునుగోడుకు కొంత న్యాయం జరుగుతుందని, కానీ ప్రభుత్వం 440 మీటర్ల వద్ద రెగ్యులేటర్ ఏర్పాటు చేసి టన్నెల్ ద్వారా నీటిని పంపాలని జీవో జారీ చేయడం వల్ల నియోజకవర్గానికి నష్టం వాటిల్లుతుందని తెలిపారు. వేల కోట్ల రూపాయలతో నిర్మించిన డిండి, శివన్నగూడెం, లక్ష్మాపురం ప్రాజెక్టులకు నీళ్లు రాకపోతే అవి వృథా అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించి ప్రభుత్వంతో పోరాడాలని, సంబంధిత మంత్రులను కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. మునుగోడు ప్రజలకు అన్యాయం జరగకుండా అవసరమైతే పోరాటాలకు సిద్ధమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ బిఆర్ఎస్ కౌన్సిలర్లు తేలుకుంట్ల రాజకుమారి చంద్రశేఖర్ , కొన్రెడ్డి మధు ,సామ సుజాత యాదవ రెడ్డి , మాజీ MPP తోకల వెంకన్న ,మాజీ జడ్పీటీసీ అన్నెపర్తి శేఖర్, పట్టణ అధ్యక్షుడు కొత్తపాటి సతీష్, బొడ్డు సతీష్, మండల అధ్యక్షుడు వెంకన్న,దశరథ, సంతోష్ , పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య ఉత్సవ కమిటీ సభ్యునిగా డాక్టర్ కంకాల ఎలెందర్ ఎంపిక

**- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు**
**- మోటకొండూరు వాసుల హర్షం**



**యాదాద్రి భువనగిరి / మార్చి వుదయం జిల్లా ప్రతినిధి) :** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్మారక ఉత్సవాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య ఉత్సవ కమిటీ సభ్యునిగా యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రానికి చెందిన డాక్టర్ కంకాల ఎలెందర్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. డాక్టర్ కంకాల ఎలెందర్ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిగా తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు.

విద్యార్థి దశ నుండే సామాజిక సమస్యలపై పోరాడుతూ, తెలంగాణ ఆకాంక్షలను వినిపించడంలో ముందున్నారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం, అమరవీరుడు దొడ్డి కొమురయ్య గౌరవార్థం నిర్వహించే ఉత్సవాల కమిటీలో ఆయనకు చోటు కల్పించింది. తమ ప్రాంతానికి చెందిన వ్యక్తికి రాష్ట్ర స్థాయి కమిటీలో ప్రాతినిధ్యం లభించడం పట్ల మోటకొండూరు మండల వాసులు, ఉద్యమకారులు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎలెందర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# జమియత్-ఎ-హఫ్ఫాజ్ ఆధ్వర్యంలో ఈద్ మిలాప్





**కరీంనగర్ మార్చి 29 (వుదయం ప్రతినిధి):** నగరంలో ని ముకర్రంపురాలోని కరీంనగర్ ఫంక్షన్ హాల్‌లో జమియత్ఎహఫ్ఫాజ్ అధ్యక్షుడు ఖాజీ అహ్మద్ మంక్బత్ షా ఖాన్ అధ్యక్షతన ఒక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా ఫాదర్ క్రిస్టోఫర్ యం ఆర్ ఓ ఈ నరేంద్ర పాల్గొన్నారు. ఈ ఈద్ మిలాప్ కార్యక్రమంలో నగర ప్రముఖులతో పాటు దేశంలోని ముస్లిమేతర సోదర సోదరీమణులు కూడా పాల్గొన్నారు. దేశ సోదర సోదరీమణులు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. జమియత్ఎహఫ్ఫాజ్ చేపట్టిన సామాజిక సంక్షేమ సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు, వైద్యులు, ఇంజనీర్లు, మత పెద్దలు పాల్గొన్నారు. జమియత్ఎహఫ్ఫాజ్ అతిథులకు విందు భోజనం మరియు షేర్ఎఖోర్మాను అందించింది. ఈ కార్యక్రమంలో జమియత్ హఫాజ్ అధికారులు హఫీజ్ జియావుల్లాఖాన్, హఫీజ్ మోజామ్ హుస్సేన్, హఫీజ్ వసీముద్దీన్, హఫీజ్ రిజ్వాన్ ఫలాహి, హఫీజ్ సాదిఖ్ అలీ అహ్మద్, హఫీజ్ ముదస్సర్ ఉర్ రెహమాన్, హఫీజ్ ఫరీదుద్దీన్, వసీమ్ మహ్మద్, హఫీజ్ వసీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్య వైశ్యులు సమాజసేవకులు




**సూర్యాపేట మార్చి 29(వుదయం):** ఆర్యవైశ్యులు సమాజ సేవలో ముందుంటారని శ్రీ వాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కిరాణా ఫ్యాన్సీ భవన్‌లో శ్రీ వాసవి సేవా సమితి జిల్లా ప్రథమ సర్వసభ్య సమావేశం గౌరవ సలహాదారులు గోపారపు రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, వైద్య సేవలు, ఉచిత మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాలు, పేద వధువులకు సహాయం, చలివేంద్రాలు, ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పురస్కారాలు వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దేవర శెట్టి నాగరాజు, కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు మిరియాల సుధాకర్, మహంకాళి ప్రణీత్, సహాయ కార్యదర్శి కర్నాటి కృష్ణ, కోట శివ, వీరవెల్లి విజయ శంకర్, సభ్యులు పోలా లక్ష్మీనారాయణ, సోమా ధనుంజయ్, శ్రీరంగం రాము, వందనపు వెంకటేశ్వర్లు, బెలిదే అశోక్, బుక్క రమేష్, బుద్దా నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జీరో వేస్ట్ జీవనశైలితో పర్యావరణ పరిరక్షణ



**కోదాడ మార్చి 29(వుదయం):** జీరో వేస్ట్ జీవనశైలి ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని సామాజిక ఆర్థిక విశ్లేషకులు బడుగుల సైదులు తెలిపారు. మార్చి 30 "ఇంటర్నేషనల్ జీరో వేస్ట్ డే" సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ వ్యర్థాల కాలుష్యంతో మానవ ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆహార వ్యర్థాలు, ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయని తెలిపారు. అవసరానికి తగ్గట్టుగా వినియోగం, పునర్వినియోగం, రీసైక్లింగ్, కంపోస్టింగ్ ద్వారా "జీరో వేస్ట్ – వేస్ట్ టు వెల్త్" సాధ్యమవుతుందని చెప్పారు. మెరుగైన రేపటి కోసం ఈ రోజే వ్యర్థాలను తగ్గించే జీవనశైలిని అలవాటు చేసుకోవాలని ఆయన సూచించారు

# అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ



**- అధ్యక్షులుగా ఉపసర్పంచ్ మంచాల వెంకన్న**

**యాదాద్రి భువనగిరి / మార్చి వుదయం** జిల్లా ప్రతినిధి : మోటకొండూరు మండలంలోని ముత్తిరెడ్డి గూడెం గ్రామంలో డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ నిర్మాణం కోసం గ్రామ పెద్దలు, యువత ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి అధ్యక్షులుగా ఉప సర్పంచ్ మంచాల వెంకన్నను ఎన్నుకోగా, ఉపాధ్యక్షులుగా దేవరాజు పోచయ్య, గంధమల్ల పాండు, కడమంచి బాలనర్సింహ్మలను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా పన్నీరు భరత్, మంచాల మత్స్యగిరి వ్యవహరించనున్నారు. కార్యదర్శులుగా ఆడెపు మహేందర్, ఆడెపు నరేష్, దేవరాజు మహేందర్ బాధ్యతలు చేపట్టగా, కోశాధికారిగా మంచాల సత్యనారాయణ నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా గంధమల్ల ఉప్పలయ్య, ఆడెపు ఉపేందర్, మంచాల సుదర్శన్, దేవరాజు సిద్ధిరాములు, ఆడెపు శ్రీకాంత్, ఆడెపు స్వామి, చిట్టిగల్ల మహేందర్, కళ్లెం సుధాకర్, మంచాల సన్నీ కుమార్ తదితరులు ఉన్నారు. గౌరవ సలహాదారులుగా ఆడెపు శ్రీనివాస్, గుజ్జుక మల్లేష్, గంధమల్ల నర్సింహ్మ, ఆడెపు సోములు, గుర్రాల నాగరాజు ముదిరాజ్ నియమించబడ్డారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలో త్వరలోనే అంబేద్కర్ ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఆయన ఆశయాలను గ్రామ ప్రజల్లో విస్తరింపజేయడానికి కృషి చేస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం



**దమ్మపేట మార్చి 29 (వుదయం ప్రతినిధి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం దమ్మపేట గ్రామంలో టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది
ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీనియర్ టిడిపి నాయకులు గడ్డిపాటి సత్యం మాట్లాడుతూ తెలుగు ప్రజలు ఉన్నంత కాలం వారి గుండెల్లో ఎన్టి రామారావు చిరస్థాయిగా నిలుస్తారని పేద ప్రజలకు ఎన్నో ఉచిత పథకాలు అందించి ప్రజల గుండెల్లో ఆయన ఎప్పటికీ విడిచి పోతారు అని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో జెండా ఎగురవేసి కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంచుకొని సంబరాలు నిర్వహించారు

ఈ కార్యక్రమంలో బొల్లా మోహన్, కొండపల్లి కృష్ణమూర్తి, నాయుడు బాబురావు, పారుపల్లి భద్రం, చావ్వా వెంకట్, భోగి సత్యం, ఫ్యాక్టరీ శ్రీనివాసరావు, ఊకె కుమారి, తదితరులు పాల్గొన్నారు

# ఆరోగ్యానికి వ్యాయామం అత్యవసరం: సీఐ మధు.

**మధిర మార్చి,29, వుదయం ప్రతినిధి:**



ఆరోగ్యానికి వ్యాయామం అత్యంత ఆవశ్యకమని మధిర రూరల్ సీఐ డి మధు అన్నారు. పట్టణంలోని ఈ మాల్ బిల్డింగ్ లో నూతనంగా మేడికొండ పృథ్వి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పృధ్విజిమ్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు వివిధ పోటీ పరీక్షల్లో దేహ దారుఢ్యతకు శారీరక సౌష్ట్యానికి వ్యాయామం ప్రధాన పాత్ర పోషిస్తుంది అన్నారు.మధిర పట్టణంలో యువత ఆధ్వర్యంలో జిమ్ సెంటర్ ను ఏర్పాటు చేయడం ద్వారా పట్టణంలోని మా పరిసర ప్రాంతాలలోని యువతకు ఫిజికల్ ఫిట్నెస్ కు ఉపయోగపడుతుందన్నారు. అత్యంత ఆధునిక పరికరాలతో పూర్తిస్థాయి ప్రత్యేకమైన శిక్షణ నైపుణ్యం కలిగిన ఇన్స్ట్రక్టర్లతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్ని అంశాలలో దశలవారీగా వయసుల వారీగా జిమ్ ఉపకారణాల తో శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తామని జిమ్ నిర్వాహకులు పృథ్వి మేడికొండ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ నక్క వెంకట్ తెలంగాణ పవర్ లిఫ్టింగ్ వైస్ ప్రెసిడెంట్ వి మల్లేష్ తోపాటు పలువురు పట్టణ ప్రముఖులు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

# ఆ సమస్యలకు అద్భుతమైన ఔషధం



ఆధునిక జీవనశైలి సమస్యలకు ఎండు ద్రాక్ష (కిస్‌మిస్) నీరు ఒక సహజ పరిష్కారం. ప్రతిరోజూ ఎండు ద్రాక్షలను నానబెట్టి ఆ నీటిని సేవించడం ద్వారా అధిక బరువు, రక్తపోటు, డయాబెటిస్ నియంత్రంచబడతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఐరన్ లోపం, రక్తహీనత, జీర్ణ, లైంగిక సమస్యలు దూరం అవుతాయి. ఇది శరీరాన్ని డిటాక్స్‌ఫై చేసి 10 రోజుల్లోనే మంచి ఫలితాలను అందిస్తుంది. ఎండుద్రాక్ష (కిస్‌మిస్) లో శరీరానికి మేలు చేసే ఎన్నో పోషకాలు దాగున్నాయి. రుచికరంగా ఉండే కిస్‌మిస్‌ను తీపి పదార్థాలలో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఎండు ద్రాక్షలో ప్రొటీన్లు, ఐరన్, విటమిన్లు, ఫైబర్, ఇతర పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. అయితే.. రాత్రంతా నీళ్లలో నానబెట్టిన ఎండు ద్రాక్ష నీరు పరగడుపున తాగడం వల్ల ఎన్నో సమస్యలు దూరం అవుతాయని.. లైంగిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. కిస్ మిస్ నీటితో జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు మలబద్ధకం తగ్గుతుంది. ఇది కాలేయాన్ని శుభ్రపరిచి, రక్తాన్ని పెంచి, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. యాంటీఆక్సిడెంట్లతో కూడిన ఈ నీరు చర్మ ఆరోగ్యానికి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఆధునిక జీవనశైలి కారణంగా ఎదురయ్యే అనేక ఆరోగ్య సమస్యలకు ఎండు ద్రాక్ష నీరు ఒక సహజసిద్ధమైన, సమర్థవంతమైన పరిష్కారం. ఈ పానీయాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా కేవలం 10 రోజుల్లోనే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఈ డ్రింక్ ప్రధానంగా అధిక బరువు సమస్యకు చెక్ పెడుతుంది. దీనిలోని లెప్టిన్, గ్రిలిన్ వంటి సమ్మేళనాలు ఆకలిని తగ్గించి, అతిగా ఆహారం తీసుకోవడాన్ని నియంత్రిస్తాయి. తద్వారా సహజంగా బరువు తగ్గడానికి సహాయపడతాయి. ఇది రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది.. డయాబెటిస్ స్థాయిలను అదుపులో పెడుతుంది. శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్‌ను తొలగించడంలో కూడా ఎండు ద్రాక్ష నీరు కీలక పాత్ర పోషిస్తుంది. ఎండు ద్రాక్షలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీర కణాలకు హాని కలిగించే పదార్థాల నుంచి రక్షణను అందిస్తాయి. ఫెరులిక్ యాసిడ్, రూటిన్, క్వెర్సెటిన్, ట్రాన్స్ కంప్టరిక్ యాసిడ్ వంటి సమ్మేళనాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఎండు ద్రాక్షలో సహజసిద్ధమైన చక్కెర తక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. భోజనం తర్వాత ఎండు ద్రాక్ష తీసుకోవడం వల్ల ఇన్సులిన్ నియంత్రణలో ఉంటుంది. గ్లైసెమిక్ ఇండెక్స్ బ్యాలెన్స్ కూడా నిర్వహించబడుతుంది. ఎండు ద్రాక్ష నీరు ఒక సహజసిద్ధమైన డిటాక్సిఫైర్‌గా పనిచేస్తుంది. ఇది శరీరాన్ని లోపలి నుండి శుభ్రపరిచి, మలినాలను తొలగిస్తుంది. జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. కడుపులో యాసిడ్ సమస్యలు ఉన్నవారు ఈ నీటిని తాగడం వల్ల తక్షణ ఉపశమనం పొందుతారు.కిస్‌మిస్ నీటిని తాగడం వల్ల లైంగిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.. ఎండుద్రాక్ష, తేనే కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. పురుషులలో స్టామినా పెరగడంతోపాటు స్పెర్మ్ కౌంట్, నాణ్యతను పెంచడంలో సహాయపడుతుందని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు. ఈ ఆరోగ్యకరమైన డ్రింక్‌ను తయారు చేయడానికి 10 ఎండు ద్రాక్షలను శుభ్రంగా కడిగి ఐదు గంటల పాటు నీటిలో నానబెట్టాలి. నానబెట్టిన తర్వాత, ద్రాక్షలను బాగా పిసికి, ఆ నీటిని వడగట్టాలి. ఈ నీటిని ఉదయం పూట తీసుకోవడం మంచిది. నీటితోపాటు ఆ కిస్‌మిస్ లను కూడా తీసుకోవచ్చు.. ఇందులో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఒక టీస్పూన్ నిమ్మరసం కలిపి తాగడం వల్ల శరీరం ఐరన్‌ను మెరుగ్గా గ్రహిస్తుంది.

# నోటి పరిశుభ్రత కోసం మౌత్‌వాష్



'నోటి పరిశుభ్రత కోసం మౌత్ వాష్ వాడండి' అని చాలామంది చెబుతుంటారు. కానీ రోజూ వాడితే మాత్రం దానివల్ల శరీరానికి నష్టం కలుగుతుందని ఎవరైనా చెప్పారా? ఎందుకంటే.. నోరు కేవలం పరిశుభ్రతకు సంబంధించినది మాత్రమే కాదు. అది హృదయ నాళ వ్యవస్థలో భాగం. కాబట్టి మౌత్ వాష్ (నోటి ద్వారా పుకిలించే లిక్విడ్) ఉపయోగించే ముందు దానివల్ల లాభమా? నష్టమా అనేది తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఇటీవల పరిశోధనలు సైతం ఇదే హెచ్చరిస్తు?న్నాయి. ఆ వివరాలేమిటో చూద్దామా! ఓరల్ హైజీన్ అనేది మొత్తం ఆరోగ్యంతో ముడిపడి ఉంటుంది. అలాగనీ ప్రతీ రోజు లేదా ఎక్కువగా మౌత్ వాష్ వాడితే మాత్రం నష్టోయే అవకాశం ఉంటుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఎందుకంటే కొన్ని రకాల యాంటీ బ్యాక్టీరియల్ మౌత్ వాష్‌లు వాడినప్పుడు, అవి నోటిలోని ఆరోగ్యానికి మేలు బ్యాక్టీరియాలను కిల్ చేస్తాయని చెబుతున్నారు. నోరు కేవలం దంతాలు, చిగుళ్లు మాత్రమే పరిమితం కాదు, శరీరంలోని కార్డివాస్క్యులర్ వ్యవస్థలో భాగం. నోటిలోని కొన్ని మంచి బ్యాక్టీరియాలు ఆహారంలోని నైట్రేట్‌ను 'నైట్'గా మార్చి, దాని నుంచి నైట్రిక్ ఆక్సైడ్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఇది రక్తనాళాలను విస్తరింపజేసి, రక్త ప్రవాహాన్ని అధిక రక్తపోటును నియంత్రిస్తాయి. అయితే యాంటీ బ్యాక్టీరియల్ మౌత్ వాష్, ముఖ్యంగా క్లోర్హెక్సిడిన్ లేదా అదర్ స్ట్రాంగ్ ఫార్ములాస్ ఉపయోగించినప్పుడు ఈ బ్యాక్టీరియాలను అది చంపేస్తుంది. దీంతో నోటిలో నైట్ ఉత్పత్తి తగ్గి, రక్తంలో నైట్రిక్ ఆక్సైడ్ లెవెల్స్ పడిపోతాయి. ఫలితంగా రక్తపోటు పెరగడం, రక్త నాళాల సౌలభ్యం తగ్గండి వంటి సమస్యలు తలెత్తుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అందుకే డాక్టర్ల సలహా లేకుండా మౌత్ వాష్‌లు తరచుగా వాడకూడదని సూచిస్తున్నారు. యాంటీ సెప్టిక్ మౌత్‌వాష్ ఉపయోగించిన వారిలో సిస్టాలిక్ బ్లడ్ ప్రెజర్ 2-5 ఎఎఊణ పెరిగినట్లు అనేక చిన్న చిన్న క్లినికల్ ట్రయల్స్‌లో వెల్లడైనట్లు నిపుణులు చెబుతున్నారు. మూండేండ్లపాటు జరిగిన ఒక ముఖ్యమైన అధ్యయనం కూడా రోజుకు రెండుసార్లు లేదా అంతకంటే ఎక్కువసార్లు మౌత్‌వాష్ ఉపయోగించేవారిలో హైపర్‌టెన్షన్ రిస్క్ రెట్టింపు అయినట్లు తేలింది. మరికొన్ని అధ్యయనాలు డయాబెటిస్ ప్రమాదం కూడా పెరగవచ్చని సూచిస్తున్నాయి. అయితే ఇవన్నీ ప్రధానంగా యాంటీ బ్యాక్టీరియల్ మౌత్‌వాష్‌ల వల్ల జరిగే నష్టాలు మాత్రమే. సాధారణ ఫ్లోరైడ్ మౌత్‌వాష్‌లవల్ల ఇంత ఎక్కువగా ప్రభావం ఉండకపోవచ్చు.

# క్యాన్సర్ రోగికి ఇమ్యునోథెరపీ దివ్యౌషధం

ఈనాటికీ, క్యాన్సర్ అనే మాట వినగానే జనం భయానికి గురవుతారు. చికిత్స, కోలుకోవడం రెండింటిపైనా ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవలి సంవత్సరాలలో, క్యాన్సర్ చికిత్స కోసం ఇమ్యునోథెరపీని ఉపయోగిస్తున్నారు. దీని ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయంటున్నారు వైద్యులు. ఈ విధానంలో క్యాన్సర్ కణాలతో పోరాడటానికి శరీరం రోగనిరోధక వ్యవస్థను సిద్ధం చేస్తారు. రోగనిరోధక వ్యవస్థ క్యాన్సర్ కణాలను గుర్తించి నాశనం చేస్తుంది. ఈ చికిత్స అనేది శరీరం రోగనిరోధక వ్యవస్థను ఉపయోగించి క్యాన్సర్‌తో పోరాడే ఒక పద్ధతి. రోగనిరోధక వ్యవస్థ మనల్ని రక్షించడానికి పనిచేస్తుంది. కానీ క్యాన్సర్ కణాలు తరచుగా ఈ వ్యవస్థ నుండి తప్పించుకుని క్రమంగా వ్యాపించడం ప్రారంభిస్తాయి. ఇక్కడే ఇమ్యునోథెరపీ పాత్ర మొదలవుతుంది. న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌కు చెందిన మెడికల్ ఆంకాలజీ విభాగం ఎండి డాక్టర్ అరవింద్ కుమార్, ఇమ్యునోథెరపీ అనేది క్యాన్సర్ కణాలను గుర్తిస్తుంది. వాటిని నాశనం చేయడానికి శరీరం రోగనిరోధక కణాలకు శిక్షణ ఇస్తుందని వివరిస్తున్నారు.



గతంలో కీమోథెరపీ, రేడియేషన్ అనేవి క్యాన్సర్ చికిత్సకు ప్రధాన పద్ధతులుగా ఉండేవి. ఈ పద్ధతులు నేటికీ ముఖ్యమైనవే, కానీ వాటికి అనేక దుష్ప్రభావాలు కూడా ఉన్నాయి. ఇవి రోగులకు చాలా ఇబ్బందికరంగా ఉంటాయంటున్నారు డాక్టర్ అరవింద్. సాధారణ కీమోథెరపీ క్యాన్సర్ కణాలపై మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన కణాలపై కూడా దాడి చేస్తుంది., దీనివల్ల జుట్టు రాలడం, అలసట, నీరసం వంటి అనేక దుష్ప్రభావాలు కలుగుతాయి. అయితే, ఇమ్యునోథెరపీ కేవలం క్యాన్సర్ కణాలపై మాత్రమే దాడి చేస్తుంది. దీనికి తీవ్రమైన దుష్ప్రభావాలు ఉండవు. గతంలో చికిత్స చేయడం కష్టంగా ఉన్న ఊపిరితిత్తుల క్యాన్సర్, మూత్రపిండాల క్యాన్సర్, మెలనోమా వంటి కేసులలో ఇమ్యునోథెరపీ చాలా ప్రయోజనకరంగా నిరూపించబడిందంటున్నారు వైద్య నిపుణులు. ఈ చికిత్స ప్రతి క్యాన్సర్ రోగికి సమానంగా ప్రభావవంతంగా ఉండదని డాక్టర్ అరవింద్ వివరిస్తున్నారు. కొంతమంది రోగులు అత్యంత సానుకూల ఫలితాలను పొందుతుండగా, మరికొందరు పరిమిత ప్రభావాన్ని మాత్రమే అనుభవించవచ్చు. అందువల్ల, వైద్యులు రోగి పరిస్థితి, క్యాన్సర్ రకం, దశ ఆధారంగా తగిన నిర్ణయాలు తీసుకుంటారు. ఇమ్యునోథెరపీ కేవలం ఒక చికిత్స మాత్రమే కాదు, ఇది భవిష్యత్ అవకాశాలను కూడా సూచిస్తుంది. పరిశోధన కొనసాగుతోంది. శాస్త్రవేత్తలు కొత్త మందులు, పద్ధతులను అభివృద్ధి చేస్తున్నారు.

# మిల్లెట్స్‌తో ఇలా పలావ్ చేసి తింటే..

## ఆరోగ్యం డబుల్, రుచి ట్రిపుల్

మిల్లెట్స్‌తో కూడా పలావ్ చేసి తింటారు. దీని గురించి చాలా మందికి తెలియకపోవచ్చు. ఇది రుచికి మాత్రమే కాకుండా ఆరోగ్యానికి కూడా మంచిది. ఈ రెసిపీని సరైన కొలతలతో చేసి తింటే రుచి అదిరిపోద్ది. ఈ రెసిపీని ఎక్కువగా కొర్రలతో చేసి తింటారు. దీనిలో ఫైబర్, ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. దీనిలో మిల్లెట్స్, కూరగాయలు వేస్తారు. ఉదయం పూట బ్రేక్ ఫాస్ట్ కు ఇది పర్ఫెక్ట్. తక్కువ నీరుతో చేస్తే టేస్ట్ నెక్సట్ లెవెల్ అని చెప్పుకోవాలి.కావాల్సిన పదార్థాలు : మిల్లెట్స్, నాలుగు బిర్యానీ ఆకు, 5 లవంగం, 4 యాలకులు, ఉల్లిపాయలు ముక్కలు , కట్ చేసిన పచ్చిమిర్చి, ఒక టేబుల్ స్పూన్ అల్లం-వెల్లుల్లి , క్యారెట్, ఉప్పు, కారం, నూనెను తీసుకోవాలి. మిల్లెట్ పులావ్ ను ఎలా తయారు చేయాలంటే? ముందుగా ఒక కప్పు మిల్లెట్స్‌ను తీసుకుని వాటిని ఒకటికి రెండు సార్లు కడిగి ఒక గంట పాటు నానబెట్టి పక్కన పెట్టుకోవాలి. ఇక ఇప్పుడు స్టవ్ వెలిగించి కుక్కర్‌లో కొద్దిగా నూనె వేసి అది వేడయ్యాక దాచిన చెక్క, లవంగం, నాలుగు యాలకులు, మసాలాలు కూడా వేసి బాగా వేయించాలి. కొద్దీ సేపటి తర్వాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, ఒక టేబుల్ స్పూన్ అల్లం-వెల్లుల్లి పేస్ట్ వేసి బాగా వేయించాలి. ఇప్పుడు నానబెట్టిన మిల్లెట్స్ ను కుక్కర్లో వేసి రెండు గ్లాస్ ల నీళ్లు పోసి రుచికి సరిపడా ఉప్పు కూడా వేసి టేస్ట్ చూసి మూత పెట్టాలి డియం మంటపై ఉంచి 5 విజిల్స్ వచ్చే దాకా మెత్తగా ఉడికించాలి. చివర్లో కొత్తిర వేసి కిందకు దించేయడమే.



# ఎండుమిర్చి ఎలా నిల్వ చేస్తున్నారు...



వేసవి వచ్చిందంటే చాలు... చాలామంది మహిళలు కూరలు, పచ్చళ్లకు కావలసిన కారాన్నీ, తాలింపుల కోసం మిరపకాయల్నీ నిల్వ చేస్తుంటారు. వీటిని సరిగా భద్రపరచకపోతే రంగుతో పాటు రుచీ, వాసననూ కోల్పోతాయి. అలా కాకూడదంటే... కొన్న మిరపకాయల్లో ముందుగా రంగు మారిన, పాడయిన వాటిని ఏరి పక్కనపెట్టుకోవాలి. వంట చేసేటప్పుడు తడి చేతులతో మిరపకాయలను తీయకూడదు. నిల్వ చేసే డబ్బాలను నేరుగా ఎండ తగిలే చోట కాకుండా, చల్లని, చీకటి ప్రదేశంలో ఉంచాలి. మిరపకాయలు మెత్తబడితే, వాటిని కాసేపు పెనంపై వేడి చేసి ఆరనిస్తే మళ్లీ కరకరలాడతాయి. నిల్వ చేయడానికి ముందే కనీసం 2-3 రోజులపాటు మిరపకాయల్ని ఎండలో ఆరనివ్వాలి. అవి గలగలలాడుతున్నప్పుడు తొడిమలు తీసి నిల్వ చేసుకోవాలి. లేదంటే తేమకి బూజు పట్టే అవకాశం ఉంది. తొడిమల్ని ఉంచితే... పురుగు పట్టొచ్చు. ఎండిన మిరపకాయలను ప్లాస్టిక్ కవర్లలో కాకుండా, గాలి చొరని గాజు సీసాల్లో, స్టీల్ డబ్బాల్లో నిల్వ చేయాలి. డబ్బా అడుగున చిన్న ఇంగువ ముక్కను ఉంచినా లేదా కొన్ని ఎండిన వేప ఆకులు లేదా కొద్దిగా పసుపు కలిపినా పురుగు చేరదు. రంగూ మారవు. కూరల కోసం ఒట్టి మిరపకాయల్ని మాత్రమే కారం పట్టించొద్దు. బదులుగా కాసిని దనియాలు, మెంతులు, జీలకర్ర, వెల్లుల్లి... వంటి వాటిని నూనె లేకుండా దోరగా వేయించుకుని ఈ మిరపకాయల్లో కలిపితే రుచి బాగుంటుంది. దీన్ని జిప్‌లాక్ కవర్లలో పెట్టి ఫ్రిజ్‌లో పెడితే రంగూ, రుచితో పాటు సువాసనా పోదు. పచ్చళ్లలో వాడే కారానికి... కాస్త ఘాటుగా ఉండే గుంటూరు మిర్చి 70శాతం, రంగు కోసం 30 శాతం బ్యాడగి మిర్చి లేదా కశ్మీరీ చిల్లీని ఎంచుకోవాలి. మిర్చిలోని తేమను తొలగించి సువాసనను పెంచడానికి తక్కువ మంట మీద కొద్ది సమయం తేలిగ్గా వేయించి ఆపై కారం కోసం దంచితే మేలు.

# కొబ్బరినీళ్లు, ఉసిరి రసం..

## శరీరానికి ఎక్కువ చల్లదనాన్ని ఇస్తుంది

వేసవి కాలం వచ్చిందంటే చాలు.. భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుంటాడు. మాడు పగిలే ఎండల వల్ల శరీరం త్వరగా వేడెక్కి, నీరసం మరియు డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ ఉష్ణోగ్రతల నుండి ఉపశమనం పొందడానికి మనం రకరకాల పానీయాలను ఆశ్రయిస్తుంటాం. ముఖ్యంగా కొబ్బరినీళ్లు, ఉసిరి రసం శరీరానికి చల్లదనాన్ని ఇస్తాయని మనకు తెలుసు. అయితే, ఈ రెండింటిలో ఏది ఉత్తమం? ఏది వేగంగా ఫలితాన్ని ఇస్తుంది? ఆయుర్వేదం ప్రకారం, కొబ్బరినీళ్లు మరియు ఉసిరి రసం రెండూ కూడా శరీర ఉష్ణోగ్రతను తగ్గించే గుణాలను కలిగి ఉన్నాయి. కానీ, వీటి పనితీరులో కొంత వ్యత్యాసం ఉంటుంది. ఎండలో తిరిగి వచ్చినప్పుడు మన శరీరానికి తక్షణమే హైడ్రేషన్ అవసరం. ఎండ నుండి వచ్చి వెంటనే చల్లదనాన్ని కోరుకుంటే కొబ్బరినీళ్లే ఉత్తమం. ఎందుకంటే ఇవి శరీరంలోని నీటి శాతాన్ని వేగంగా భర్తీ చేస్తాయి. అదే ఉసిరి రసం అయితే శరీర అంతర్గత ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి కొంత సమయం తీసుకుంటుంది. కొబ్బరినీళ్లలో 95.5 శాతం నీరు ఉంటుంది. ఇందులో పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం, విటమిన్ బి కాంప్లెక్స్ మరియు సి వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఎండలో ఎక్కువసేపు తిరిగిన తర్వాత కొబ్బరినీళ్లు తాగితే, శరీర ఉష్ణోగ్రత వెంటనే తగ్గుతుంది. ఇందులో ఉండే పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్స్ శరీరానికి కావాల్సిన హైడ్రేషన్‌ను తక్షణమే అందిస్తాయి. అందుకే డీహైడ్రేషన్ బారిన పడిన వారికి ఇది మొదటి ఎంపిక. ఉసిరిలో విటమిన్ సి అపారంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. ఉసిరి రసం తాగిన వెంటనే శరీరం చల్లబడదు. ఇది క్రమంగా శరీర వేడిని నియంత్రిస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఉసిరి రసం తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా దీర్ఘకాలికంగా శరీరం వేడెక్కకుండా ఉంటుంది. నిద్రలేవగానే ఖాళీ కడుపుతో ఉసిరి రసం తాగడం వల్ల రోజంతా శరీరం తేజస్సుతో ఉంటుంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు కొబ్బరినీళ్లు తాగడం వల్ల శరీరం డీహైడ్రేషన్ కు గురికాకుండా ఉంటుంది. ఏ పానీయం అయినా మితంగా తీసుకోవడం ఆరోగ్యకరం. ముఖ్యంగా కిడ్నీ సమస్యలు లేదా ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారు వీటిని రోజూ తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. ఈ వేసవిలో ప్రకృతి ప్రసాదించిన ఈ సహజ పానీయాలతో ఆరోగ్యాన్ని కాపాడుకోండి.



# వాకింగ్ చేయకుండానే బరువు తగ్గాలా!

డైటింగ్, వాకింగ్ అవసరం లేకుండానే బరువు తగ్గాలనుకునే వారికి సామల గంజి చక్కటి పరిష్కారం. ప్రోటీన్లతో నిండిన ఈ చిరుధాన్యం, రాత్రిపూట తీసుకోవడం ద్వారా ఆకలిని నియంత్రించి, కేవలం పది రోజుల్లోనే బరువు తగ్గడంలో సహాయపడుతుంది. సామలను నానబెట్టి, ఉప్పు, జీలకర్ర, కొత్తిర, మిరియాల పొడితో వండుకుని రుచికరంగా తీసుకోవచ్చు. బరువు తగ్గాలనుకునే చాలామందికి డైటింగ్ నియమాలు, శారీరక శ్రమ లేకుండానే ఫలితాలు సాధించాలనే కోరిక ఉంటుంది. అలాంటి వారి కోసం సామల గంజి ఒక సమర్థవంతమైన, సులభమైన పరిష్కారంగా నిలుస్తుంది. ఇది కేవలం బరువు తగ్గడానికి మాత్రమే కాకుండా, శరీరానికి అవసరమైన ప్రోటీన్లను అందించడానికి కూడా దోహదపడుతుంది. సామలు, చిరుధాన్యాల కోవకు చెందినవి, బరువు తగ్గడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ చిరుధాన్యాన్ని వ్యక్తిగతంగా 45 రోజులు తీసుకోవడం ద్వారా గణనీయమైన బరువు తగ్గిన అనుభవం ఉందని నిపుణులు చెబుతున్నారు. సామల గంజి తయారీ, వినియోగ పద్ధతి ఇక్కడ తెలుసుకోండి. నానబెట్టడం: ఒక పెద్ద గ్లాసు సామలను శుభ్రంగా కడిగి, రెండు గ్లాసుల నీటిలో కనీసం మూడు నుండి గరిష్టంగా ఎనిమిది గంటల పాటు నానబెట్టాలి. చిరుధాన్యాలను నానబెట్టకుండా ఉపయోగించకూడదు. వంట: నానబెట్టిన సామలను అదే నీటితో అధిక మంటపై ఉడికించుకోవాలి. రుచి కోసం: తగినంత ఉప్పు వేసి, బాగా ఉడికించుకోవాలి. రుచి కోసం జీలకర్ర వేసి ఉడికించడం వల్ల గంజికి మంచి సువాసన వస్తుంది. అదనపు పదార్థాలు: క్యారెట్, బీట్రూట్, బీన్స్, పచ్చిమిరపకాయలు, ఉల్లిపాయలు లాంటి కూరగాయలను చేర్చుకోవడం వల్ల పోషక విలువలు పెరిగి, గంజి మరింత రుచిగా మారుతుంది. కూరగాయలను నేరుగా గంజితో పాటు ఉడికించుకోవచ్చు లేదా విడిగా ఉడికించి తర్వాత కలపవచ్చు. చివరిగా: గంజి బాగా ఉడికిన తర్వాత, కొత్తిరను తప్పనిసరిగా వేసుకోవాలి. కావాలనుకుంటే కొద్దిగా అల్లం కూడా జోడించవచ్చు. చివరగా, స్టవ్ ఆపివేయడానికి ముందు అర టీస్పూన్ లేదా కొద్దిగా ఎక్కువ మిరియాల పొడినిచేర్చి బాగా కలపాలి. దీంతో వేడి వేడి సామల గంజి సిద్ధంగా ఉంటుంది. వంట సమయం సుమారు 10-12 నిమిషాలు పడుతుంది. ఎక్కువసేపు నానబెడితే వంట సమయం తగ్గుతుంది. ఎప్పుడు తీసుకోవాలి: బరువు తగ్గాలనే లక్ష్యం ఉన్నవారు రాత్రిపూట 7:30 లోపు ఈ సామల గంజిని తీసుకోవాలి. కూరగాయలు కలిపి ఒక కప్పు నిండా తీసుకుంటే ఆకలి వేయకుండా ఉంటుంది. పది రోజుల్లోనే అద్భుతమైన ఫలితాలను గమనించవచ్చని పలువురు పేర్కొంటున్నారు. ఒకవేళ రాత్రి పూట మళ్ళీ ఆకలి అనిపిస్తే, నిద్రపోయే ముందు మజ్జిగ తాగవచ్చు. మజ్జిగ, పల్చటి సాంబార్ లేదా ఇంట్లో మిగిలిన కూరలను కూడా 7:30 లోపు తీసుకోవడం వల్ల బరువు తగ్గుతారని చెబుతారు. ఈ సామల గంజి సాధారణ బరువు తగ్గించే పద్ధతులతో పాటు ప్రోటీన్లను అందిస్తుంది.





## తాళం చెవితో వచ్చే మెటల్ ట్యాగ్ ఉపయోగమేంటో తెలుసా?

**వుదయం డెస్క్:** తాళం చెవులు పోగొట్టుకోవడం, కనిపించకుండా పోవడం సర్వసాధారణం. అందుకే రెండేసి తాళం చెవులు ఇస్తుంటారు. ఇలా పోగొట్టుకున్న సందర్భంలో మెటల్ ట్యాగ్‌పై ఉన్న కీ కోడ్ మీకు ఉపయోగపడుతుంది. ఈ కోడ్ ద్వారా కొత్త తాళం పొందొచ్చు. కోడ్‌ను అధీకృత సర్వీస్ సెంటర్లలో ఇస్తే ఒరిజినల్ కీ ఇస్తారు. అదే కోడ్ లేకపోతే లాక్ సెట్ మొత్తం మార్చాల్సి వస్తుంది. పైగా ఇది ఖరీదైన వ్యవహారం కూడా. ప్రస్తుతం ఆధునిక స్మార్ట్ కీలు వస్తున్నాయి. వాటి లోపల ఉండే ఎమర్జెన్సీ ఫిజికల్ కీని తయారు చేయడానికీ ఈ కోడ్ కీలకం. మెటల్ ట్యాగ్ కీ కోడ్ ఎంత ఉపయోగకరమో, అంత ప్రమాదకరం కూడా. కోడ్ తప్పుడు వ్యక్తుల చేతికి చిక్కితే, సులభంగా డూప్లికేట్ తాళాన్ని తయారుచేసే ప్రమాదం లేకపోలేదు.




## పెట్టుబడుల్లో మహిళా శక్తి

### 129 శాతం పెరిగి డీమ్యాట్ ఖాతాలు



**వుదయం డెస్క్ :** భారతీయ స్టాక్ మార్కెట్లలో మహిళా పెట్టుబడిదారుల సంఖ్య పెరుగుతోంది. కేవలం పొదుపు వరకే పరిమితం కాకుండా, సంపద సృష్టిలోనూ తాము సాటిగా నిలుస్తామని నిరూపిస్తున్నారు. 2021 నుంచి మహిళల డీమ్యాట్ ఖాతాల సంఖ్య ఏకంగా 129 శాతం వృద్ధి చెందిందని యాక్సిస్ డైరెక్ట్ తన తాజా నివేదికలో వెల్లడించింది. మహిళా మదుపరుల పెట్టుబడి సరళిని గమనిస్తే.. వారు స్వల్పకాలిక లాభాల కంటే దీర్ఘకాలిక ఆర్థిక భద్రతకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. మహిళల మొత్తం పెట్టుబడుల్లో అత్యధికంగా 49 శాతం వాటా మ్యూచువల్ ఫండ్‌లదే. క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా 33% మంది పెట్టుబడులు పెడుతున్నారు. ముఖ్యంగా 2645 ఏళ్ల మధ్య వయసున్న వారు సిప్ వైపు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. 25 ఏళ్లలోపు యువతులు, 45 ఏళ్ల పైబడిన వారు మాత్రం మ్యూచువల్ ఫండ్లలో ఏకమొత్తం పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. నేరుగా ఈక్విటీలు, కమొడిటీలు, డెరివేటివ్స్‌లాంటి అధిక నష్టభయం



ఉన్న విభాగాల్లో మహిళల భాగస్వామ్యం చాలా తక్కువగా ఉంది. ఇది వారి సురక్షిత, వైవిధ్యమైన పెట్టుబడి ఆలోచనను సూచిస్తోంది.

**డిజిటల్ బాటలో..:**
సాంకేతిక వినియోగంలోనూ మహిళలు వెనుకాడటం లేదు. స్టాక్ మార్కెట్‌లో పెట్టే ఈక్విటీ ఆర్డర్లలో 64 శాతం ఆన్‌లైన్ వేదికల ద్వారానే జరుగుతున్నాయి.'భారత పెట్టుబడి రంగంలో ఇదో గొప్ప మార్పు. మహిళలు కేవలం మార్కెట్లోకి అడుగుపెట్టడమే కాదు.. క్రమశిక్షణతో కూడిన పెట్టుబడి సంస్కృతిని అలవాటు చేసుకుంటున్నారు' అని యాక్సిస్ డైరెక్ట్ నివేదిక తెలిపింది. మహిళల భాగస్వామ్యం ఇలాగే కొనసాగితే, భారతీయ పెట్టుబడి వ్యవస్థలో వారు కీలకపాత్ర పోషిస్తారని అంచనా వేసింది.

## ఏప్రిల్ 1 నుంచి 15 మార్పులు!

**వుదయం డెస్క్:**




మరికొన్ని రోజుల్లో కొత్త ఆర్థిక సంవత్సరం (202627) ప్రారంభం కాబోతోంది. దీంతో ఏప్రిల్ 1 నుంచి అనేక ఆర్థిక పరమైన మార్పులు చోటు చేసుకోబోతున్నాయి. ఏటా కొత్త ఆర్థిక సంవత్సరంలో ఈ మార్పులు సహజమే అయినప్పటికీ.. కొత్త ఆదాయపు పన్ను చట్టం, లేబర్ కోడ్స్, బడ్జెట్ ప్రతిపాదనలు, రైల్వే టికెట్ క్యాన్సిలేషన్ నిబంధనల్లో సవరణల కారణంగా ఈ సారి పెద్ద సంఖ్యలో మార్పులు ఉండబోతున్నాయి. కాబట్టి ఉద్యోగులు, సాధారణ పౌరులు, ట్రేడర్లు, రైలు ప్రయాణికులు ఈ మార్పుల గురించి తెలుసుకోవాల్సిందే..

**ఇన్‌కం ట్యాక్స్ యాక్ట్, 2025:**
ఆదాయపు పన్ను చట్టం, 1961 స్థానే కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని కేంద్రం తీసుకొచ్చింది. ఏప్రిల్ 1 నుంచి కొత్త చట్టం అమల్లోకి రానుంది. సరళమైన భాషలో ఈ చట్టాన్ని రూపొందించారు. పన్నులు, పన్ను శ్లాబులు యథాతథంగా కొనసాగుతాయి.

**ట్యాక్స్ ఇయర్:**
గతంలో ఫైనాన్షియల్ ఇయర్ (ఎఫ్ వై), అసెస్‌మెంట్ ఇయర్‌గా (ఎవై) వ్యవహరించేవారు. దీంతో పన్ను చెల్లింపుదారులు గందరగోళానికి గురయ్యేవారు. ఇకపై ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు ఉండే కాలాన్ని ట్యాక్స్ ఇయర్‌గా వ్యవహరించనున్నారు.

**హెచ్ఆర్ఏ 50 శాతం:**
ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) కింద తమ మూల వేతనంలో 50% పన్ను మినహాయింపు పొందే నగరాల జాబితాను కేంద్రం ప్రస్తుత 4 నుంచి 8కి పెంచింది. ఇప్పటి వరకు దిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై నగరాలకే పరిమితమైన ఈ ప్రయోజనాన్ని.. కొత్త నిబంధనల ద్వారా హైదరాబాద్, పుణె, అహ్మదాబాద్, బెంగళూరు నగరాలకూ విస్తరించింది.

**హెచ్ఆర్ఏ పొందాలంటే ఇవి తప్పనిసరి:**
హెచ్ఆర్ఏ కింద మినహాయింపులు పొందాలంటే అద్దెదారు, ఇంటి యజమాని మధ్య ఉన్న అద్దె ఒప్పందం/సంబంధ వివరాలు వెల్లడించడం తప్పనిసరి. పాన్ వివరాలు కూడా ఇవ్వాలి. ఇది కూడా పాత పన్ను విధానం ఎంపిక చేసుకున్నవారికే!

**టేక్ హోమ్ తగ్గనుందా?:**
కొత్త లేబర్ కోడ్ నిబంధనల ప్రకారం ఒక ఉద్యోగి బేసిక్ శాలరీ మొత్తం జీతంలో (సిటిసి) కనీసం 50% ఉండాలి. ప్రస్తుతం చాలా కంపెనీల్లో బేసిక్ పే 3040% మాత్రమే ఉంటోంది. ఇది 50 శాతానికి పెరగడం వల్ల, దానిపై ఆధారపడి లెక్కించే పీఎఫ్, గ్రాట్యుటీ కంట్రిబ్యూషన్లు పెరుగుతాయి. ఈ మార్పు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

**ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్‌పై ఎస్‌టీటీ పెంపు:**
ఫ్యూచర్స్‌పై సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) 0.02 శాతం నుంచి 0.05 శాతానికి; ఆప్షన్స్ ప్రీమియం, ఆప్షన్స్‌పై ఎస్‌టీటీ 0.01 శాతం నుంచి వరుసగా 0.15శాతం, 0.125 శాతానికి పెంచుతూ బడ్జెట్‌లో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఏప్రిల్ 1 నుంచి ఎఫ్‌అండ్‌ఓ ట్రేడర్లపై ఈ ప్రభావం పడనుంది.

**పాన్‌కు దరఖాస్తు నిబంధనలు:**
ఇంతకుముందు పాన్ కార్డు పొందదాలంటే ఆధార్ సమర్పిస్తే సరిపోయేది. ఇకపై ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్, బర్త్ సర్టిఫికెట్ వంటి అదనపు పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

**రూ.10 లక్షలు దాటితే:**
- ఒక ఆర్థిక సంవత్సరంలో ఖాతాలో రూ.10 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ నగదు ఒకేసారి లేదా విడతల వారీగా జమ చేసినా, ఉపసంహరించుకున్నా పాన్ వివరాలు ఇకపై ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఒక రోజులో రూ.50 వేలు దాటితేనే పాన్ అడుగుతున్నారు.
- ఇళ్లు, స్థలాల కొనుగోలు, అమ్మకం, బహుమతి లేదా ఉమ్మడి డెవలప్‌మెంట్ ఒప్పందాల విషయంలో లావాదేవీ విలువ రూ.20లక్షలు దాటితే ఇకపై పాన్ తప్పనిసరి. ప్రస్తుతం ఈ పరిమితి రూ.10 లక్షలుగా ఉంది.
- ద్విచక్ర వాహనం సహా ఏ మోటారు వాహనమైనా, దాని ధర రూ.5 లక్షలు మించితే కొనుగోలుదారుడు పాన్ సమర్పించాల్సి ఉంటుంది. పాత చట్టంలో ద్విచక్ర వాహనాలకు ఈ నిబంధన లేదు. హోటళ్లు లేదా రెస్టారెంట్ల బిల్లులు, కన్వెన్షన్ సెంటర్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు చేసే చెల్లింపులు రూ.లక్ష దాటితే ఇకపై పాన్ సమర్పించాలి. ప్రస్తుతం హోటల్, రెస్టారెంట్ బిల్లు రూ.50 వేలు దాటితే పాన్ ఇవ్వాల్సి వస్తోంది.
- ప్రస్తుతం బీమా పాలసీ కొనుగోలు సమయంలో వార్షిక ప్రీమియం రూ. 50వేలు దాటితేనే పాన్ అడుగుతున్నారు. ఇకపై ప్రతి పాలసీకి పాన్ సమర్పించడం తప్పనిసరి.

**రైలు టికెట్ క్యాన్సిలేషన్ రూల్స్:**
రైల్వే టికెట్‌కు సంబంధించిన క్యాన్సిలేషన్ నిబంధనలు మారాయి. రైలు ప్రయాణానికి 8 గంటల లోపల టికెట్‌ను రద్దు చేస్తే ఎలాంటి రిఫండ్ రాదు. ఇంతకుముందు 4 గంటలుగా ఉండేది. అలాగే, రైలు బయల్దేరడానికి 24 గంటల ముందు నుంచి ఎనిమిది గంటల మధ్య ఎప్పుడైనా టికెట్టును రద్దు చేసుకుంటే 50%, 7224 గంటల మధ్య టికెట్లు రద్దు చేసుకుంటే 25% మొత్తాన్ని మినహాయించుకుంటారు. రైలు బయల్దేరడానికి కనీసం 72 గంటల సమయం ఉండగా టికెట్లను ఎప్పుడు రద్దు చేసుకున్నా క్యాన్సిలేషన్ రుసుములు మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని వాపసు చేస్తారు.

- పంజాబ్ నేషనల్ బ్యాంకు రోజువారీ ఏటీఎం నగదు విత్‌డ్రా పరిమితులను సవరించింది. ఎంపిక చేసిన డెబిట్ కార్డులపై నగదు విత్‌డ్రా పరిమితిని 50 శాతం మేర తగ్గించింది.
- మార్చి నెలలో ఇంట్లో వాడే వంటగ్యాస్ సిలిండర్ రూ.60, వాణిజ్య సిలిండర్ రూ.114.5 చొప్పున పెంచింది. ఏప్రిల్ 1న కూడా ఎల్‌పీజీ సిలిండర్ ధరలను కేంద్రం మరోసారి సవరించే అవకాశం ఉంది. దీంతో పాటు విమాన ఇంధన ధరలనూ సమీక్షించనున్నారు.

## ఈ-చెక్స్ వస్తున్నాయ్..
## ఆర్‌బీఐ కీలక ప్రకటన!

**వుదయం డెస్క్:**



చెల్లింపు వ్యవస్థను మరింత కొత్తగా మార్చే ప్రక్రియలో భాగంగా.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్తగా ఈచెక్స్ (ఎలక్ట్రానిక్ చెక్స్) ప్రవేశపెట్టాలని ప్రతిపాదించింది. ఈ చర్యకు కారణం భద్రతను పెంచడం.. వ్యాపార, వినియోగదారుల అవసరాలను తీర్చడం. ఆర్‌బీఐ తన పేమెంట్స్ విజన్ 2028 నివేదికలో.. చెక్స్ డిజైన్, భద్రతా లక్షణాలను సమగ్రంగా పరిశీలించనున్నట్లు తెలిపింది. దీని ద్వారా సౌకర్యం, ఒక్కసారిగా అమలులో ఉండే విధానం, మోసాల నివారణ, కొత్త చెల్లింపు విధానాలతో సర్దుబాటు సాధ్యమవుతుందని వెల్లడించింది.

**ఈచెక్ అంటే? :** ఈచెక్ అనేది కాగితపు చెక్కుకు డిజిటల్ రూపం. అంటే దీనిని కాగితంపై కాకుండా ఆన్‌లైన్‌లో పంపుతారు. చెల్లింపుదారుడు వివరాలను నింపి, డిజిటల్ పద్ధతిని ఉపయోగించి సురక్షితంగా సంతకం చేసి, దానిని చెల్లింపు గ్రహీతకు లేదా బ్యాంకుకు పంపుతారు. బ్యాంక్ దీన్ని సాధారణ చెక్‌లా పరిశీలించి ప్రాసెస్ చేస్తుంది. ఇది వేగంగా, సురక్షితంగా, పేపర్‌లెస్‌గా, ట్రాక్ చేయడానికి సులభంగా ఉంటుంది.

## భారత్‌లో దోహా బ్యాంక్ పూర్తిగా క్లోజ్!

**వుదయం డెస్క్:**




భారతదేశంలో పదేళ్లకు పైగా తన కార్యకలాపాలను సాగించిన దోహా బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే.. కటార్‌లోని దోహా బ్యాంక్ తన భారత్‌లోని రెండు శాఖలను మూసివేయాలని నిర్ణయించింది. కాగా ఇకపై కేవలం ఒక ప్రతినిధి కార్యాలయాన్ని మాత్రమే కొనసాగించనుంది. ఈ విషయాన్ని బ్యాంక్ ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది.
దోహా బ్యాంక్ భారతదేశంలో తన కార్యకలాపాలను జూన్ 2014 లో ప్రారంభించింది. మొదటి శాఖ ముంబైలో, తరువాత కొచ్చిలో రెండవ శాఖ ప్రారంభించింది. ఆ తరువాత 2016లో ఈ బ్యాంక్ భారతీయ మార్కెట్‌లో వృద్ధి చెందుతున్న ఆర్థిక పరిస్థితులను ఉపయోగించుకుని, గల్ఫ్ దేశం, భారతదేశం మధ్య రిమిటెన్స్ (ప్యారమిటెన్స్) అవకాశాలను లబ్ధిపరచడానికి ఇండియాలో సబ్సిడియరీ స్థాపించేందుకు అనుమతి కోసం ప్రయత్నిస్తుందని వార్తలు వచ్చాయి.
ఇప్పుడు దోహా బ్యాంక్ వ్యూహం మార్పుతో.. భారతదేశంలో ప్రత్యక్ష కార్యకలాపాలను తగ్గిస్తూ, ప్రతినిధి కార్యాలయం ద్వారా మాత్రమే తన ఉనికిని కొనసాగించనున్నది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. డబ్బులు జమ చేసుకోవడం విత్‌డ్రా చేయడం వంటివి ఇకపై ఉండదు. అయితే ఇది ఖతార్‌లోని ప్రధాన బ్యాంకుకు, భారతీయ కస్టమర్లకు మధ్య ఒక వారధిలా మాత్రమే పనిచేస్తుంది. అంటే వ్యాపార అవకాశాలను వెతకడం, దీనికి సంబంధించిన సమాచారాన్ని పంచుకోవడం వంటి పనులకు మాత్రమే ఇది పరిమితమై ఉంటుందన్నమాట.




## ధోని ఫ్యాన్స్ కు బ్యాడ్ న్యూస్



ఐపీఎల్2026 సీజన్ ఆరంభానికి ముందే ఎంఎస్ ధోని రూపంలో చెన్నై సూపర్ కింగ్స్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం పిక్క కండరాల గాయంతో ధోని.. తొలి రెండు వారాల్లో జరిగే మ్యాచ్‌లకు దూరం కానున్నాడని సీఎస్‌కే మేనేజ్‌మెంట్ ఇప్పటికే స్పష్టం చేసింది. అతడికి రెండు వారాల విశ్రాంతి అవసరమని వైద్యులు అంచనా వేశారు. కానీ ఇప్పుడు ఎంఎస్ కోలుకోవడానికి నాలుగు నుంచి వారాల సమయం పట్టనున్నట్లు తెలుస్తోంది. దీంతో అయితే మిస్టర్ కూల్ ఇప్పుడు ఏప్రిల్ చివరి వారం వరకు అందుబాటులో ఉండకపోవచ్చు అని పలు రిపోర్ట్‌లు పేర్కొంటున్నాయి. అంటే ధోని దాదాపు 6 మ్యాచ్‌లకు అందుబాటులో ఉండకపోవచ్చు. ధోని తిరిగి మళ్లీ ఏప్రిల్ 23న వాంఖడే స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగే మ్యాచ్‌లో ఆడే అవకాశముంది. ధోని స్థానంలో సంజూ శాంసన్ వికెట్ కీపర్‌గా వ్యవహరించనున్నాడు. ధోనికే ఇదే ఆఖరి ఐపీఎల్ సీజన్ అయ్యే అవకాశముంది.

## ప్రధాని మోదీ నోట సాధారణ క్రికెటర్ మాట





భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ నోట ఓ సాధారణ క్రికెటర్ మాట వినిపించింది. ఇవాళ (మార్చి 29) జరిగిన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో మోదీ ఆ క్రికెటర్ పేరును ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆ క్రికెటర్ పేరు ఆకిబ్ నబీ. జమ్మూ అండ్ కశ్మీర్‌కు చెందిన ఈ 29 ఏళ్ల కుడి చేతి వాటం మీడియం ఫాస్ట్ బౌలర్, ఇటీవల తన జట్టు తొలి రంజీ ట్రోఫీ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు.
సీజన్ మొత్తంలో 60 వికెట్లు తీసి, తన జట్టు 70 ఏళ్ల కలను సాకారం చేశాడు. ఈ కారణంగానే మోదీ నబీ పేరును మన్ కీ బాత్‌లో ప్రస్తావించారు. నబీ కారణంగా జమ్మూ అండ్ కశ్మీర్ సాధించిన విజయం అక్కడి యువతలో క్రీడలపై ఉత్సాహం పెంచిందని అన్నారు. నబీ స్ఫూర్తితో రాబోయే రోజుల్లో మరెందరో ఆ ప్రాంతం నుంచి క్రీడల్లోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఓ సాధారణ క్రికెటర్ మాట ప్రధాని నోట రావడంతో అతని పేరు సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతుంది.
దేశవాళీ క్రికెట్‌లో ఇప్పటికే పేరు గడించిన నబీ, త్వరలో ఐపీఎల్ అరంగేట్రం చేసే అవకాశం కూడా ఉంది. ఈ సీజన్ (2026) వేలంలో నబీని ఢిల్లీ క్యాపిటల్స్ రూ.8.40 కోట్ల భారీ మొత్తానికి కైవసం చేసుకుంది. రూ.30 లక్షల బేస్ ప్రైస్‌తో వేలంలోకి వచ్చిన నబీ కోసం రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ వంటి ఫ్రాంచైజీలు పోటీపడినా, చివరికి అతన్ని ఢిల్లీ క్యాపిటల్స్ దక్కించుకుంది. ఈ డీల్‌తో నబీ జీవితమే మారిపోనుంది. ఐపీఎల్‌లో అతను సత్తా చాటగలిగితే, టీమిండియా అవకాశాలు కూడా వచ్చే అవకాశం ఉంటుంది.
ఇదిలా ఉంటే, ఢిల్లీ క్యాపిటల్స్ కు సంబంధించి మిచెల్ స్టార్క్ అందుబాటులో లేకపోవడంతో అతని స్థానం ఖాళీగా ఉంది. పవర్‌ప్లేలో బంతిని రెండు వైపులా స్వింగ్ చేయగల నబీ ఆ లోటును భర్తీ చేసే అవకాశం ఉంది. ఢిల్లీ పేసర్లు లుంగి ఎంగిడి, దుష్మంత చమీరా మధ్య ఓవర్లలో బౌలింగ్ చేయడం ఇష్టపడతారు కాబట్టి, నబీ పవర్‌ప్లేలో కీలకంగా మారవచ్చు. ఢిల్లీ ఏప్రిల్ 1న లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగే మ్యాచ్‌తో ఐపీఎల్ 2026 ప్రయాణం మొదలుపెడుతుంది.

## సీఎస్‌కేకు మరో భారీ షాక్..
## విధ్వంసకర వీరుడికి గాయం



ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తమ తొలి మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. సోమవారం గౌహతి వేదికగా రాజస్తాన్ రాయల్స్ తో సీఎస్‌కే తలపడనుంది. ఈ మ్యాచ్‌కు ముందు సీఎస్‌కేకు భారీ ఎదురు దెబ్బ తగిలింది. దక్షిణాఫ్రికా యువ సంచలనం డెవాల్డ్ బ్రెవిస్ గాయం కారణంగా సీఎస్‌కే ఆడే తొలి మూడు మ్యాచ్‌లకు దూరం కానున్నట్లు తెలుస్తోంది. రెవ్‌స్పోర్ట్స్ నివేదిక ప్రకారం.. బ్రెవిస్ పక్కటెముకల కండరాల నొప్పి తో బాధపడుతున్నాడు. అతడు కోలుకోవడానికి దాదాపు రెండు వారాల సమయం పట్టనున్నట్లు సమాచారం. ఐపీఎల్2025 సీజన్ మధ్యలో సీఎస్‌కేతో బ్రెవిస్ చేరాడు. గత సీజన్‌లో బ్రెవిస్ దుమ్ములేపాడు. కేవలం 6 మ్యాచ్‌ల్లోనే 225 పరుగులు చేసి సత్తాచాటాడు. ఆ తర్వాత సౌతాఫ్రికా లీగ్ 202526లో కూడా అతడు తన పవర్ చూపించాడు. ప్రిటోరియా తరఫున 12 మ్యాచ్‌ల్లో 370 పరుగులు చేశాడు. అటువంటి విధ్వంసకర ప్లేయర్ గాయం బారిన పడడం సీఎస్‌కేకు గట్టి ఎదురు దెబ్బ అనే చెప్పాలి. మరోవైపు ఎంఎస్ ధోని కూడా కండరాల గాయంతో సతమతవుతున్నాడు. అతడు దాదాపు సీఎస్‌కే ఆడే ఆరు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఇప్పుడు ఈ జాబితాలో బ్రెవిస్ కూడా చేరాడు. అంతకంటే ముందు ఆసీస్ స్పీడ్ స్టార్ నాథన్ ఎల్లీస్ ఏకంగా సీజన్ మొత్తానికే దూరమయ్యాడు.

## చరిత్ర సృష్టించిన సునీల్ నరైన్



ఐపీఎల్ 2026లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో ఇవాళ (మార్చి 29) జరుగుతున్న మ్యాచ్‌లో కేకేఆర్ ఆల్‌రౌండర్ సునీల్ నరైన్ చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్ తుది జట్టులో చోటు దక్కించుకోవడంతో ఐపీఎల్ చరిత్రలో అత్యధిక మ్యాచ్‌లు (190) ఆడిన విదేశీ ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పాడు.
ఈ క్రమంలో తన దేశీయ (వెస్టిండీస్) సహచరుడు కీరన్ పోలార్డ్‌ను (189) అధిగమించాడు. ఈ విభాగంలో నరైన్, పోలార్డ్ తర్వాతి స్థానాల్లో ఏబీ డివిలియర్స్ (184), డేవిడ్ వార్నర్ (184), డ్వేన్ బ్రావో (161) ఉన్నారు. నరైన తన ఐపీఎల్ కెరీర్‌లో ఆడిన 190 మ్యాచ్‌లు కేకేఆర్ తరఫునే ఆడటం మరో విశేషం.
మ్యాచ్ విషయానికొస్తే.. ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. అయితే టాస్ గెలిచిన ఆనందం వారికి ఎంతో సేపు మిగల్లేదు. హార్దిక్ ఆహ్వానం మేరకు బ్యాటింగ్‌కు దిగిన కేకేఆర్ పవర్ ప్లే ఆప్షన్‌ను సద్వినియోగం చేసుకుంటూ పేట్రేగిపోతుంది.
ఓపెనర్లు అజింక్య రహానే (10 బంతుల్లో 21; 3 సిక్సర్లు), ఫిన్ అలెన్ (14 బంతుల్లో 32; ఫోర్, 5 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నారు. 4 ఓవర్ల తర్వాత కేకేఆర్ స్కోర్ 570గా ఉంది.

**తుది జట్లు..**
ముంబై ఇండియన్స్: రోహిత్ శర్మ, ర్యాన్ రికెల్టన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా (కెప్టెన్), షెర్ఫానే రూథర్‌ఫోర్డ్, నమన్ ధీర్, శార్దూల్ ఠాకూర్, మయాంక్ మార్కండే, ఎయం ఘజన్‌ఫర్, ట్రెంట్ బౌల్ట్, జస్ప్రీత్ బుమ్రా
కేకేఆర్: ఫిన్ అలెన్, అజింక్యా రహానే (కెప్టెన్), కామెరూన్ గ్రీన్, అంగ్క్రిష్ రఘువంశీ (వికెట్ కీపర్), రింకు సింగ్, రమణదీప్ సింగ్, అనుకుల్ రాయ్, సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తి, వైభవ్ అరోరా, బ్లెస్సింగ్ ముజారబానీ




# బాహుబలి రికార్డుకి ధురంధర్ బ్రేక్



ధురంధర్ 2 చిత్రం ఇప్పుడు ఇండియన్ బాక్సాఫీస్‌ని షేక్ చేస్తోంది. బాలీవుడ్,టాలీవుడ్ అని మాత్రమే కాదు ఎక్కడ చూసినా.. ఈ సినిమా గురించే మాట్లాడుతున్నారు. విడుదలై 10రోజులు గడుస్తున్నా..థియేటర్స్‌కి జనం పోటెత్తుతున్నారు.కలెక్షన్ల పరంగా ఈ చిత్రం రికార్డులను బద్దలు కొడుతుంది. 10రోజుల్లో రూ. 1200కోట్లకు పైగా వసూళ్లను సాధించింది.దాంతో పాటు బాహుబలి రికార్డుని కూడా బద్దలు కొట్టింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ.. 'బాహుబలి 2 రికార్డుని ధురంధర్ 2 అధిగమించింది' అని ఓ నెటిజన్ పోస్ట్ పెట్టారు. దీనిపై బాహుబలి నిర్మాత శోభు యార్లగడ్డ స్పందించారు. 'నేను కూడా ఇటీవల ధురంధర్ 2 చూశా. ఆద్యంతం ఆస్వాదించా. ఈ చిత్రం అన్ని రికార్డులు బద్దలు కొడుతూ..కొత్త బెంచ్‌మార్క్‌ను నెలకొల్పడం ఆనందంగా ఉంది. చిత్ర బృందానికి అభినందనలు' అని పేర్కొన్నారు.

# సుయోధన సక్సెస్ మీట్



ప్రజ్వలా లైన్ క్రియేషన్స్ బ్యానర్ పై ప్రియదర్శి, ద్రిషిక చందర్ హీరో హీరోయిన్ గా డైలాగ్ కింగ్ సాయికుమార్, సీనియర్ హీరోయిన్ ప్రేమ కీలకపాత్రల్లో నటించిన చిత్రం "సుయోధన". వై ఎస్ మాధవ్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని బోసుబాబు నిడుమోలు నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం (ఈ నెల 27న) ప్రేక్షకుల ముందుకొచ్చి మంచి విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సక్సెస్ మీట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. నిర్మాత బోసుబాబు నిడుమోలు మాట్లాడుతూ సుయోధన చిత్రంతో మొదటి ప్రయత్నంలోనే మా చిత్రానికి మంచి విజయాన్ని అందించారు. మా నెక్స్ మూవీకి ఇంతకంటే పెద్ద బ్లాక్ బస్టర్ కొట్టాలని అనుకుంటున్నాం. ప్రస్తుతం అన్ని ఏరియాల నుంచి రెస్పాన్స్ బాగుంది. ఈ సినిమా చేసిన అనుభవంతో నెక్స్ మరో మంచి చిత్రంతో మీ ముందుకు వస్తాం. అయితే ఈ సారి ఏదైనా పేరున్న సంస్థతో భాగస్వామ్యం అయి సినిమా నిర్మించాలని అనుకుంటున్నాం. ఎంతో కొంత అనుభవం, అవగాహన తెచ్చుకున్న తర్వాత చిత్ర పరిశ్రమలోకి రావాలని కొత్త నిర్మాతలకు నా సలహా. త్వరలోనే మంచి సబ్జెక్ట్ చూసుకుని కొత్త మూవీ అనౌన్స్ చేస్తాం. ఈ సారి మా సంస్థలో రాబోయే సినిమా పక్కా ప్లానింగ్ తో ఉంటుంది. అన్నారు.

# నా కెరీర్ బెస్ట్ ఫిల్మ్ మిరాకిల్





"కుమారి 21ఎఫ్, ఈడో రకం ఆడో రకం, ఒదెల రైల్వే స్టేషన్" వంటి బ్లాక్ బస్టర్స్ నా కెరీర్ లో ఎన్నో ఉన్నప్పటికీ... తాజాగా నేను చేస్తున్న "మిరాకిల్" నా కెరీర్ లో మోస్ట్ మెమరబుల్ మూవీ అవుతుంది. థాంక్స్ టు డైరెక్టర్ ప్రభాస్ నిమ్మల" అని అన్నారు క్రేజీ హీరోయిన్ హెబ్బా పటేల్.

సైదా ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై రమేష్ ఎగ్గిడి శ్రీకాంత్ మొగదాసు చందర్ గౌడ్ సంయుక్తంగా నిర్మిస్తున్న వినూత్న కథాచిత్రం "మిరాకిల్"లో హెబ్బా పటేల్ హీరోయిన్ గా నటిస్తోంది..సీనియర్ హీరోలు సురేష్, శ్రీరామ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో రణధీర్ బీసు హీరో. "సత్య గ్యాంగ్, ఫైటర్ శివ" చిత్రాల దర్శకుడు ప్రభాస్ నిమ్మల దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రం మూడో షెడ్యూల్ హైదరాబాద్ పరిసర గ్రామమైన "కొండమడుగు"లో పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజలు, యూనిట్ సభ్యులందరి సమక్షంలో ప్రెస్ మీట్ నిర్వహించింది "మిరాకిల్" చిత్ర బృందం. తన కెరీర్ బెస్ట్ ఫిల్మ్ గా "మిరాకిల్" నిలిచిపోతుందని ప్రకటించడం ద్వారా ఈ చిత్రంపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది హీరోయిన్ హెబ్బా పటేల్.

కొండమడుగు గ్రామం నడిబొడ్డున గ్రామ ప్రజలతో కిక్కిరిసిన ఈ మీడియా సమావేశంలో... హీరో శ్రీరామ్, హీరోయిన్ హెబ్బా పటేల్, దర్శకుడు ప్రభాస్ నిమ్మల, చిత్ర కథానాయకుడు రణధీర్ బీసు, ఈ చిత్రంతో ప్రతి నాయకుడిగా పరిచయమవుతున్న నరేష్‌నాయుడు, సినిమాటోగ్రాఫర్ సురేందర్ రెడ్డి, సెకండ్ అండ్ థర్డ్ హీరోయిన్స్ నవ్యశ్రీ, అక్షర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీకాంత్, ఈ చిత్రంలో ఫోరెన్సిక్ ఆఫీసర్ గా నటిస్తున్న సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీతోపాటు... కొండమడుగు గ్రామ పెద్దలు పాల్గొని మాట్లాడారు!

# గూగుల్ మై ఫ్రెండ్ మూవీ సాంగ్స్ లాంఛ్

ప్రణవ్ రావ్ రాణి, ప్రజక్త గైక్వాడ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "గూగుల్ మై ఫ్రెండ్". ఈ చిత్రాన్ని డాలర్స్ మీడియా అండ్ ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్ పై దివాకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. బహు భాషల్లో పలు హిట్ చిత్రాలతో దర్శకుడిగా పేరు తెచ్చుకున్న గోవింద్ వరాహ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. "గూగుల్ మై ఫ్రెండ్" సినిమాకు టి. వెంకటేష్ రెడ్డి, బి.ప్రసన్నాంజనేయులు సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా త్వరలో తెలుగు, మరాఠీ భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. దర్శకుల సంఘం అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య, సాయి రాజేశ్, వి సముద్ర, శైలేష్ కొలను, కొండా విజయ్ కుమార్ చేతుల మీదుగా ఈ చిత్ర సాంగ్స్ లాంఛ్ కార్యక్రమం నిర్వహించారు.

డైరెక్టర్ సాయిరాజేశ్ మాట్లాడుతూ మా దర్శకుల సంఘం సభ్యులు, మా ఆత్మీయులు గోవింద్ డైరెక్ట్ చేస్తున్న గూగుల్ మై ఫ్రెండ్ మూవీ సాంగ్స్, టీజర్ ఇతర కంటెంట్ చూశాం. ఈ కంటెంట్ అంతా ప్రామిసింగ్ గా ఉంది. ఒకేసారి తెలుగు, మరాఠీ భాషల్లో ఆయన ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాకు మంచి రిలీజ్ కుదిరి ప్రొడ్యూసర్ కు డబ్బులు, గోవింద్ గారికి పేరు రావాలని కోరుకుంటున్నా. అన్నారు.






# అనకాపల్లి టీజర్ విడుదల

భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద కంద్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నిర్మిస్తున్న చిత్రం 'అనకాపల్లి'. ఈ సినిమాకి ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహిస్తున్నారు. కంద్రేగుల కుమార్ రాజా కో ప్రొడ్యూసర్‌గా చేసిన ఈ మూవీలో విక్రమ్ సహిదేవ్, సంధ్య వశిష్ట జంటగా నటించారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లేని అందించడమే కాకుండా త్రినాథరావు నక్కిన ఓ ముఖ్య పాత్రను కూడా పోషించారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను రిలీజ్ చేశారు.

'అనకాపల్లి.. ఇక్కడ మనకు కావాల్సింది దక్కాలంటే.. ఎదుటోడికి మనమంటే భయం ఉండాలి.. భయం లేనోడికి పిడికిలి రుచి చూపించాలి.. అదీ తెలిసినోడికి ఓబీ రుచి చూపించాలి.. అప్పటికీ లొంగకపోతే ఆడి పుర్రె పచ్చడయ్యేలా తూటాల వర్షం కురిపించాలి.. మనకి కావాల్సింది దక్కించుకోవాలి'.. అంటూ మొదలైన ఈ టీజర్‌లో అన్ని రకాల ఎమోషన్స్ చూపించారు.

మాస్ ఆడియెన్స్‌కి నచ్చే యాక్షన్ సీక్వెన్స్, యూత్ మెచ్చే లవ్ ట్రాక్, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి కనెక్ట్ అయ్యే ఎమోషనల్ సీన్స్ ఇలా అన్నీ టీజర్‌లో ఉన్నాయి. ఇక అన్ని వర్గాల ఆడియెన్స్‌ని ఆకట్టుకోబోతోన్నామని ఈ టీజర్‌తో టీం చెప్పకనే చెప్పేసింది. ఈ టీజర్‌లోని యాక్షన్ సీక్వెన్స్, విజువల్స్, మ్యూజిక్ ఇలా అన్నీ కూడా రా అండ్ రస్టిక్‌గా ఉన్నాయి. ప్రేమ కథ కూడా చాలా కొత్తగా ఉండబోతోన్నట్టు అనిపిస్తోంది. మరి ఈ అనకాపల్లి కథ ఏంటో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

# లీడర్ యాక్షన్ ట్రైలర్ రిలీజ్



లెజెండ్ శరవణన్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "లీడర్". ఈ చిత్రాన్ని లెజెండ్ శరవణ స్టోర్స్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తోంది. దర్శకుడు ఆర్ ఎస్ దురై సెంథిల్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో పాయల్ రాజ్ పుత్ హీరోయిన్ గా నటిస్తోంది. "లీడర్" సినిమా ఏప్రిల్ 3న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఇప్పటికే రిలీజ్ చేసిన ఈ చిత్ర టీజర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు ఈ సినిమా నుంచి యాక్షన్ ట్రైలర్ విడుదల చేశారు.

"లీడర్" మూవీ యాక్షన్ ట్రైలర్ ఎలా ఉందో చూస్తే ట్రైన్ లో జరిగే ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ తో ఈ యాక్షన్ ట్రైలర్ ప్రారంభమవుతుంది. 'ఈ ప్రపంచంలో ఏ సహాయం దేవుడు నేరుగా చేయడు, మనుషుల మూలంగానే అన్ని మంచి పనులు జరుగుతాయి, మనం వాళ్లనే నమ్మాలి...' అనే డైలాగ్ కథానాయకుడి ఆలోచనను, దృక్పథాన్ని తెలియజేస్తుంది. ట్రైన్ లో, పోర్ట్ ఏరియాలో, ఫారెస్ట్ లో జరిగే హై వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్స్ ఈ సినిమాలోని గ్రాండియర్ మేకింగ్ ను చూపిస్తున్నాయి. మెయిన్ క్యారెక్టర్స్, ఆ పాత్రల రియాక్షన్స్ ను గ్లింప్స్ లా చూపించారు. భారీ యాక్షన్ సీక్వెన్సులను ఆకట్టుకునేలా పర్ ఫార్మ్ చేశారు హీరో లెజెండ్ శరవణన్. ట్రైలర్ చివరలో వచ్చిన తండ్రీ, కూతురు ఎమోషనల్ సీన్ హార్ట్ టచింగ్ గా ఉంది. భారీ యాక్షన్, సెంటిమెంట్ తో పాటు అన్ని కమర్షియల్ హంగులతో "లీడర్" సినిమా ప్రేక్షకుల్ని థియేటర్స్ లో అలరించనున్నట్లు ఈ యాక్షన్ ట్రైలర్ తో తెలుస్తోంది.

# డాన్ బాస్కో ఫస్ట్ లుక్ రిలీజ్



ఎమర్జింగ్ ప్రొడక్షన్ హౌస్ రాధా కృష్ణ ఎంటర్‌టైన్‌మెంట్స్, విదేశాల్లో అలాగే తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో బ్లాక్‌బస్టర్ సినిమాలను విజయవంతంగా డిస్ట్రిబ్యూట్ చేసి తనదైన గుర్తింపు తెచ్చుకున్న సంస్థ రాధాకృష్ణ ప్రొడక్షన్ హౌస్ ఇప్పుడు కామెడీ ఎంటర్‌టైనర్ 'డాన్ బోస్కో' సినిమాను రూపొందిస్తోంది. వెంకట్ ఉప్పుటూరి నిర్మాత. యంగ్ హీరో రుష్య దత్త ఈ సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకంది. జైలర్, నా సామి రంగ సినిమాలతో గుర్తింపు పొందిన అందాల నటి మిర్నా మీనన్ ఇందులో హీరోయిన్‌గా నటిస్తోంది. శనివారం మేకర్స్ ఈ సినిమా ఫస్ట్ లుక్‌తో పాటు ఒక ముఖ్యమైన అప్‌డేట్‌ను విడుదల చేశారు. పోస్టర్‌లో రుష్య దత్త చాలా స్టైలిష్‌గా కనిపిస్తూ, ఒక చేతిలో కటానా లాంటి కత్తిని పట్టుకుని, మరో చేతితో కాలర్‌ను పైకెత్తుతూ బోల్డ్ పోజ్‌లో కనిపిస్తున్నారు

ఫస్ట్ లుక్ పోస్టర్ ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'ప్రతి రీయూనియన్ జ్ఞాపకాల కోసమే కాదు.. కొన్ని విముక్తి (రిడెంప్షన్) కోసం కూడా ఉంటాయి' అనే క్యాప్షన్ మరింత ఎగ్జైట్‌మెంట్‌ను క్రియేట్ చేస్తున్నాయి. ఇందులో మురళీ శర్మ ప్రిన్సిపాల్ విశ్వనాథ్ పాత్రలో కీలక పాత్ర పోషిస్తున్నారు. మిర్నా మీనన్ లెక్చరర్ సుమతి పాత్రలో కనిపించనుంది. మౌనిక, రాజ్‌కుమార్ కాసిరెడ్డి, విష్ణు ఓయ్ తదితరులు కూడా ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. కచ్చితంగా ఈ మూవీ మంచి ఎంటర్‌టైనర్‌గా మెప్పించనుందనే హామీ కలుగుతోంది.

# డెకాయిట్ నుంచి చిచ్చుబుడ్డి సాంగ్

బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ ఏప్రిల్ 10న థియేటర్లలోకి రాబోతున్న పాన్‌ఇండియా యాక్షన్‌రొమాంటిక్ థ్రిల్లర్ 'డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించనున్నారు. ప్రోమోలు, ఫస్ట్ సింగిల్ 'రుబారూ' ఒక రగ్గడ్ హీరోని ప్రజెంట్ చేశాయి. ఈ రోజు మేకర్స్ ఈ సినిమా సెకండ్ సింగిల్ 'చిచ్చుబుడ్డి'ని విడుదల చేశారు. ఇది శేష్ క్యారెక్టర్ సరికొత్త కోణాన్ని చూపిస్తోంది. 'చిచ్చుబుడ్డి' పాట సినిమా మూడ్‌ను పూర్తిగా మార్చేస్తుంది. ఇందులో అడివి శేష్ తొలిసారిగా తెరపై డ్యాన్స్ చేస్తూ హైఎనర్జీ అవతార్‌లో అదరగొట్టారు.



# నేనేదో అనుకున్నా..





వివాహం అంటే సింపుల్‌గా, సైలెంట్‌గా అయిపోవాలి.. అత్యంత ఆత్మీయుల మధ్యలో ఈ తంతు పూర్తయిపోవాలని ఒకప్పుడు అనుకునేదాన్ని. కానీ, ఇక్కడ మా ప్రేమ మా మనసుల్ని మాత్రమే కాదు, రెండు కుటుంబాల్ని కలిపింది. వారి ఆచారాలు, సాంప్రదాయాలు, ప్రేమానురాగాల మధ్య సాదాసీదాగా కంటే భిన్నంగా, ప్రత్యేకంగా వివాహం జరిగింది.

**పెళ్లంటే ఏంటి?**

అయినా కూడా నావరకు ఈ పెళ్లంటే ఏంటి? అని పదేపదే ఆలోచిస్తూనే ఉన్నాను. ఇది కేవలం ఒక ఆర్భాటం కాదు, ప్రపంచమంతా చూసేలా జీవితంలో ఒకసారి చేసుకునే వేడుక మాత్రమే కాదు, ఇది మన అంతర్గతంగా జరిగే ఒక అద్భుత అనుభవం. స్త్రీ, పురుష శక్తుల కలయిక.. శివుడు, శక్తి (అమ్మవారు) మనలోనూ, మన మధ్యలోనూ ఉన్న అనుభూతి. కొన్నిసార్లు బయట శబ్దాలు నా గొంతుకంటే పెద్దగా అనిపించాయి.



**తెలియని ప్రశాంతత**

కానీ, అతడిని చూసిన ప్రతిసారి ఏదో తెలియని ప్రశాంతత. సడన్‌గా ఆ శబ్దం వినిపించకపోయేది. నేను చేయగలను అనుకున్నాను. అతడిని నా భాగస్వామిగా ఎంచుకుంటున్నాను అని నాకు నేను మరోసారి చెప్పుకున్నప్పుడు మనసు శాంతించింది. ఇద్దరం కలిసి నడుద్దాం.. అలాగే ఒకరికొకరం ఎదగడానికి అవకాశం ఇద్దాం. మన మధ్యలోని అనుబంధాన్ని కొనసాగిద్దాం.. ఇదే నాకు అన్నింటికన్నా ఎంతో ముఖ్యమైనది.



**పెళ్లి సులభంగా జరగలేదు**

సమయం వచ్చింది కాబట్టి మా పెళ్లి జరగలేదు, నేను సిద్ధంగా ఉన్నాను కాబట్టే ఈ వేడుక జరిగింది. నేను ఊహించినంత సులభంగా ఈ పెళ్లి జరగలేదు. కానీ, ఎంతో నిజాయితీగా, అందంగా, అర్థవంతంగా వివాహం జరిగింది అని రాసుకొచ్చింది. ఇది చూసిన అభిమానులు కొత్త జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. తెలుగు బిగ్‌బాస్ మూడో సీజన్‌లో పాల్గొన్న పునర్నవి.. ఉయ్యాల జంపాల, పిట్టగోడ, సైకిల్ వంటి పలు చిత్రాల్లో నటించింది.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.